

మార్పా.. మూతా?

మద్యం బార్‌ల లైసెన్స్‌ల విషయమై యజమానులకు, ప్రభుత్వానికి మధ్య సాగుతున్న వ్యవహారం రసవత్తరంగా మారింది. ఎక్సైజ్ అధికారులు దరఖాస్తుల కోసం ఒత్తిడి చేస్తుండగా, 'అసలే నష్టాల్లో ఉన్నాం.. లాటరీలో పోటీపడాలంటే మావల్ల కాదు' అంటూ వ్యాపారులు దరఖాస్తుకు నిరాకరిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో 26 బార్‌లకు సంబంధించి కేవలం నలుగురు మాత్రమే ఫీజు చెల్లించి దరఖాస్తు చేశారు. ప్రభుత్వం కనీసం ఒక్కో బార్‌కు 4 ప్రకారం 104 దరఖాస్తులు రావాలని నిర్దేశించింది. లైసెన్స్ ఫీజును కూడా గతంకన్నా కొంత మొత్తం పెంచింది. ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ నిర్వహిస్తామని స్పష్టం చేసింది. ఈ విధానం ఇబ్బంది అని భావించిన వ్యాపారులు దరఖాస్తుకు విముఖత చూపుతున్నారు. - (ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

- బార్‌ల లైసెన్స్‌ల దరఖాస్తుకు వ్యాపారుల విముఖత
- కనీసం రావాల్సింది 104.. వచ్చింది 4
- భారీ ఆదాయంపై ప్రభుత్వం దృష్టి
- భరించలేమంటున్న నిర్వాహకులు
- ఒత్తిడి చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మద్యం దుకాణాల్లో ప్రముఖ బ్రాండ్లు, ధర తక్కువ

గత ప్రభుత్వంలో ప్రభుత్వ వైన్ షాపుల కన్నా బార్‌లలోనే నాణ్యమైన, ప్రముఖ బ్రాండ్ల మద్యం దొరికేది. అప్పట్లో జే బ్రాండ్‌లపై మద్యం ప్రియులకు అనేక అనుమానాలున్నాయి. దీంతో బార్‌లలో అధిక ధర అయినప్పటికీ కొనుగోలు చేశారు. అయితే ప్రజా ప్రభుత్వం మార్చిన మద్యం విధానంలో దుకాణాల్లోనే అన్నిరకాల మద్యం దొరుకుతోంది. తాజాగా వైన్‌షాపుల వద్ద పర్మిట్ రూంలకు కూడా అనుమతి ఇవ్వడంతో బార్‌ల అవసరం తగ్గింది. మరోవైపు ప్రభుత్వం వైన్‌షాపులకు అమ్మే మద్యం ధరకన్నా 15 శాతం అధిక ధరకు బార్‌లకు విక్రయిస్తుంది. దానికితోడు అదనపు సౌకర్యాల ఖర్చు ఉంటుంది. ఫలితంగా మద్యం ప్రియులకు కావాల్సిన మందు వైన్‌షాపుల్లోనే తక్కువ ధరకు లభిస్తోంది. దీంతో బార్‌ల లైసెన్సు మంజూరు విధానంలో లాటరీలో పాల్గొనేందుకు వ్యాపారులు పెద్దగా ముందుకురావడం లేదు. మంగళవారం సాయంత్రానికి దరఖాస్తు గడువు ముగుస్తున్నా నలుగురు మాత్రమే చేశారు. దీంతో ప్రభుత్వ ఒత్తిడి మేరకు ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగినప్పటికీ ఆశించిన ఫలితం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మంగళవారం తర్వాత తన విధానంలో ఏమైనా మార్పు చేస్తుందా? లేదా? అనేది చూడాల్సి ఉంది.

ఉన్న వారిని కొనసాగిస్తేనే ముందుకొస్తామని సంకేతం



వ్యాపారులు కూడా ప్రభుత్వం లైసెన్సు ఫీజు పెంచినప్పటికీ ప్రస్తుతం ఉన్న వారిని కొనసాగిస్తే ముందుకొచ్చేందుకు సిద్ధమన్న సంకేతాన్ని పంపారు. అంతేగాక కొత్తగా లాటరీలో పాల్గొనే వారికి ఎదురుకాబోయే సమస్యలను వివరించి వారు దరఖాస్తు వేయకుండా ఆపగలుగుతున్నారు. ఈ సమస్య ఏమలుపు తిరుగుతుందో అర్థంకాక పరిస్థితులు అనుకూలంగా మారితే దరఖాస్తులకు డీడీలు కట్టేందుకు మరో వందమంది తమ పేర్లను ఎక్సైజ్ అధికారుల వద్ద నమోదు చేసుకున్నట్లు తెలిసింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం తన విధానం మార్చుకుంటుందా లేక వ్యాపారులు బార్‌ల మూతకు సిద్ధపడతారా అనేది చూడాల్సి ఉంది.

చెన్నయ్యపై.. ఈ నిర్లక్ష్యం ఏందయ్యా..!

- మందకొడిగా మార్కాపురంలోని చారిత్రక ఆలయ గోపురాల నిర్మాణం
- నిధులున్నా పూర్తికాని పనులు
- వైసీపీ హయాం నుంచి అదే తంతు

7

బ్లాక్ బద్ధలు!

జోరుగా ఎరువులు, విత్తనాల అక్రమ వ్యాపారం



రెండ్రోజుల క్రితం దర్శి మండలం రాజంపల్లి ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

- బిల్లులు లేకుండా విచ్చలవిడిగా విక్రయాలు
- లాభార్జనే ధ్యేయంగా వ్యాపారుల ఇష్టారాజ్యం
- పెద్దఎత్తున నిల్వ చేసి కృత్రిమ కొరతకు ప్రయత్నం
- ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి విజిలెన్స్ అధికారులు
- వరుస దాడులతో వెలుగులోకి అక్రమ నిల్వలు

జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలతో సాగు జోరందుకుంది. ఇదేసమయంలో ఎరువులు, విత్తనాల వ్యాపారుల మాయాజాలం ప్రారంభమైంది. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎరువులను బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ కొందరు నిర్భయంగా ఎలాంటి అనుమతులు లేకుండానే ఎరువులను నిల్వ చేస్తున్నారు. దీన్ని సర్కారు సీరియస్‌గా తీసుకొంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను రంగంలోకి దించింది. దీంతో బ్లాక్ బద్ధలవుతోంది. రెండు రోజుల క్రితం దర్శిలో చేసిన దాడుల్లో అవాక్కయ్యే నిజాలు వెలుగు చూశాయి. సోమవారం పొదిలిలో తనిఖీలు చేపట్టగా ఓ వ్యాపారి అనుమతిలేని గోడౌన్‌లో రూ.20లక్షల విలువైన 1,704 ఎరువుల బస్తాలను అక్రమంగా నిల్వ ఉంచినట్లు తేలింది. ముండ్లమూరు మండలంలోని రెండు దుకాణాల్లో 220 బస్తాల ఎరువును స్వాధీనం చేసుకున్నారు. అలాగే కొందరు విత్తనాల విక్రయంలోనూ అక్రమాలకు పాల్పడుతూ రైతులను దగా చేస్తున్నారు.



పొదిలిలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

దర్శి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : దర్శి ప్రాంతంలో ఎరువులు, విత్తనాల అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు వ్యాపారులు బిల్లులు లేకుండానే ఎరువులు విక్రయిస్తున్నారు. మరికొందరు అక్రమంగా నిల్వ చేస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు లైసెన్సులు లేకుండానే అనేక రకాల విత్తనాలు ఇతర జిల్లాల నుంచి తెచ్చి అమ్ముతున్నారు. అవి నాణ్యమైనవా? లేదా? అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా లాభార్జనే ధ్యేయంగా వ్యాపారాలు చేస్తున్నారు. స్థానిక అధికారులు పూర్తిస్థాయిలో నిఘా పెట్టకపోవటం వీరికి వరంలా మారింది.

విజిలెన్స్ తనిఖీల్లో వెలుగులోకి అక్రమాలు

రెండురోజుల క్రితం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దర్శి మండలం రాజంపల్లి గ్రామంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేయగా విస్తుపోయే అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఒక ఎరువుల దుకాణంలో సీఎస్ఎఫ్‌సీ కంపెనీకి చెందిన 128 బస్తాల యూరియా పట్టుబడింది. ఆ వ్యాపారి ఆ యూరియాకు సంబంధించిన బిల్లులు లేకుండా విక్రయిస్తున్నారు. దాన్ని ఎక్కడ నుంచి, ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేశారనే విషయం చెప్పడం లేదు. దర్శి, కురిచేడు పట్టణాల్లో కూడా కొంత మంది ఇదేవిధంగా అక్రమ

మిగతా 6లో...

ఎరువుల అక్రమ నిల్వలు సీజ్

- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు
- రూ.20.43 లక్షల విలువైన 1,704 బస్తాలు స్వాధీనం
- షాప్ యజమానిపై 6ఏతోపాటు క్రిమినల్ కేసు
- ముండ్లమూరు మండలంలో 270 బస్తాలు పట్టివేత

6



మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

రాజ్యాధికారమే లక్ష్యంగా..

- ఆ దిశగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా పిలుపు
- ఘనంగా ముగిసిన సీపీఐ రాష్ట్ర మహాసభలు
- 64 తీర్మానాలు, 101మందితో కౌన్సిల్ ఎన్నిక
- పలు పుస్తకాల ఆవిష్కరణ
- కీలక నేతలు నారాయణ, రామకృష్ణలతోపాటు తెలంగాణ నేత కూనంనేని హాజరు

ఒంగోలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజకీయాలలో వందేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీని గ్రామస్థాయి నుంచి అన్ని వర్గాల్లో విస్తరింపజేసి పటిష్ట పరిస్తే భవిష్యత్‌లో రాజ్యాధికారం మనదేనని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఆ దిశగా పార్టీ శ్రేణులు మరింత పట్టుదల, కార్యదీక్షతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మూడు రోజులుగా ఒంగోలులో జరుగుతున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. పార్టీ అగ్రనేత సురవరం సుధాకరరెడ్డి మృతితో తొలి రెండు రోజులు సభలకు హాజరుకాలేకపోయిన రాజా మూడో రోజైన సోమవారం సాయంత్రం ముగింపు సభలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సమర్థవంతమైన నాయకత్వం ఉందని ఆయన అన్నారు. విస్తృతంగా ప్రజా బహుళ్యంలోకి పార్టీని తీసుకెళ్లాలని కోరారు. సీపీఐ రాష్ట్ర

మిగతా 6లో...

టీచర్ల అంతర్ జిల్లా బదిలీల నిబంధనలు సడలింపు

- రేపటి వరకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఒంగోలు విద్య, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలకు అర్హతల నిబంధనలను ప్రభుత్వం సడలించింది. ఇందుకు సంబంధించి పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలకు రెండు సంవత్సరాల కనీస సర్వీసు నిబంధనకు మినహాయింపు ఇచ్చారు. అంటే సర్వీసుతో సంబంధం లేకుండా జీవిత భాగస్వామి (స్పౌజ్) పరస్పర బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్, కార్పొరేషన్లలో

మిగతా 6లో...

డీఎస్సీ ఎంపిక జాబితాలు సిద్ధం

- 28న సర్టిఫికెట్ల పరిశీలన
- అభ్యర్థుల మొబైల్ ఫోన్‌లకు మెసేజ్‌లు
- 672 పోస్టులకు 672 మంది ఎంపిక

ఒంగోలు విద్య, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక ఎట్టకేలకు పూర్తయింది. మంగళగిరిలోని పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఉదయం ప్రారంభమైన ప్రక్రియ సోమవారం సాయంత్రం ఆరు గంటలకు కొలిక్కివచ్చింది. అభ్యర్థుల ఎంపిక కోసం సహాయ సహకారాలు

మిగతా 6లో...

వేడుకలకు ముస్తాబైన గణనాథుడు

- వాడవాడలా వెలుస్తున్న లంబోధరుడు
- ఎత్తయిన విగ్రహాల ఏర్పాట్లలో భక్తులు
- మట్టి వినాయకుడికి పెరిగిన ఆదరణ
- పోలీసు నిబంధనలు అమలు
- రేపటి నుంచి చవితి ఉత్సవాలు

7



ఒంగోలులో గణేశుని విగ్రహాన్ని కొని తీసుకెళుతున్న భక్తులు



ఒడా చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న రియాజ్, పక్కన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు ముత్తుముల, దామచర్ల, ఉగ్ర, ఇతర నేతలు

అట్టహాసంగా..

- రియాజ్ ప్రమాణ స్వీకారం
- తరలి వచ్చిన కూటమి నాయకులు
- ఒడా చైర్మన్‌గా బాధ్యతలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా షేక్ రియాజ్ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒడా వైస్‌చైర్మన్ అయిన జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ రియాజ్‌తో ప్రమాణం చేయించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన కూటమి నాయకులు, ఒంగోలు నియోజకవర్గంలోని జనసేన పార్టీ శ్రేణులు రియాజ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. బొకేలు, పూలమాలలతో ముంచెత్తారు. రియాజ్‌తోపాటు ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్‌ను సత్కరించారు. కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ నాయకులు రియాజ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి వేదికైన ఏ-1 కన్వెన్షన్ హాలు వద్ద పెద్దఎత్తున బాణ సంచా కాల్చారు. సోమవారం సాయంత్రం స్థానిక ఒడా కార్యాలయంలో రియాజ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

త్వరలోనే మార్కాపురం జిల్లా

- 2026 కల్లా వెలిగొండ ద్వారా నీళ్లు అందిస్తాం
- మంత్రులు రవికుమార్, స్వామి
- ఘనంగా మార్కాపురం ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

6

కోడిగుడ్ల వాహనం చోరీ.. ఆపై పరారీ

అడ్డుకున్న పోలీసులను ఢీకొట్టిన ఒడిస్సా యువకుడు

ఇరువురి కానిస్టేబుళ్లకు తీవ్రగాయాలు

కాలువలో దిగబడడంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలీస్‌స్టేషన్ వద్ద డ్రైనేజీలోకి దిగిన కోడి గుడ్ల లోడుతో ఉన్న బొలెరో వాహనం

సంతనూతలపాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చోరీ చేసిన కోడిగుడ్ల లోడుతో ఉన్న వాహనాన్ని ఒడిస్సాకు చెందిన యువకుడు తీసుకుని పారిపోతుండగా ఆపేందుకు యత్నించిన ఇరువురు కానిస్టేబుళ్లను ఢీకొట్టాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి 10.30 గంటలకు సంతనూతలపాడు పోలీస్టేషన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చీమకుర్తిలో కోడిగుడ్ల వ్యాపారం చేస్తున్న అలాసు ధాకర్ అనేవ్యక్తి తన షాపు వద్ద ఆదివారం రాత్రి వాహనంలోని కోడుగుడ్లను దించుకుంటున్నాడు. ఈక్రమంలో చీమకుర్తిలో ఒక్వారీలో పనిచేస్తున్న ఒడిస్సాకు చెందిన నాయక్ అనే యువకుడు, కోడిగుడ్ల వ్యాపారి సుధాకర్‌కు తెలియకుండా బొలెరో వాహనం తీసుకుని పరారయ్యాడు. వెంటనే గమనించిన సుధాకర్ చీమకుర్తి పోలీస్టేషన్‌కు సమాచారం ఇచ్చి వాహనాన్ని వెంబడించాడు. చీమకుర్తి పోలీసులు వెంటనే సంతనూతలపాడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంతనూతలపాడు పోలీస్టేషన్ వద్ద బొలెరో వాహనంతో పరారవుతున్న యువకుడిని పట్టుకునేందుకు అప్రమత్తమయ్యారు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో సంతనూతలపాడు పోలీస్టేషన్ వైపునకు కోడుగుడ్ల లోడుతో ఉన్న బొలెరో వాహనం వస్తుండటంతో గమనించిన కానిస్టేబుళ్లు నారాయణరెడ్డి, హస్సేన్‌లు వాహనం ఆపేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని ఢీకొట్టి వాహనాన్ని పోలీస్టేషన్ పక్కన డ్రైనేజీలోకి దింపాడు. ఈఘటనలో కానిస్టేబుళ్లు నారాయణరెడ్డి కాలు, చేయికి, హస్సేన్‌కు ఓ కాలుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను ఒంగోలు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు నాయక్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీ ఎంపిక జాబితాలు సిద్ధం

(5వపేజీ తరువాయి)

అందించేందుకు అన్ని జిల్లాల నుంచి డీఈవో కార్యాలయ ఐటీ సెల్ సిబ్బంది మంగళగిరిలోనే మకాం వేసి డైరెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రంతా జాగారం చేశారు. జాబితాలు తయారు చేయడం, వాటిలో దొర్లిన తప్పులను సవరించడం ఇలా.. రెండు రోజులపాటు అభ్యర్థుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించేందుకు పెద్దఎత్తున కసరత్తు చేశారు. సోమవారం సాయంత్రానికి తుది జాబితా సిద్ధం కావడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు రాత్రి ఏడు గంటల నుంచి ఎంపికైన అభ్యర్థుల మొబైల్ ఫోన్‌లకు మెసేజ్‌లు, సర్టిఫికెట్ల పరిశీలనకు కాల్‌లెటర్లు పంపడం ప్రారంభమైంది.

ఒక్కో పోస్టుకు ఒక్కరే ఎంపిక

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 28వ తేదీన ఒంగోలు నగరపరిధి చెరువుకొమ్ముపాలెంలోని శ్రీ సరస్వతి జూనియర్ కళాశాలలో ప్రారంభం కానుంది. అందుకోసం మొత్తం 18 బృందాలను నియమించారు. డీఎస్సీలో ప్రకటించిన పోస్టులకు ఒకదానికి ఒక్క అభ్యర్థినే ఎంపిక చేశారు. ఆ ప్రకారం ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలలకు ప్రకటించిన 599 పోస్టులకు 599 మందిని, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రకటించిన 30 పోస్టులకు 30 మందిని ఎంపిక చేశారు. గిరిజన సంక్షేమ, చెంచు పాఠశాలలకు ప్రకటించిన 43 పోస్టులకు 43మంది ఎంపికయ్యారు. మొత్తం 672 పోస్టులకు 672 మందిని మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో ఎంపిక చేసి సర్టిఫికెట్ల పరిశీలనకు ఆహ్వానించారు. హాజరుకాని అభ్యర్థుల ఎంపిక రద్దవుతుంది. అదేవిధంగా ఆయా పోస్టులకు అవసరమైన అన్ని విద్య, ఇతర అర్హతలు లేకపోతే వారిని అనర్హులుగా ప్రకటిస్తారు. మెరిట్‌లో అదే రోస్టర్‌లో ఉండే తర్వాత అభ్యర్థికి అవకాశం ఇస్తారు. సర్టిఫికెట్ల పరిశీలనకు అవసరమైన అన్ని ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు.

రైతులకు అందుబాటులో యూరియా

మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగుకు అవసరమైన స్థాయిలో యూరియాను అందుబాటులో ఉంచుతున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందన్నారు. ఆర్‌ఎస్‌కే స్థాయిలో ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. యూరియాలో 70శాం ఆర్‌ఎస్‌కేలకు, 30శాతంప్రైవేటు షాపులకు ఇస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీపై అందించే యూరియాను ఇతర అవసరాలకు వినియోగించినా, కొరత ఉందని పుకార్లు పుట్టించినా, అక్రమంగా నిల్వ ఉంచినా, అధిక ధరలకు విక్రయించినా సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌ఎస్‌కేలు, ప్రైవేటు షాపులను తనిఖీ చేసేందుకు రెవెన్యూ, పోలీస్, వ్యవసాయశాఖ అధికారులతో మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీలు మంగళవారం నుంచి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే వాననీటిని భూమిలోకి ఇంకింప చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ దిశగా గ్రామాల వారీగా నీటి సంరక్షణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. భూగర్భనీటిమట్టాన్ని పెంచేందుకు తొలుత ఇంకుడు గుంతల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లుతెలిపారు. అనంతరం పలు అంశాలపై కలెక్టర్ మండల స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేసు, వివిధ శాఖల అధికారులు వరలక్ష్మి, చిరంజీవి, జోసెఫ్‌కుమార్, శ్రీనివాసరావు, హరికృష్ణ, బాలశంకరరావు, గోపిచంద్, డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, నారాయణ ఉన్నారు.

పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర తమీమ్ అన్సారియా చెప్పారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను, జ్యూట్‌సంచులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా పర్యావరణ ఇంజనీర్ రాఘవరెడ్డి పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈకార్యక్రమంలో వలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ సంస్థ చైర్మన్ వీరభద్రాచారి పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య



మాట్లాడుతున్న దామచర్ల సత్య

పొన్నలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య చెప్పారు. సోమవారం చెరుకూరు గ్రామంలో సొసైటీ చైర్మన్ వడ్డే మాల్యాద్రి ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొన్నారు. మాల్యాద్రితో పాటు డైరెక్టర్లు కే మాల్యాద్రి, ఆదెయ్యకు అభినందనలు తెలిపారు. సత్య మాట్లాడుతూ నాగిరెడ్డి పాలెం నుంచి చెరుకూరు వరకు రోడ్డు నిర్మాణానికి మంత్రి స్వామితో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చెరుకూరు గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ భవనాల మరమ్మతులకు నిధులు సమకూరుస్తామని చెప్పారు. సంగమేశ్వర ప్రాజెక్టును పూర్తి చేసి గ్రామాల్లో ప్రజలకు తాగు, సాగు నీరు అందేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనావాసరావు, మండల సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సహకార సంఘం ఆవరణలో మర్రిపూడి సొసైటి నూతన అధ్యక్షుడు ఎర్రమోతు శ్రీనివాసులు ప్రమాణ శ్రీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు అన్నివేళల అండగా ఉంటానన్నారు. త్వరలో టంగుటూరు, పొదిలి రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎర్రంరెడ్డి వెంకటరెడ్డి, రాచపూడి ఇసాక్ పాల్గొన్నారు.

త్వరలోనే మార్కాపురం జిల్లా కల సాకారం

26కల్లా వెలిగొండ ద్వారా నీళ్లు అందిస్తాం

జగన్ పార్టీ విమర్శలను నమ్మేస్థితిలో ప్రజలు లేరు

మంత్రులు రవికుమార్, స్వామి

మార్కాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాలవాంఛ అయిన మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు కల త్వరలోనే సాకారం కానుందని విద్యుత్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిలు చెప్పారు. మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ, పలు పీఏసీఎస్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం రాత్రి స్థానిక ఏఎంసీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు రవికుమార్, స్వామి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాను ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి ఉపసంఘం నివేదిక అందజేస్తుందన్నారు. మరో రెండు నుంచి మూడు నెలల్లోనే మార్కాపురం జిల్లా ప్రకటన వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా 2026లో నీళ్ల ఇచ్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకుంటూ మండలానికి రెండు డ్రోన్‌లను సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తోందన్నారు. బేస్తవారిపేట నుంచి ఒంగోలు వరకు నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అభ్యర్థన మేరకు మార్కాపురం నుంచి తర్లుపాడు వరకు డబుల్ రోడ్డు, మార్కాపురం చెరువు కట్ట అభివృద్ధికి తప్పకుండా నిధులు సాధించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఇంతటి దుర్మార్గపు ప్రతిపక్షాన్ని ఎన్నడూ చూడలేదు

ఒక్కసారి అవకాశం ఇవ్వమని రాష్ట్రాన్ని రావణాకాష్టం చేసిన జగన్‌రెడ్డికి ఇంకా సిగ్గు రాలేదని ఎమ్మెల్యే కందుల చెప్పారు. ప్రజలు 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్షంలో కూర్చోబెడితే ఇంకా వారిని తప్పుదోవ పట్టించడానికి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారన్నారు. అర్హులైన ఏ ఒక్కరికీ పింఛన్ తొలగించే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, నేత కడియాల లలిత్‌సాగర్, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు రామాంజులరెడ్డి, నాసర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్ల అంతర్ జిల్లా బదిలీల నిబంధనలు సడలింపు

(5వపేజీ తరువాయి)

పనిచేస్తున్న టీచర్లు, హెచ్‌ఎంలు, ఎంఈవోలు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. 2027 జూలై 31లోపు ఉద్యోగ విరమణ చేయనున్న వారు అనర్హులు.

షెడ్యూల్ ఇదీ..

- ఈనెల 27వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- 28 వరకు ఎంఈవోల పరిశీలనకు గడువు ఇచ్చారు.
- 29న డీఈవోలు పరిశీలిస్తారు.
- ఈనెల 30,31 వరకు దరఖాస్తులను పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయానికి సమర్పించారు.
- వచ్చేనెల 1,2 తేదీల్లో డైరెక్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి సమర్పిస్తారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా..

(5వపేజీ తరువాయి)

కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ పేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్లకోసం రాష్ట్ర వ్యాప్తంగా మిలిటెంట్ పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ఉధృత పోరాటాలు చేయాలని, ప్రత్యేకించి యువజన, విద్యార్థులను సమీకరించాలని సూచించారు. తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాల ద్వారా ప్రజల్లో పలుకుబడి పెంచుకోవాలన్నారు. మూడు రోజుల పాటు జరిగిన మహాసభల్లో వివిధ అంశాలపై మొత్తం 64 తీర్మానాలు చేసి వాటి అమలు కోసంపోరాడాలని నిర్ణయించారు. ముగింపులో 101 మందితో రాష్ట్ర నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. పలు పుస్తకాలను ఆవిష్కరించారు. సభలో సీపీఐ జాతీయ నేతలు డాక్టర్ నారాయణ, రావుల వెంకయ్య, అక్కినేని వజన, రాష్ట్ర నేతలు జేవీవీఎస్ మూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జీ.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు ఉన్నారు.

బీజేపీ నేత సూర్యకల్యాణ్‌చక్రవర్తికి సత్కారం



సూర్యకల్యాణ్‌చక్రవర్తిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్‌గా నియమితులైన క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్‌చక్రవర్తిని ఘనంగా సత్కరించారు. యూఎస్ నుంచి సోమవారం ఒంగోలు చేరుకున్న ఆయనను బీజేపీ నాయకులు స్థానిక చెన్నకేశవమాన్యంలోని వికసిత భారత్ ట్రస్ట్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర పదాధికారుల జాబితాలో కొన్నేళ్లుగా జిల్లా పేరే లేదని, అలాంటిది కల్యాణ్ చక్రవర్తిచేసిన సేవలను గుర్తించి ఈసారి జిల్లాలోచోటు కల్పించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ తనపై ఎంతోనమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు బీజేపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమరసింహం, అశోక్‌రెడ్డి, బొద్దులూరి ఆంజనేయులు దామోదర్, విజయారావు, బాలకోటయ్య, గరికపాటి వంశీకృష్ణ, సత్యవతి, పి. అపర్ణ, కోమలరావు, రమేష్, కావూరి వాసు, సీతారామాంజనేయులు, బాలినేని కళ్యాణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ లక్ష్య సాధనకు కృషి చేసి సమాజంలో ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతిగృహంలో విద్యార్థులను జేడీ శీలం పరివర్తన భవనంలోకి మార్పు చేసే కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం-2, 3కు సంబంధించి రూ.5.12 కోట్లతో డీఎంఎఫ్ నిధులతో అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరివర్తన భవన్‌లోకి మార్పుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుందని కలెక్టర్ తెలిపారు. సాంఘికసంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ మాట్లాడుతూ జిల్లాలోని 38 వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలుకల్పించేందుకు రూ.13కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే డీఎంఎఫ్ నిధుల నుంచి కూడా రూ.19 కోట్లుమంజూరైనట్లు చెప్పారు. జిల్లాలో బాల్యవివాహాలను నివారించేందుకు పేద విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. బాలికల వసతి గృహాలకు రూ.5.12కోట్లు, చీమకుర్తిలోని బాలికలవసతి గృహానికి రూ.2కోట్లు, ఒంగోలులోని బాలుర వసతిగృహానికి రూ.3కోట్లు, పీవీఆర్ హైస్కూలులో అదనపు గదుల నిర్మాణానికి రూ.75 లక్షలు, పరివర్తన భవన్ మరమ్మతులకు రూ.60 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నగర కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వసతిగృహాల్లో విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి నుంచి వచ్చిన వారేనని తెలిపారు.

అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక మలేరియా కార్యాలయంలో సోమవారం మెగా ఆరోగ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మదుసూదనరావు మాట్లాడుతూ కీటక జనిత, వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు, మెదడువాపువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలుతీసుకోవాలన్నారు. మెడికల్‌కాలేజీ అసిస్టెంట్‌ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ప్రదీప్‌కుమార్‌మాట్లాడుతూ సంక్రమిత వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ డి.నళిని నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు.

క్యాన్సర్ బాధితులను గుర్తించాలి

జిల్లాలో క్యాన్సర్ బాధితులను గుర్తించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు ఆదేశించారు. పరిచయం-ఆంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ సంరక్షణ పురోగతిపై ఎన్‌సీడీ4.0 కార్యక్రమంపై సోమవారం ఏఎన్‌ఎంల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 10 బ్యాచ్‌లుగా విభజించి బ్యాచ్‌కు 28 మంది వంతున 464 మందికి శిక్షణ ఇస్తామని చెప్పారు.

మెడికల్ విద్యార్థినికి చేయూత

అవీఇవీ



విద్యార్థినికి నగదు అందచేస్తున్న డాక్టర్ జవహర్

చీమకుర్తి,ఆగస్టు 25(ఆంధ్ర జ్యోతి): కాకినాడలోని రంగరాయ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన చీమకుర్తి పట్టణానికి చెందిన పేద విద్యార్థిని కొమ్ము సమీక్షకు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ జవహర్ చేయూతనందించారు.సోమవారం సమీక్షకు పదివేల రూపాయల నగదు అందచేసి అభినందించారు.వైద్యపరంగా మెరుగైన సేవలను భవిష్యత్‌లో అందించాలని ఈ సందర్భంగా జవహర్ కోరారు .ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి మెడికల్ సీటు సాధించటం పట్ల అభినందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'నేత్రదానం' విజయవంతంగా నిర్వహించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా, డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం నుంచి వచ్చేనెల 8వతేదీ వరకు జరగనున్న నేత్రదానం పక్షోత్సవాలను విజయవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో సోమవారం పక్షోత్సవాల కరపత్రాలను అవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ' నేత్రదానం చేయండి ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించండి' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, బ్లైండ్ కంట్రోల్ అధికారి డాక్టర్ నళిని తదితరులు ఉన్నారు.

ఎరువుల అక్రమ నిల్వలు సీజ్

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

రూ.20.43లక్షల విలువైన 1,704 బస్తాలు స్వాధీనం

షాప్ యజమానిపై 6ఏతోపాటు క్రిమినల్ కేసు



అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులను స్వాధీనం చేసుకున్న అధికారులు

పొదిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పొదిలిలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు చేశారు. అనుమతి లేకుండా ఓ గోడౌన్‌లో నిల్వ చేసిన 20 రకాలకు చెందిన 1,704 ఎరువుల బస్తాలను స్వాధీనం చేసుకుంటున్నారు. వీటి విలువ సుమారు రూ.20.43 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. విజిలెన్స్ సీఐ రవిబాబు కథనం మేరకు.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న 4 ఎరువుల దుకాణాలలో సోదాలు నిర్వహించారు. శ్రీలక్ష్మీట్రేడర్స్ దుకాణం తాళం వేసి ఉండడంతో అధికారులు యజమానికి ఫోన్ చేసినప్పటికీ స్పందించ లేదు. దీంతో తహసీల్దార్, ఎస్ఐల సమక్షంలో తాళాలు పగులగొట్టేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న దుకాణ యజమాని గుమస్తాను పంపించి తాళాలను తీయించారు. అక్కడ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆ దుకాణానికి సంబంధించి వెంకయ్య స్వామి గుడి ఎదురుగా ఉన్న అనుమతిలేని గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ రికార్డులో నమోదు చేసిన దానికి, గోడౌన్‌లో ఉన్న నిల్వలకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. సుమారు 20 రకాలకు చెందిన 1,704 ఎరువుల బస్తాలను అనుమతి లేకుండా అక్కడ నిల్వ ఉంచినట్లు నిర్ధారణకు వచ్చారు. వాటిని సీజ్ చేశారు. దుకాణ యజమాని రాజశేఖరరెడ్డిపై 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేయనున్నట్లు సీఐ రవిబాబు తెలిపారు. ప్రభుత్వం ఎరువుల కొరత లేదని ఇప్పటికే ప్రకటించిందని, దుకాణదారులు ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ పాల్, ఎస్సై నాగేశ్వరరావు, కానిస్టేబుల్ కృష్ణ, సురేష్, వ్యవసాయాధికారి డి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. గత వైసీపీ పాలనలో ఇదే దుకాణంలో పెద్దఎత్తున అక్రమ నిల్వలు దాచిపెట్టగా అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిడితో దాడి చేసేందుకు వచ్చిన అధికారులు వెనక్కి వెళ్లినట్లు తెలిసింది.

ముండ్లమూరు మండలంలో 270 బస్తాల ఎరువులు స్వాధీనం

ముండ్లమూరు మండలం పసుపుగల్లులోని శ్రీనాగార్జున ఫెర్టిలైజర్ ఎరువుల దుకాణం, చింతలపూడిలోని శ్రీమల్లికార్జున ట్రేడర్స్‌పై సోమవారం సాయంత్రం ఏకకాలంలో విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 1.56లక్షల విలువైన 270 బస్తాల ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని సీజ్ చేశారు.

కొనకనమిట్లలో..

కొనకనమిట్ల : మండలంలోని పెదారికట్ల గ్రామంలో పురుగుమందులు, ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి ప్రకాష్‌రావు సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగు మందులు, ఎరువుల షాపులవారు బిల్లులు తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలని సూచించారు. షాపులైసెన్స్ డాక్యుమెంట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవోఎస్ రవికాంత్, విక్రమ్ పాల్గొన్నారు.

'బ్లాక్' బద్ధలు!

(5వపేజీ తరువాయి)

వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం యూరియాకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. బిల్లులు లేకుండా యూరియా ప్రైవేట్ షాపులకు ఎలా వస్తుందో అధికారులు నిగ్గు తేల్చాల్సివుంది.

లైసెన్స్ లేని షాపులకు విత్తనాలు

రాజంపల్లి గ్రామంలోని దుకాణంలో విజిలెన్స్ తనిఖీల సందర్భంగా కరీంనగర్‌కు చెందిన ఒక విత్తనాల సంస్థ నుంచి ఎంటీయూ 1156 రకం వరి విత్తనాలు 90 బస్తాలు, ఆర్పీఎం సీడ్స్‌కు చెందిన సీఆర్‌ఐ 009 రకం 150 బస్తాలు, నంద్యాలకు చెందిన మరో కంపెనీకి చెందిన డీపీటీ 5402 రకం వరి విత్తనాలు 25 బస్తాలు పట్టుబడ్డాయి. ఆ షాపు యజమానికి విత్తనాలు విక్రయించే లైసెన్స్ లేదు. అయినప్పటికీ యథేచ్ఛగా ఇతర జిల్లాకు చెందిన విత్తనాలు తెచ్చి రైతులకు విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం విత్తనాల సంస్థలు లైసెన్సులు ఉన్న షాపులకు మాత్రమే సరఫరా చేయాలి. అందుకు విరుద్ధంగా ఆయా కంపెనీల విత్తనాలు లైసెన్సులు లేని షాపులకు ఎలా చేరుతున్నాయో, నేరుగా వారు విక్రయిస్తున్నారా, చేతులు మారి ఇక్కడకు వస్తున్నాయా అనే విషయాలు విచారణలో తేలాల్సి ఉంది. విజిలెన్స్ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి విచారిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు అప్రమత్తమై ఎరువులు, విత్తనాల విక్రయాలను నిబంధనల మేరకు జరిగే విధంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేడుకలకు ముస్తాబైన గణనాథుడు



- వాడవాడలా వెలుస్తున్న విగ్రహాలు
- ఎత్తయిన విగ్రహాలు..
- భారీ ఏర్పాట్లలో భక్తులు
- పోలీసుల పర్యవేక్షణలో
- నిబంధనలు అమలు
- రేపటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్/కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుడు సిద్ధమయ్యాడు. పండుగకు వారం రోజుల ముందు నుంచే జిల్లా అంతటా ఉత్సవాల సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా యువత అత్యంత అమితంగా ఇష్టపడే ఈ పండుగను తమ కాలనీలో ఏర్పాటు చేసే విగ్రహాల గురించి అందరూ చెప్పుకోవాలనే విధంగా భారీ విగ్రహాలతో పాటు మండపాలను ముస్తాబు చేస్తున్నారు. ఇంకొందరు పీఓపీ, తాటిపీచు, కొబ్బరి పీచుతోపాటు పలు చోట్ల పర్యావరణాన్ని కాపాడేందుకు కాలుష్య రహిత విగ్రహాలపైనా ఆసక్తి చూపుతున్నారు. 10 నుంచి 25 అడుగుల వరకు ఎత్తు ఉండే విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. వివిధ ఆకృతులలో రూపుదిద్దుకున్న గణనాథుని విగ్రహాల కోసం విజయవాడ, హైదరాబాద్, కావలి, నెల్లూరు వంటి ప్రాంతాలకు వెళ్లి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో విగ్రహం ఎత్తు, ఆకారం, ఆకర్షణను బట్టి రూ.25 వేల నుంచి రూ.3లక్షల వరకు పలుకుతోంది. రాజస్థాన్ కళాకారులతోపాటు స్థానిక కళాకారులు కూడా అందుకు అనుగుణంగా ఆకట్టుకనే ఆకృతులతో బొమ్మలను సిద్ధం చేస్తున్నారు. మరోవైపు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు రేపు పండుగ రోజున లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు, ఫ్రెండ్స్ క్లబ్ తోపాటు పలువురు పర్యావరణ ప్రేమికులు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీకి సిద్ధం చేశారు.

● పోలీసుల నిబంధనలు ఇవీ...

ఆహ్లాదకరమైన వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ దామోదర్ ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాలు నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లౌడ్ స్పీకర్లు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలవరకు మాత్రమే అనుమతి ఉందని, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, మతపరమైన ప్రదేశాలలో మైకులు ఉపయోగించకూడదని తెలిపారు. ముఖ్యంగా డీజే సౌండ్ సిస్టమ్స్ ఉపయోగించే విషయంలో పోలీసులు అనుమతులు లేకుండా చేపడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండపాలలో రాత్రి పూట కమిటీ సభ్యులు కాపలా ఉండాలని తెలిపారు.

● నిమజ్జనం నిబంధనలు..

నిమజ్జనం, ఊరేగింపు విషయంలో నిబంధనలు పాటించాలి. ఆ సమయంలో కులాలు, మతాలు లేదా పార్టీలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే నినాదాలు, అనుచిత ప్రదర్శనలు, అసభ్యకరమైన నృత్యాలు నిషేధం. డీజే, బాణసంచాకు అనుమతి లేదు. నిమజ్జన వాహనాలను లైసెన్స్ ఉన్న డ్రైవర్ మాత్రమే నడపాలి. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా కమిటీ సభ్యులు తగినంత మంది వలంటీర్లను ఏర్పాటు చేయాలి నిమజ్జన ప్రదేశాలలో గజ ఈతగాళ్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి. పరిస్థితి తేడాగా ఉంటే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని జిల్లా పోలీసు శాఖ సూచించింది.



ఒంగోలులో వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి తరలిస్తున్న భక్తులు



అమ్మకానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు

పొగాకు కొనుగోళ్లలో సమతుల్యం పాటించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : పొగాకు కొనుగోళ్లలో సమతుల్యం పాటించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. పొగాకు కొనుగోళ్లపై బోర్డు రీజనల్ మేనేజర్ రాజుదొరైలతో సోమవారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా చర్చించారు. కొనుగోళ్లకు సంబంధించి పొగాకు కంపెనీలు ఇచ్చిన ముందస్తు రిక్వైర్మెంట్స్, జిల్లాలో పొగాకు ఉత్పత్తి, ఇప్పటి వరకు కొనుగోలు, బ్యాలెన్స్ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రేడ్ పొగాకును ఎక్కువగా తిరస్కస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అన్ని రకాల ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ దిశగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఐటీసీ మార్కెటింగ్ మేనేజర్‌కు సూచించారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలపై సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీల పరిష్కారంపై దృష్టిసారించి క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా సకాలంలో పరిష్కరించాలన్నారు. పరిష్కారంలో ఎండార్స్‌మెంట్ సక్రమంగా ఇచ్చారా, లేదా అని ఆడిట్ బృందం పరిశీలన చేస్తుందని చెప్పారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తున్నందున అర్జీదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆయా శాఖలకు సంబంధించి డాక్యుమెంట్స్‌ను ఈపీటీఎస్ వెబ్ సైట్‌లో ప్రతిరోజూ అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, పార్థసారథి, కుమార్, జాన్సన్ పాల్గొన్నారు.

చిన్నారిని హింసించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

నాగులుప్పలపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారిని హింసించిన కేసులో ప్రధాన నిందితుడికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు పదివేల జరిమానాను విధిస్తూ ఒంగోలు స్పెషల్ జేఎఫ్‌సీఎం ఎక్సైజ్ కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. మాచవరం గ్రామానికి చెందిన భూపతి సుధీర్ అదే గ్రామానికి చెందిన మహిళతో సహజీవనం చేస్తున్న క్రమంలో ఆమె కుమార్తె మూడేళ్ల చిన్నారి తమకు అడ్డుగా ఉందనినిరంతరం చిత్రహింసలకు గురి చేసేవాడు. 2021లో చిన్నారిని హింసిస్తున్న సుధీర్‌పై అప్పటి శిశుసంరక్షణ అధికారి పురుషోత్తమరావు నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.అప్పటి ఎస్‌ఐ శశికుమార్ కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితుడిపై చార్జ్‌షీట్‌ను కోర్టులో హాజరుపరచారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రావణ్‌కుమార్ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. పోలీసులు సరైన సమయంలో సాక్షులను కోర్టులో హాజరుపరచగా నిందితుడు సుధీర్‌పై నేరం రుజువు కావడంతో స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయాధికారి కోమలవల్లి నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష రూ.10,000 జరిమాన విధిస్తూ తీర్పు నిచ్చారు. సరైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్షపడేలా క్రియా శీలక పాత్ర పోషించిన నాగులుప్పలపాడు పోలీసులను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్లు జైలు

ఒంగోలు క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన హనుమంతునిపాడు మండలానికి చెందిన ధనేకుల తిరుపతయ్యకు మూడేళ్ల జైలు శిక్ష రూ.7000 జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి కె.శైలజ సోమవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... హనుమంతునిపాడు మండలానికి చెందిన ఓ మైనర్ బాలిక బడ్డీ బంకులో ఒంటరిగా ఉండగా తిరుపతయ్య వెళ్లి కూల్‌డ్రింక్ కొన్నాడు. తల్లిదండ్రులు ఇంట్లో లేరని గుర్తించి బాలికను బయటకు పిలిచాడు. ఎందుకు పిలిచావని అడుగుతుండగా తిరుపతయ్య ఆ బాలిక నోరును ఓ చేతితో మూసి అనుచితంగా ప్రవర్తించాడు.అయినప్పటికీ బాలిక పెద్దగా కేకలు వేయగా పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు ఊరునించి వచ్చి అడగడంతో తిరుపతయ్య తన పట్ల అనుచితంగా ప్రవర్తించాడని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు హనుమంతినిపాడు పోలీసు స్టేషన్‌లో 2000 అక్టోబర్ 9న కేసు నమోదైంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయాధికారి శైలజ.. నిందితుడు తిరుపతయ్యపై నేరారోపణ రుజువు కావడంతో మూడేళ్లు జైలు శిక్ష,రూ.7000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో శిక్ష పడేలా సాక్ష్యాధారాలను కోర్టులో దాఖలు చేసిన పోలీసులను ఎస్పీ ఏఆర్.దామోదర్ అభినందించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఒంగోలు విద్య, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. సోమవారం అమరావతిలో విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అంతర్ జిల్లాల బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలని, సాధారణ బదిలీల్లో ఉద్యోగోన్నతులు పొందిన వారికి రెండేళ్ల కేడర్ సీనియారిటీ ఉందని, అంతర్ జిల్లా బదిలీలకు ఇబ్బంది వస్తుందని అందువల్ల తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని తప్పనిసరికాదని స్వచ్ఛందంగా చేసే విధంగా డీఈవోలకు తగిన ఆదేశాలు ఇస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారని సభ్యులు తెలిపారు. ఎఫ్ఏ1 పరీక్షలకు సంబంధించి అసెస్‌మెంట్ పుస్తకంలో కేవలం మార్కులు నోట్ చేస్తే సరిపోతుందని డైరెక్టర్ తెలిపారన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఛైర్మన్ ఎల్. సాయిశ్రీనివాస్. సెక్రటరీ జనరల్ చిరంజీవి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్. వెంకటేశ్వర్లు ఉన్నారు

రేషన్‌షాపులకు సరకుల సరఫరా

- వచ్చే నెలలో కూడా కందిపప్పు లేనట్లే
- దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దకు అందించే చర్యలు ప్రారంభం
- బియ్యం, చక్కెర కేటాయింపు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సెప్టెంబరు నెలలో రేషన్ పంపిణీ చేసేందుకు ఎఫ్‌సీఐ గోడౌన్ల నుంచి రేషన్ షాపులకు సరుకుల సరఫరా ప్రారంభమైంది. మొత్తం 1,392 రేషన్‌షాపుల పరిధిలో 6,61,141 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు పంపిణీ చేసేందుకు 10,391 మెట్రిక్ టన్నుల బియ్యం, 346 మెట్రిక్ టన్నుల చక్కెరను సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం కందిపప్పు సరఫరా లేకపోవడంతో సెప్టెంబరు నెలలో అవి ఇచ్చే అవకాశం లేదు. గత ఆరేడు నెలల నుంచి కార్డుదారులకు పూర్తిగా కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది. ప్రభుత్వం ఏ నెలకు నెల పంపిణీ జరుగుతుందని చెప్తున్నా కందిపప్పు జిల్లాలకు కేటాయించకపోవడంతో రేషన్‌షాపులకు సరఫరా కావడం లేదు.

జిల్లాలో 70వేలకు పైగా దివ్యాంగులు, వృద్ధులకు కార్డులు ఉండటంతో వారికి సెప్టెంబరు నెలకు సంబంధించిన రేషన్ కోటాను ఈనెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 26, 27తేదీల్లో ఆయా రేషన్‌షాపుల పరిధిలోని డీలర్లు దివ్యాంగులు, వృద్ధులకు వారి నివాసాల వద్దకు వెళ్లి రేషన్‌ను పంపిణీ చేయనున్నారు. అందుకు అవసరమైన చర్యలను ఆ శాఖ అధికారులు చేపట్టారు. కందిపప్పు సరఫరా కాకపోవడంతో కార్డుదారుల్లో ఆందోళన నెలకొంది. బహిరంగ మార్కెట్లో కిలో రూ.130 వరకు పలుకుతోంది. రేషన్‌షాపుల్లో కందిపప్పు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

పెరటి సాగుకు ప్రోత్సాహం

- పొదుపు మహిళలకు కూరగాయల విత్తనాలు పంపిణీ
- రూ.200 ప్యాకెట్‌ను ప్రభుత్వం సబ్సిడీపై రూ.65కే అందజేత
- జిల్లాలోని 45 వేలసంఘాలకు అందించాలని నిర్ణయం
- ఇప్పటికే మండలాలకు చేరవేత



పొదుపు మహిళలకు అందించే విత్తనాల ప్యాకెట్లు

త్రిపురాంతకం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా పొదుపు సంఘాల మహిళలకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టింది. పెరటిపంటల సాగు ఆరోగ్యానికి సోపానం అని మహిళలను చైతన్యపరుస్తూ పెరటిసాగుకు ప్రోత్సాహంగా తక్కువ ధరకు కూరగాయల విత్తనాలను అందజేస్తోంది. దాదాపు రెండు వందల రూపాయల విలువైన విత్తనాల ప్యాకెట్‌ను కేవలం రూ.65కే ఇస్తోంది. ఇప్పటికే అన్ని మండలాలకు వాటిని సరఫరా చేసి పొదుపు సంఘాల మహిళలకు అందిస్తున్నారు.

జిల్లాలోని దాదాపు 45 వేల సంఘాలకు వీటిని అందించేందుకు సెర్ప్ ఆధ్వర్యంలో ఒక సీడ్ కంపెనీతో ఒప్పందం చేసుకుని వాటిని తక్కువ ధరతో మహిళలు తీసుకుని వారికి అందుబాటులో ఉన్న పెరటిలో ప్రకృతి సాగు చేసేలా ఏర్పాటు చేసిన కార్యక్రమం ఇది. ఇందులో భాగంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కూడా పొదుపు సంఘాలకు ఈ విత్తనాల సంచులను అందజేస్తున్నారు. పుల్లలచెరువు మండలంలో 1,349 సంఘాలకు, పెద్దారవీడు మండలంలో 1,030 సంఘాలకు, దోర్నాల మండలంలో 1,137 సంఘాలకు, త్రిపురాంతకం మండలంలో 1,363 సంఘాలకు, ఎర్రగొండపాలెం మండలంలో 1,475 సంఘాలకు విత్తన సంచులను అందించేందుకు అన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొన్నిచోట్ల చాలావరకు మహిళలు వాటిని కొనుగోలు చేయడం పూర్తయింది. ఈ విత్తన సంచిలో తోటకూర, పాలకూర, గోంగూర వంటి ఆకుకూరల విత్తనాలతో పాటు బెండ, బీర, సొర, కాకర, గోరు చిక్కుడు, చెట్టు చిక్కుడు, టమాటా, మునగకాయల విత్తనాలు ఉన్నాయి. వీటిని మహిళలు వినియోగించి ప్రభుత్వ లక్ష్యం మేరకు పెట్టుబడిలేని పెరటిసాగుతో పంటలు పండిస్తే మంచి ఆరోగ్యానికి సోపానమేనని పలువురు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చెన్నయ్యపై నిర్లక్ష్యం ఏందయ్యా..!

- మందకొడిగా మార్కాపురంలోని చారిత్రక ఆలయ గోపురాల నిర్మాణం
- నిధులున్నా పూర్తికాని పనులు
- వైసీపీ హయాం నుంచి అదే తంతు



పూర్తి స్థాయిలో పనులు పూర్తికాని పడమర గోపురం

మార్కాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ నడిబొడ్డున కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఏటికేడు అభివృద్ధి చెందుతోంది. ఒక్కో పాలకవర్గం హయాంలో ఒక్కో భారీ పని జరిగింది. గత దశాబ్దన్నరం నుంచి జరుగుతున్న అభివృద్ధి పనులతో ఆలయ రూపురేఖలు నూతన శోభను సంతరించుకున్నాయి. గతంలో పాతదాని స్థానే నూతన రథం, గాలి గోపుర జీర్ణోద్ధరణ, తిరుమల స్వర్ణ రథం తరహాలో వెండి రథం, ఆలయం ఆవరణంతా నూతనంగా ఫ్లోరింగ్ తదితర అభివృద్ధి పనులు జరిగాయి. గత వైసీపీ నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగాయి. అనంతరం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పనుల్లో వేగం లేదు. దీంతో దర్శనానికి వచ్చే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. నేటికీ నూతన పాలక వర్గాన్ని ఏర్పాటు చేయలేదు.

కాంట్రాక్టర్ త్వరగా పనులు పూర్తి చేయకనే ఆలస్యం

- గొలమారి శ్రీనివాసరెడ్డి, ఈవో, లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే అభివృద్ధి ఆలస్యమవుతోంది. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించాం. ఇప్పటి నుంచి జరిగే పని చాలా కీలకమైనది. నిపుణులైన కార్మికులు అందుబాటులోకి రాకపోవడంతోనే గోపురాలపై బొమ్మల నిర్మాణం చేయలేకపోతున్నట్లు కాంట్రాక్టర్ చెప్తున్నారు. ఈ మధ్యనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పనులు ప్రారంభిస్తే యుద్ధప్రాతిపదికన చేయిస్తాం.

నిధులున్నా యంత్రాంగంలో లోపించిన చిత్తశుద్ధి

చెన్నకేశవస్వామి దేవస్థానంలో నాలుగు గోపురాలు, రంగనాయక, ఆండాల్ అమ్మవారి ఉపాలయాల జీర్ణోద్ధరణ, నూతనంగా ఆంజనేయస్వామి గడి, భేరి మండపం, సాలాహారాలు, బండపరుపు తదితర పనులకు సుమారు రూ.8కోట్లు ఖర్చవుతుందని 2021లో దేవస్థాన పాలకవర్గం అంచనాలు వేయించారు. దేవదాయశాఖ అధికారులు మాత్రం తాము మ్యాచింగ్ గ్రాంట్ కింద కొన్ని పనులకు మాత్రమే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అందులో భాగంగా నాలుగు గోపురాలకుగాను మూడింటి నిర్మాణానికి రూ.కోటి చెల్లిస్తే మరో రూ.2కోట్లు ఇస్తామని పాలకవర్గానికి చెప్పారు. దాతల నుంచి సమీకరించి రూ.కోటిని పాలకవర్గం వెంటనే దేవదాయశాఖకు చెల్లించింది. దీంతో పనులను 2022 అక్టోబర్‌లో ప్రారంభించారు. తూర్పు, ఉత్తరం, దక్షిణ గోపురాలకు రూ.3 కోట్ల పనికి దేవాదాయశాఖ బిల్లులు చెల్లించాల్సి ఉంది. రూ.2.10 కోట్లను అప్పట్లో పాలకవర్గం 17 మంది దాతల ద్వారా సమీకరించి కీలకమైన పడమర గోపుర నిర్మాణం చేపట్టింది. అంతేకాక రూ.1.20కోట్లతో పాత గుడుల స్థానే నూతనంగా రంగనాయకస్వామి, ఆండాల్ అమ్మవార్లకు, రూ.35 లక్షలతో బయట ఉన్న ఆంజనేయస్వామి గుడిని లోపలి వైపున, రూ.25 లక్షలతో భేరి మండపం, రూ.1.50కోట్లతో పొడైన సాలాహారాలు, బండ పరుపు పనులను దాతల నుంచి సేకరించిన నిధులతో నిర్మించాలి. దాతల ద్వారా దాదాపు నిధుల సేకరణ పూర్తయింది. ఇప్పటికే వాగ్దానాలు చేసిన వాళ్ల నుంచి రూ.80లక్షలు మాత్రమే సేకరించాల్సి ఉంది. గత పాలకవర్గం 2024 మొదట్లో నిధులు సరిపోవని మరో రూ.కోటి దేవదాయశాఖ నిధుల కోసం రూ.50 లక్షలు ఎండోమెంటు అకౌంట్‌లో జమచేసింది. ఆ నిధులు కూడా ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అంతేకాక దేవదాయశాఖ మొదట్లో మంజూరు చేసిన రూ.3కోట్ల నిధుల్లో ఇంకా రూ.27లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం నాలుగు గోపురాలకు సంబంధించి వాటిపై బొమ్మల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. తూర్పు గోపురంలో ఇంకా ఒక అంతస్తు నిర్మాణం జరగాల్సి వుంది. ప్రస్తుతం దాతలు, దేవదాయశాఖ నిధులు రూ.కోటి పైగా అందుబాటులో ఉన్నాయి. వాటితో సాధ్యమైన మేర పనులు పూర్తి చేసేందుకు అవకాశం ఉంది. ఆ దిశగా ఆ శాఖ యంత్రాంగం దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాస్వామ్యం అపహాస్యం

● కాంగ్రెస్ పార్టీ నిరసన ర్యాలీ

ఒంగోలుక్రైం,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బీజేపీ, ఎన్నికల కమిషన్ అపహాస్యం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా విమర్శించారు. సోమవారం ఓట్ల దొంగ, సీట్లు దొంగ, గద్దెదిగు అనేనినాదంతో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ ఓట్లు చోరీ చేసి సీట్లు సంపాదించిన బీజేపీ గద్దె దిగాలిఅని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఓట్ల దొంగలు గద్దె దిగాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని మిరియాల పాలెం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి ట్రంక్‌రోడ్డు , మస్తాన్ దర్గా సెంటర్, పాతమార్కెట్ మీదుగా బాపూజీ కాంప్లెక్స్ వద్దగల మహాత్మాగాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల రంగస్వామి, దేవరపల్లి సుబ్బారెడ్డి, పాలపర్తి విజేష్‌రాజ్, మన్నం ప్రసన్నరాజు, బొడ్డు సతీష్,తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

పెన్షన్ సవరణ క్లాజ్‌ను రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లుల్లో దుర్మార్గ పెన్షన్ సవరణ క్లాజ్‌ను వెంటనే తొలగించాలని పలువురు డిమాండ్‌చేశారు. ఏపీఆర్‌పీఏ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జి. శేషయ్య అధ్యక్షత వహించారు. ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ పెన్షన్ సవరణ క్లాజును రద్దుచేయకపోతే కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీగడ వెంకటేశ్వరరెడ్డి, టీవీఆర్ సుబ్బారావు, సీహెచ్‌లక్ష్మీనారాణ, రాబిన్ రవికుమార్, పీ పేరయ్యతోపాటు ఎన్‌జీవో సంఘం నాయకులు కే శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



ట్రాక్టర్‌తో వరి విత్తనాలు వెదబెడుతున్న రైతులు

ముమ్మరంగా మెట్ట వరి సాగు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు, ఎస్.అగ్రహారం గ్రామాల పరిధిలోని లోతట్టు పొలాలలో రైతులు ముమ్మరంగా మెట్ట వరి ట్రాక్టర్లతో(వెద) సాగు చేస్తున్నారు. కొప్పోలు గ్రామానికి దక్షిణంగా, ఎస్ అగ్రహారం గ్రామానికి ఉత్తరం వైపున లోతట్టు భూములు ఉన్నాయి. ఈ భూములలో వర్షపు నీరు నెల ,రెండు నెలలు నిలిచి ఉంటుంది. దీంతో రైతుల ఈ భూములలో మెట్ట వరి సాగు చేయడం ప్రారంభించారు. మూడు నెలలు,ఆరు నెలలు కాలపరిమితి ఐఆర్ 20, 74రకం, బీపీటీ వంగడాలను రైతులు సాగుచేస్తున్నారు. ఈ రెండు గ్రామాల పరిధిలో సుమారుగా 600 ఎకరాలలో మెట్టవరి సాగు చేస్తున్నారు. వరుణుడిని నమ్ముకొని వరి పంట సాగుకు రైతులు ముందుకు సాగుతున్నారు



ధర్నాలో నినాదాలు చేస్తున్న రజకవృత్తిదారులు

రజక వృత్తిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రజక వృత్తిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టంగుటూరి రాము, రాయల మాలకొండయ్యలు డిమాండ్‌చేశారు రజక వృత్తిదారులసంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు రాము అధ్యక్షత వహించారు. ధర్నాలో వారు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలకు వలసలు వచ్చి అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్లు,ఇంటి పనివారిగా, ఇస్త్రీదారులుగా, భవన నిర్మాణ కార్మికులుగా పనిచేసుకుంటూ చాలీచాలనీ ఇరుకు గదుల్లో ఉంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు పింఛన్‌మంజూరు చేయాలని, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ తరహాలో రజకులకు సామాజిక రక్షణచట్టం కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి సమస్యలతోకూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం నాయకులు మందరమణమ్మ, డాక్టర్ వెంకట కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, యోగమ్మ, సీహెచ్ కొండయ్య, మంచికలపాటి శ్రీనివాసులు, గుర్రపుశాల శ్రీనివాసులు, అన్నవరపు నాగేశ్వరరావు ఉన్నారు.

దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు మోదీ కుట్ర

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు మోదీ, బీజేపీలు కుట్రపన్నాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్ ఆరోపించారు. సోమవారం ఒంగోలులోని మీడియా కెమెరా మెన్ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాల సామాజికవర్గంపై పగబట్టి తొక్కేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో చప్పిడి రవిశంకర్, బొలిమి వినోద్‌కుమార్ షేక్ జిలానీ, టి.సుబ్బారావు, నెల్లి సూరిబాబు పలువురు పాల్గొన్నారు

కష్టపడి పనిచేస్తేనే పదవులు

సోషల్ మీడియాలో

కుల రాజకీయాల ప్రచారం తగదు

ఒంగోలు శాసనసభ్యుడు

దామచర్ల జనార్దన్

అట్టహాసంగా ఒడా చైర్మన్‌గా రియాజ్

ప్రమాణ స్వీకారం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అందరిని కలుపుకొని పోతూ కష్టపడి పనిచేయడం ద్వారానే పదవులువస్తాయని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయడం వల్లనే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుర్తించి రియాజ్‌కు ఒడా చైర్మన్ పదవి సిఫార్సు చేశారన్నారు. స్థానిక ఏ1 కన్వెన్షన్ హాలులో సోమవారం ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్‌అథారిటీ చైర్మన్‌గా రియాజ్ ప్రమాణస్వీకారోత్సవ సభలో దామచర్ల ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒడా చైర్మన్‌పై కుల రాజకీయాలు చేస్తూ సోషల్ మీడియాలో నాయుళ్లకు అన్యాయం చేసినట్లు పోస్టింగ్‌లు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సమావేశంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్, ఒడా చైర్మన్ పదవిని ఒంగోలుకు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అందరి సమక్షంలో రియాజ్‌కు ఒడా చైర్మన్ పదవి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని, తదనుగుణంగా ఆయన పదవికి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళామని తెలిపారు. మెగా కుటుంబానికి నమ్మినబంటుగా ఉంటూ పదవులు ఉన్నాలేక పోయినా వారి వెంటే నడిచిన వ్యక్తి రియాజ్‌అని అన్నారు. ఒడా పరిధిలోని జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉన్నాయని, ఆ నియోజకవర్గాలన్నింటిని సమానంగా చూడాల్సిన బాధ్యత రియాజ్‌పై ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలు, భూకబ్జాలు, దౌర్జన్యాలపై పోరాడుతుంటే అనేక బెదిరింపులు కూడా వచ్చాయన్నారు. ఇప్పుడు అటువంటి వారు కూడా జనసేనలో ఉన్నారన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రియాజ్‌తో తమకుటుంబానికి ఉన్నఅనుబంధాన్ని వివరించారు. ఒడా చైర్మన్‌గా నిమితులైన రియాజ్‌కు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తానని, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఒడాకు నిధులు తెచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ రియాజ్‌కు ఒడా చైర్మన్ పదవికి వన్నె తెచ్చేవిధంగా పనిచేయాలన్నారు. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు .జనసేన పార్టీకి చెందిన శాసనసభ్యులు పీనానాజీ, వై. విజయకుమార్, బి. నారాయణలు మాట్లాడుతూ జనసేన పార్టీలో రియాజ్‌తో ఉన్న అనుబంధాన్ని వివ రిస్తూ సమర్ధవంతమైన రియాజ్‌కు ఒడా చైర్మన్ రావడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి, వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు దామచర్ల సత్య, బొడపాటి తేజస్వణి, లంకా దినకర్, విజయకుమార్, హరిప్రసాద్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు మేయర్ గంగాడసుజాత, జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్, వరికూటి నాగరాజు, కిరణ్‌రాయల్, కందుకూరి బాబు, బెల్లంకొండ సాయిబాబు, ఇమ్మడి కాశీనాథ్, శివపార్వతి, సుభాషిణీ, నాగరత్నం, సీహెచ్ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఆలా నారాయణ, కొట్టే శ్రీనివాస్‌తో పాటు పలు జిల్లాల నుంచి జన సేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన రియాజ్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు కలిసి బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు.



రియాజ్‌ను అభినందిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ , జనసేన నేత కంది రవిశంకర్



ఒడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రియాజ్

ఒడా చైర్మన్‌కు సత్కారం

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటి(ఒడా) చైర్మన్‌గా ప్రమాణస్వీకారంచేసిన షేక్ రియాజ్‌ను భారతీయ జనతా పార్టీ నాయకులు సత్కరించారు. ఒంగోలులోని1 కన్వెన్షన్ హాలులో సోమవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభలో బీజేపీ నాయకులు కలిసి అభినందించారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బీజేపీ నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, అమరసింహం, శ్రీనివాసరావుతో పాటు పలువురు ఆ పార్టీ నాయకులు ఉన్నారు..



నివాళులర్పిస్తున్న రచయిత్రులు

మానవత్వం మూర్తీభవించిన రచయిత్రి కృపావరం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తన రచనలతోనే కాకుండా వ్యక్తిత్వంలోను మానవత్వం మూర్తీభవించిన గొప్ప రచయిత్రి కత్తి కృపావరం అని పలువురు నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన కత్తి కృపావరం సంతాప సభ సోమవారం సాయంత్రం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ కోటేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కృపావరం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ మానవతా దృక్పథం కలిగిన సంస్కారవంతురాలైన గొప్ప కవయిత్రి కృపావరం అన్నారు. కృపావరం మరణం జిల్లా సాహిత్యరంగానికి తీరనిలోటని తేళ్ల అరుణ పేర్కొన్నారు. నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి మాట్లాడుతూ కృపావరం బహుముఖ ప్రజ్ఞాశాలి అని, రచయిత్రిగా తన ఎదుగుదలలో కృపావరం సహకారం మరిచిపోలేనిదని అన్నారు. తాను నిర్వహించిన ప్రతి సాహిత్య కార్యక్రమంలో కృపావరం తోడ్పాటునందించేదని డాక్టర్ నూనె అంకమ్మ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీరం అరుణ, మారేపల్లి సూర్యకుమారి, వి.ఝాన్సీదుర్గ, కుర్రా ప్రసాద్ బాబు, నాళం నరసమ్మ, యు.వి.రత్నం, మిడసల మల్లిఖార్జున రావు, దర్నాసి చిరంజీవి, పిన్ని వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, కత్తి కల్యాణ్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నరైతుసంఘం నేత పమిడి వెంకట్రావు

రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

నాగులుప్పలపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):ప్రజలకు అన్నం పెట్టే అన్నదాతలను కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి దూరం చేస్తూ పరిశ్రమల పేరిట కార్పొరేట్ శక్తులకు వ్యవసాయభూములను దోచిపెడుతోందని రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జుజ్జూరి జయంతిబాబు, పమిడి వెంకట్రావు అన్నారు. రైతుసంఘం మండల మూడో సభను నాగులుప్పలపాడులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల పేరుతో ఇప్పటికే వేలాది ఎకరాల వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి ఎక్కడా ఒక్క పరిశ్రమ స్థాపించిన దాఖలాలు లేవని విమర్శించారు.ఆయా భూములను బ్యాంక్‌లకు తనఖాపెట్టి రుణాలను తీసుకొని వ్యాపారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల వద్ద నున్న బర్లీ పొగాకును మొత్తం కొనుగోలు చేసి రైతులు అప్పులపాలు కాకుండా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులుగా తూబాటి శ్రీకాంత్,రావెళ్ల వెంకట్రావు, మరో 11 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

రూ.51 లక్షలతో అభివృద్ధి పనులు

● ఐదు గ్రామాల్లో 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

● వోల్టేజీ హెచ్చుతగ్గులు నివారణ

కొండపి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు గ్రామాల్లో లోవోల్టేజీ నివారించి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు పనులు జరుగుతున్నాయని విద్యుత్‌శాఖ మండల ఏఈ పువ్వాడ శ్రీనివాసులు తెలిపారు. రూ.51 లక్షలతో చోడవరం గ్రామంలో జరుగుతున్న విద్యుత్ అభివృద్ధి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ లోవోల్టేజీ నివారించేందుకు చోడవరంలో రెండు, చినవెంకన్నపాలెంలో ఒకటి, ముప్పవరం, పెరిదేపి గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూగచింతలలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. మండలంలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నచోట త్వరలో మారుస్తామని తెలిపారు.

కొండపి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పెట్లూరు, జాళ్లపాలెం, నెన్నూరుపాడు గ్రామాలకు వెళ్లే 11 కేవీ మెయిన్ లైన్లు ఇప్పటి వరకు కొండపిలోని గురుకుల పాఠశాల లోపల నుంచి వెళ్తున్నాయని, మంత్రి స్వామి లైన్లు గురుకుల పాఠశాల వెలుపలకు తరలించాలని ఆదేశించి, అనుమతులు తెప్పించారని వివరించారు. రెండు రోజుల క్రితం విద్యుత్ లైన్లను గురుకుల పాఠశాల వెలుపలకు తరలించామని, విద్యార్థులకు ఇబ్బందులు తొలిగాయని ఏఈ వివరించారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది

రైతుల సంక్షేమానికి కృషి చేస్తా

● చిమట సొసైటీ అధ్యక్షుడు మలసాని

మద్దిపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘం పరిధిలోని సభ్యులందరికీ విస్తృతమైన సేవలు అందిస్తానని చిమట సహకార సంఘం అధ్యక్షుడు మలసాని కోటేశ్వరరావు చెప్పారు. సోమవారం అధ్యక్షుడిగా చిమటలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘంలో 2,458 మంది సభ్యులు ఉన్నారని, ఇప్పటి వరకు 1250 మందికి వివిధ రకాల రుణాలు మంజూరు చేశామని తెలిపారు. రూ.24 కోట్ల రుణాలను అందించగా వాటిలో రూ.17 కోట్లు దీర్ఘకాలిక రుణాలు కాగా రూ.7 కోట్లు స్వల్పకాలిక రుణాలు ఇచ్చామన్నారు. త్వరలో రైతులందరికీ సొసైటీ ద్వారా ఎరువులు విక్రయించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మంత్రి స్వామి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయబోనని వారి ఆకాంక్షల మేరకు పని చేస్తానన్నారు. కందుల కొనుగోళ్లలో రూ.24,000 క్వింటాళ్లు కొనుగోలు చేసి జిల్లాస్థాయిలోనే చిమట సహకార సంఘం ప్రథమస్థానంలో ఉందన్నారు. ఆదర్శ సహకార సంఘంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాసరెడ్డి, రేగుల వీరనారాయణ, చేరెడ్డి నరసారెడ్డి, గొంటు హనుమారెడ్డి, మలసాని నాగేశ్వరరావు, ప్రముఖ వ్యాపారవేత్త ఎరమోతు వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్లు కొప్పర్తి కోటిరెడ్డి, జీ ఓబులరెడ్డి పాల్గొన్నారు.



చిమట సొసైటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు తీసుకుంటున్న మలసాని

దివ్యాంగుల పెన్షన్లను పునరుద్ధరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అన్యాయంగా తొలగించిన దివ్యాంగుల పెన్షన్లను పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి మేరుగ నాగార్జున, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డిలు మాట్లాడారు. తొలగించిన దివ్యాంగులందరికి పింఛన్లు ఇవ్వకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సివస్తోందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కటారి శంకర్, దుంపా చెంచిరెడ్డితో పాటుపలువురు నాయకులు ఉన్నారు.



దివ్యాంగులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నేతలు

పేస్‌లో ముగిసిన వర్క్‌షాపు

ఒంగోలు విద్య, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో సెమికండక్టర్ డిజైన్ ఎనర్జింగ్ రీసెర్చ్ ఏరియాపై మూడు రోజుల పాటు జరిగిన వర్క్‌షాపు సోమవారం ముగిసింది. కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాపును నిర్వహించారు. కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, డీన్‌లు ఆర్.వీరాంజనేయులు, సీవీ సుబ్బారావు, రూపా అక్కేష్, ఎం.అప్పారావు తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాలలో తనిఖీలు

సంతనూతలపాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలమేరకు సోమవారం తహసీల్దార్ నారాయణరెడ్డి, వ్యవసాయాధికారి పావనిలతో కూడిన బృందం మండలంలో ఎరువుల దుకాణాలను తనిఖీచేశారు. సంతనూతలపాడులోని చంద్రఫెర్టిలైజర్స్, మన గ్రోమోర్ దుకాణాలను పరిశీలించారు. నిల్వలకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండాలని, దుకాణం బయట ధరల పట్టిక ఉండాలన్నారు.

రాజరాజేశ్వరి దేవస్థాన దుకాణాల వేలం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక తూర్పుపాలెం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అధీనంలో ఉన్న ట్రంకురోడ్డులోని షాపులను లీజుకు ఇవ్వటానికి ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి బోడపాటి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రంకు రోడ్డులోని 37-1-264, టీఎస్‌నెం411లో ఉన్న రెండు షాపులను సెప్టెంబరు 1 నుంచి 2026వ సంవత్సరం ఆగస్టు 31 వరకు లీజుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పాటలో పాల్గొనదలచిన వారు రూ.20 వేలు దరావత్తు చెల్లించాలని ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని శ్రీనివాస రావు పేర్కొన్నారు.

స్ట్రీట్‌వెండర్స్‌కు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో స్ట్రీట్‌వెండర్స్‌కు గుర్తింపు కార్డులు ఇవ్వాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జీ రమేష్ డిమాండ్‌చేశారు. ఒంగోలు నగర స్ట్రీట్ వెండర్స్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ వెండర్స్‌కు ఇచ్చిన కార్డులను రెన్యూవల్ చేయాలన్నారు. యూనియన్ నగర కార్యదర్శి ఎం. లక్ష్మీనారాయణ, వంశీ, మాధవ్ ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

నాగులుప్పలపాడు, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి గాయపడిన సంఘటన ఉప్పుగుండూరులో చోటుచేసుకొంది. వివరాల మేరకు ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన చికెన్‌కొట్టు నిర్వాహకుడు జెండాబాబు సోమవారం తెల్లవారుజామున ఇంటి వద్దనుంచి నాగులుప్పలపాడు రోడ్డులో వాకింగ్ చేసుకొంటూ వెళుతున్న క్రమంలో వసుంధర కోల్డ్‌స్టోరేజ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలై రోడ్డు పక్కన పడిఉండగా ఒంగోలు విధులకు వెళుతున్న ఈదుమూడి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కొమ్మూరి మహేష్ గాయపడిన జెండాబాబుకు సపర్యలు చేసి 108కి సమాచారం అందించారు.దాంతో చికిత్స నిమిత్తం క్షతగ్రాతుడిని ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.



ఫిర్యాదుదారుల సమస్యను వింటున్న ఎస్పీ దామోదర్

మోసాల బారినుంచి కాపాడండి

● మీకోసంలో ఎస్పీకి వినతులు

ఒంగోలుక్రైం,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మోసాల బారి నుంచి కాపాడండి అంటూ పలువురు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదులు చేశారు. జిల్లాలో నలుమూలల నుంచి 80 మంది తమ సమస్యలు పరిష్కరించమని ఫిర్యాదులు చేశారు. ఎస్పీ వెంటనే సంబంధిత పోలీసు అధికార్లతో మాట్లాడి సత్వరమే చట్ట పరిధిలో ఫిర్యాదులను పరిష్కరిచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్ , సీఐలు దుర్గా ప్రసాద్, జగదీష్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులలో కొన్ని..

● చిలకలూరి పేటకు చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.5 లక్షలు తీసుకొని కొనకనమిట్లలో ఒక ప్రయివేటు ఏజెన్సీలో సెక్యూరిటీ గార్డుగా జాయిన్ చేశాడని ఓ బాధితుడు ఫిర్యాదు చేశారు. 16 నెలలు తరువాత తనను ప్రయివేటు ఉద్యోగం నుంచి కూడా తొలగించారని, తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

● ఒంగోలు నాగేంద్ర నగర్ 1 లైన్‌లో నివాసం ఉండే వ్యక్తి తన ఇంటిని మరొకరికి అద్దెకు ఇచ్చాడు. అయితే ప్రస్తుతం ఇంట్లో అద్దెకు ఉంటున్న వ్యక్తి అద్దె చెల్లించకుండా ఇల్లు ఖాళీ చేయకుండా తనను బెదిరిస్తున్నాడని ఇంటి యజమాని ఫిర్యాదు చేశాడు.

● ఇంటి అవసరాల కోసం ఒంగోలు రాంనగర్‌కు చెందిన ఇద్దరు మహిళల వద్ద బంగారం తాకట్టు పెట్టానని, ప్రస్తుతం డబ్బు చెల్లిస్తాను అంటే వారు నా బంగారం అమ్మేసుకున్నామని చెబుతున్నారని ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా అ రెండు కుటుంబాల వారు తన కుటుంబంపై దౌర్జన్యానికి దిగారని పేర్కొన్నారు.

సీతారామస్వామి భూములను స్వాధీనం చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సీతారామస్వామికి చెందిన రూ8.26 కోట్ల విలువైన భూమిని అన్యాక్రాంతం నుంచి రక్షించాలని సంతనూతలపాడు మండలం మన్నంవారిపాలెంకు చెందిన నిడమానూరి మాలకొండయ్య కోరారు. సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు.

పల్లె ప్రజలను వణికిస్తున్న జ్వరాలు

- వైద్యశాలల్లో పెరుగుతున్న రోగులు
- ఆందోళన వద్దంటున్న వైద్యాధికారులు
- జాగ్రత్తలు తీసుకుంటే మేలు

త్రిపురాంతకం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. వైద్యశాలల్లో ఓపీలు పెరుగుతున్నాయ్. వచ్చే ఓపీల్లో సగానికి సగం జ్వరంతోనూ, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు వంటి వాటితోనే వస్తున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో పరిస్థితిని వైద్యాధికారుల ద్వారా అడిగి తెలుసుకుంటే వారిచ్చిన సమాచారం మేరకు ప్రతిరోజూ దాదాపు 500 నుంచి 600 మంది జ్వరాలతో వైద్యశాలకు వస్తున్నారు. అయితే ఇవన్నీ వైరల్ ఫీవర్లేనని ఆందోళన చెందకుండా ఇళ్లలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెప్తున్నారు. మారిన వాతావరణ పరిస్థితులతో పాటు చాలా గ్రామాల్లో పారిశుధ్య లోపం, దోమలు, ఈగలు ఎక్కువై వ్యాధికారకాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్‌గా వచ్చే పలు వ్యాధులతోపాటు ఇప్పుడు జ్వరాలు పల్లెల్లో తిష్టవేశాయి.

ఎర్రగొండపాలెం కేంద్రంగా ఉన్న ఏరియా వైద్యశాలలో సాధారణంగా ప్రతిరోజూ 500 నుంచి 700 వరకు ఓపీలు వస్తుంటాయి. ఈ మధ్యకాలంలో అప్పుడప్పుడూ వైద్యశాలకు వచ్చే ఈ సంఖ్య వెయ్యికి కూడా చేరుతుందని చెప్తున్నారు. అయితే వీటిలో ప్రతిరోజూ దాదాపు వంద వరకు జ్వరాలబారిన పడినవారే వస్తున్నారు. వీరికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు ఇచ్చి పంపిస్తుండగా అవసరమైన వారికి సెలైన్‌లు పెడుతూ చికిత్స చేస్తున్నారు. అనుమానితులకు



దోర్నాల ఆసుపత్రిలో జ్వరపీడితులు

టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ఇవేమి ప్రస్తుతానికి నమోదు కాలేదని వైద్య సిబ్బంది చెప్తున్నారు. అయితే పల్లెల్లో ప్రైవేటు వైద్యుల వద్దకు వెళుతున్న కొందరికి టైఫాయిడ్ నిర్ధారణ జరుగుతుందని రోగులు అంటున్నారు. జ్వరాలతో పాటు జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు పడుతున్నామని కొందరు చెప్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని గిరిజన గూడేలలో కూడా జ్వరపీడితులు ఉండగా వైద్యాధికారులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. త్రిపురాంతకంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు దూపాడులోని వైద్యశాలకు కూడా ప్రతిచోటా 150 నుంచి 200 మంది వైద్య పరీక్షల కోసం వస్తుండగా అందులో ఒక్కోచోట 30 నుంచి 40 మంది జ్వరాలబారిన పడినవారే ఉంటున్నారు. అంటే రెండు వైద్యశాలల్లో ప్రతిరోజూ 60 నుంచి 80 మంది జ్వరంతో వచ్చి చికిత్స చేయించుకుని వెళుతున్నారు. దోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో ఓపీ 300 నుంచి 400 వరకు నమోదవుతోంది. సోమవారం 320 మంది వైద్య పరీక్షలు కోసం వైద్యశాలకు వచ్చారు. వీరిలో దాదాపు ప్రతిరోజూ 100 నుంచి 120 మంది వరకు జ్వరాలతో వచ్చేవారే కనిపిస్తున్నారు. పెద్దారవీడులోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. అయితే ఇక్కడ జ్వరపీడితులు వివరాలు తక్కువగా నమోదవుతుండగా ఎక్కువమంది సమీపంలో ఉన్న మార్కాపురం జిల్లా వైద్యశాలకు వెళుతున్నారు. పుల్లలచెరువులోని ప్రభుత్వ వైద్యశాలల్లో ఇటీవల కాలంలో రోజూ 20 నుంచి 30 మంది జ్వరపీడితులు కనిపిస్తున్నారు. మొత్తమ్మీద సీజనల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో పల్లెల్లో ప్రైవేటు వైద్యులు ఆర్ఎంపీ, పీఎంపీల వద్దకు కూడా ప్రజలు జ్వరాల నుంచి ఉపశమనం కోసం వెళుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలల నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పల్లెల్లో అవసరమైన వైద్య సేవలందించి, మందులు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వైపాలెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

పెద్ద దోర్నాల : అల్పపీడనం కారణంగా వారం, పది రోజులు పాటు చిరు జల్లులు కురిశాయి. దీంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో మండలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు జ్వరం, వంటి నొప్పులు, దగ్గు, జలుబుతో బాధ పడుతున్నారు. ఎక్కువ శాతం మంది వైరల్ ఫీవర్, కీళ్ల నొప్పులతో బాధ పడుతున్నారు. ప్రధానంగా చిన్న పిల్లలు జ్వరంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది వైద్యశాలలకు వెళ్లకుండా మందుల దుకాణంలో మందులు కొనుక్కొని వెళ్తున్నారు. దీంత వ్యాధి తగ్గినట్టే తగ్గి మళ్లీ వస్తుందని అంటున్నారు. చెంచు గిరిజన గూడేలలో జ్వర బాధితులు ఎక్కువగానే ఉన్నారు. కొర్రప్రోలు, చింతలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా అరకరడ రోగుల సంఖ్య అధికంగా ఉన్నట్లు సమాచారం అందడంతో కలెక్టర్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడం వల్ల దోర్నాల వెళ్తున్నట్లు గిరిజనులు చెప్తున్నారు. దోర్నాల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు 320 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

జాగ్రత్తలు తీసుకుంటే మేలు



జ్వరాలు సీజనల్‌గా వస్తుంటాయి. అవసరమైనవారికి టైఫాయిడ్, మలేరియా పరీక్షలు చేయాలి. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇళ్లలో ప్రజలు జాగ్రత్తలు తీసుకుని కాచి చల్లార్చిన నీటిని తాగాలి. నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే దోమలు, ఈగలు ప్రబలకుండా ఉంటాయి. బయట రోడ్లపై ఉండే తినుబండరాలు తినకుండా ఉంటే మేలు. మాస్క్ తప్పనిసరిగా ధరిస్తే మంచిది. విద్యార్థులు, బయట తిరిగే వ్యక్తులు మాస్క్ ధరించాలి.

- యదీద్యా, ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్నారు. జ్వరాలు, ఇతర వ్యాధులు వచ్చినప్పుడు సొంతంగా మందులు వాడరాదు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

- సంజీవ్, వైద్యాధికారి, సీహెచ్‌సీ, దోర్నాల



దూపాడులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి



బోధన తీరును పరిశీలిస్తున్న అధికారులు

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

కంభం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. జిల్లా పర్యవేక్షణ బృందం సభ్యులు, డైట్ అధ్యాపకులు ఆర్.జగన్నాథరావు, ఎంఈవో-2 శ్రీనివాసులు మండలంలోని రావిపాడు ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, విద్యార్థుల సంఖ్య, హాజరు, కనీస అభ్యసన సామర్థ్యాలు, బోధనోపకరణాల వినియోగం, ఉపాధ్యాయుల చొరవ, డిజిటల్ బోర్డులు, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాలు, టీచర్ హ్యాండ్ బుక్, మూల్యాంకన పుస్తకాలు, విలువల విద్య, సిలబస్ తదితర అకడమిక్ అంశాలను సమగ్ర పరిశీలించారు. సీఆర్ రావిపాడు మోడల్ స్కూల్‌లో బోధన, నిర్వహణపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు కోసనా నాగేశ్వరరావు, కొండల్ రావు, బోధనా శైలిని ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్నా బడి భోజనాలను పరిశీలించి రుచి చూశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ షబ్బీర్, పి శ్రీనివాసులు, నారాయణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంభం చెరువులోకి దొర్లిన కారు



కంభం చెరువులోకి దొర్లిన కారు

కంభం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కంభం చెరువు అందాలనున తిలకించేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన పర్యాటకులు కట్టపై కారు రివర్స్ చేస్తున్న క్రమంలో చెరువులోకి దొర్లిన ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే హైదరాబాద్‌కు చెందిన వెంకటేశ్వరరెడ్డి బేస్తవారిపేటలో తన బంధువుల ఇంట జరుగుతున్న శుభకార్యానికి వచ్చారు. సాయంత్రం చెరువు కట్టను చూడాలని ముగ్గురు యువకులు కారులో కట్టపైకి వచ్చి ఫొటోలు దిగిన అనంతరం బయలుదేరేందుకు డ్రైవర్ కారు రివర్స్ చేస్తుండగా అదుపుతప్పి చెరువులోకి పల్టీలు కొట్టింది. ఈ క్రమంలో డ్రైవర్ ఆందోళనతో కారు నుంచి దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తాగి వాహనాలు నడిపితే జైలు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నాంచారయ్య హెచ్చరించారు. అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై వాహన చోదకులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాంచారయ్య మాట్లాడుతూ ఈనెలలో ఇప్పటివరకు మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు. తాగి వాహనాలు నడిపితే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్ఐ



ఏఎంసీ చైర్మన్ వెంకటరెడ్డిని అభినందిస్తున్న మంత్రి రవికుమార్



గజమాలతో నాయకులకు స్వాగతం పలుకుతున్న శ్రేణులు

అట్టహాసంగా మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

- పార్టీ కోసం కష్టపడే విధేయులకు తప్పక పదవులు
- మంత్రులు స్వామి, రవికుమార్

మార్కాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే విధేయులకు తప్పక పదవులు వరిస్తాయని రాష్ట్ర మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్‌లు అన్నారు. స్థానిక మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ, నియోజకవర్గంలోని పలు పీఏసీఎస్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం అట్టహాసంగా జరిగింది. ముందుగా సెవెన్‌హిల్స్ లాడ్జీ దగ్గర నుంచి భారీ ఎత్తున మార్కెట్ యార్డు వరకు ర్యాలీ జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు ప్రజాప్రతినిధులకు అక్కడ గజమాలతో ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో కాలేజీ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించి పోయింది. ర్యాలీ అనంతరం మార్కెట్ యార్డులో ఏఎంసీ చైర్మన్‌గా మాలపాటి వెంకటరెడ్డి, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్న వారంతా కష్టపడి భవిష్యత్‌లో పార్టీ పటిష్టానికి పాటుపడాలని అన్నారు. ఈ ప్రాంతంలోని రైతులకు మెరుగైన సేవలందించాలని ఎంపీ మాగుంట అన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో నాయకులందరూ కష్టపడి పనిచేసి విజయఢంకా మోగిద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటక సుబ్బారెడ్డి, తాళ్లపల్లి సత్యనారాయణ, జనసేన నాయకులు ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ నాయకులు కృష్ణారావు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గణనాథులు సిద్ధం

పొదిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వివిధ రకాల్లో తయారైన వినాయక విగ్రహాలు మండపాలకు తరలేందుకు సిద్ధమయ్యాయి. పలురంగులతో వినాయక ప్రతిమలను తయారీదారులు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలకు వెంకయ్యస్వామి దేవాలయం మార్కాపురం అడ్డరోడ్డు, సెంటర్లలో విగ్రహాలను కొనుగోలు చేసేందుకు మండలంలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ఉత్సవ కమిటీల వారు వస్తున్నారు.

ప్రత్యేక రైలు కాల వ్యవధి పొడిగింపు

గిద్దలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్ నుంచి గిద్దలూరు మీదుగా యశ్వంత్‌పూర్ మధ్య తిరుగుతున్న స్పెషల్ రైలు కాల వ్యవధిని పొడిగిస్తున్నట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. భువనేశ్వర్-గిద్దలూరు-యశ్వంత్‌పూర్ (02811) ప్రత్యేక రైలును సెప్టెంబరు 13 నుంచి నవంబరు 29వ తేదీ వరకు 12 సర్వీసులు, యశ్వంత్‌పూర్-గిద్దలూరు-భువనేశ్వర్ (02812) ప్రత్యేక రైలు సెప్టెంబరు 15 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు గతంలో నిర్ణయించిన వారాలలోనే 12 ప్రత్యేక సర్వీసులను పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

28న బండలాగుడు పోటీలు

గిద్దలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని ముండ్లపాడు గ్రామంలో ఈనెల 28వ తేదీన 4 పండ్ల విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు సినిమా సెంటర్ యూత్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు 8919017488, 8806454115 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.



చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాలుట్లలో ఉచిత వైద్య శిబిరం

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని పాలుట్ల గిరిజన గూడెంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వరంతో బాధపడుతున్న 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు డాక్టర్ కే వెంకటేశ్వరనాయక్ సోమవారం తెలిపారు. గూడెంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం గూడెంలోని వసతి గృహంలో విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. జ్వరంతో బాధపడుతున్న 20 మందికి రక్త నమూనాలు సేకరిచారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మాధవి, సీహెచ్ జానా రెడ్డి, ఎంఎన్‌వో కొండయ్య, ఎఫ్ఎన్‌వో అంజమ్మ, వెంకట రామయ్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెద్ద దోర్నాల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చిన్నగుడిపాడు గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో పెద్ద బొమ్మలాపురం గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల శ్రీను (34) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. శ్రీను బైకుపై పెద్ద బొమ్మలాపురం నుంచి చిన్నదోర్నాల వెళ్లేందుకు చిన్నగుడిపాడు వద్ద జాతీయ రహదారిపైకి రావడం, అదే సమయానికి ఆ రోడ్డుపై అప్పటికే గుంటూరు వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు వచ్చింది. ఒకే సారి రెండు వాహనాలు ఒకే చోటకు వచ్చేసరికి వేగం అదుపు చేయలేక బైకును బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి శ్రీను కింద పడడంతో తలకు తీవ్రగాయాలై ఘటనా స్థలంలో మృతి చెందాడు. వాహనం ముందుకు వెళ్లి పోయింది, గమనించిన గ్రామ ప్రజలు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్ఐ మహేశ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. శ్రీనుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



జ్ఞాపికలతో కరాటే విజేతలు

కరాటేలో గిద్దలూరు విద్యార్థుల సత్తా

గిద్దలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరుకు చెందిన పలువురు విద్యార్థులు కరాటే టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచారు. తెలంగాణలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ టు స్పోర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో 9 సంవత్సరాల విభాగంలో జరిగిన కటాస్ విభాగంలో మిత్ర, సంసుల్, కౌసర్, సైదా, షరీఫ్, హీనా, 10 సంవత్సరాల కటాస్ విభాగంలో రజిత, రిత్విక్, వరుణ్, మున్నా, నక్షత్ర, రజిత, లికిత్, హేమంత్‌కుమార్, సీనియర్స్ విభాగంలో అభిరామ్, ఆయేషాభాను గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను సాధించినట్లు కరాటే మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు.

టెన్నిస్‌లో విజేతలు



టెన్నిస్ విజేతలతో స్థానిక క్రీడాకారులు

గిద్దలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి టెన్నిస్ పోటీలలో గిద్దలూరుకు చెందిన క్రీడాకారులు విజయం సాధించారు. 65 సంవత్సరాల విభాగంలో జరిగిన డబుల్స్ పోటీలలో గిద్దలూరుకు చెందిన కంచర్ల కోటయ్యగౌడ్, సోడా రామచంద్రారెడ్డి జట్టు విన్నర్స్‌గా నిలిచారు. 55 సంవత్సరాల విభాగంలో షేక్ టపావలి, గంజి చంద్రశేఖర్ జట్టు రన్నర్స్‌గా నిలిచారు. 45 సంవత్సరాల విభాగంలో డాక్టర్ సందీప్, యు.మహేష్ జట్టు విజేతగా నిలిచారు. ఆరుగురు క్రీడాకారులు వివిధ విభాగాలలో విజేతలుగా నిలువడంతో జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీకే మోహన్‌రెడ్డి, స్థానిక టెన్నిస్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రంగారెడ్డి, రిక్రియేషన్ క్లబ్ కోశాధికారి త్రిమూర్తిరెడ్డి, స్థానిక క్రీడాకారులు విజేతలను అభినందించారు.

చదరంగం విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులను అందుకున్న విద్యార్థులు

గిద్దలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖగ్రంథాలయంలో జరిగిన చదరంగం పోటీలలో విజేతలైన వారికి దాతలు బహుమతులను అందజేశారు. సీనియర్స్ విభాగంలో నాగచరితేజ్, పర్షిత్, సుఖిత్, జూనియర్స్ విభాగంలో ప్రచేతన్, హర్షిత్‌రెడ్డి, సిరివెన్నెల మొదటి 3 స్థానాలు సాధించగా దాత సాయి శర్మ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్, వివిధ వర్గాల ప్రతినిధులు సాహితి, ఓబులేసు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కంభంలో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ



చెల్లాచెదురుగా ఉన్న వస్తువులు

కంభం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణం సాయి నగర్‌లో తాళం వేసిన ఇంటిలో దొంగదనం జరిగింది. రెండు జతల బంగారు కమ్మలు, 10తులాలు వెండి, రూ.15వేల నగదును దొంగలు ఎత్తుకుపోయిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సాయి నగర్‌లో నివశిస్తున్న భాస్కర్ తన కుటుంబంతో కలిసి ఆదివారం ఉదయం అర్ధవీడులోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇది గమనించిన దొంగలు ఆదివారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని రెండు బంగారు కమ్మలు, 10 తులాలు వెండి, రూ.15వేల నగదు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ సీటు సాధించిన విద్యార్థికి అభినందనలు



కార్తీక్

కంభం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన రాధారపు కార్తీక్ నీట్‌లో 490 మార్కులు సాధించి అందరి మన్ననలు పొందాడు. వివరాల్లోకి వెళితే తురిమెళ్ల గ్రామానికి చెందిన రాధారపు కృష్ణ, రమ దంపతుల కుమారుడైన కార్తీక్ నీట్‌లో మొదటి ఫేస్‌లోనే సీటు సాధించాడు. ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాలలో సీటు రావడంతో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందించారు.

అదుపు తప్పిన పోలీస్ వాహనం

మార్కాపురం రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగుంట్ల వద్ద జాతీయ రహదారిపై పోలీస్ ఎస్కార్ట్ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన ఘటన వివరాలు తెలియరాలేదు.

సైబర్ వలలో చిక్కుకున్న రైతు

» రూ.3.20 లక్షలు పోగొట్టుకున్న వైనం

ముండ్లమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లు గ్రామానికి చెందిన మందలపు గోవిందు సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడి రూ.3.20 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈఘటన ఆదివారం మధ్యాహ్నం జరగగా, బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గుర్తు తెలియని సైబర్ నేరగాళ్ళు రూ.450 పంపించారు. దీంతో వారు పంపిన యాప్‌ను ఆన్‌చేసి మాట్లాడగా నీకు రూ.450 వచ్చాయని, రూ.10వేలు పంపిస్తే ఎక్కువ జమ అవుతాయని చెప్పటంతో ఆమేరకు పంపారు. ఆ వెనువెంటనే లక్ష రూపాయలు ఒకసారి, మరో లక్ష రూపాయలు మరోసారి, రూ.60 వేలు ఇంకోసారి పంపారు. మరికొంత నగదుతో కలిపి మొత్తం రూ. 3.20 లక్షలకు పైగా పంపించారు. ఆతరువాత తన సెల్‌లో బ్యాలెన్స్ చూసుకోగా లేకపోవటంతో బాధితుడు గోవిందు కంగారుపడుతూ వెంటనే పోలీసు స్టేషన్‌కు వచ్చారు. జరిగిన విషయం వివరించటంతో పాటు సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు వారికి చూపించాడు. ఇది సైబర్ నేరగాళ్ళ పని అని చెప్పటంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ముండ్లమూరు మండలంలో సంవత్సరం లోపే అరడజను మందికి పైగా సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోయారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 78వేలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం సోమవారం లెక్కించగా రూ.1,77,735 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.62,860, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,620, అన్నదాన పథకానికి రూ.56,223, మహాప్రాకార నిర్మాణానికి రూ.25 వేలు, పంచామృత అభిషేకానికి రూ.11,032 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చిన్నఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సర్వే ద్వారా హద్దుల ఏర్పాటు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ కంఠం పరిధిలోఉన్న నివాసాలను డ్రోన్ ద్వారా సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తున్నామని డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని వెంగనగుంట, కోమటికుంట, చింతపూడు గ్రామంలో సామిత్వ సర్వే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామ కంఠంలో నివశిస్తున్న వారికి నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే, కోమటిగుంట్ల గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న మురుగు కాల్వల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావు, పంచాయతి కార్యదర్శి పాండు పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనులను పరిశీలించిన డీఈ

ముండ్లమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి మేజరు కాలువ ఆధునికీకరణ పనులను ఎన్ఎస్‌పీ డీఈ బి.పూర్ణచందు సోమవారం పరిశీలించారు. రవ్వారం దగ్గర నుంచి శంకరాపురం వరకు జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గాంధీనగర్ వద్ద డ్రాపులను పరిశీలించారు. ఆయన వెంట జేఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన సీఐ

పామూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహ నిమజ్జన జరిగే ప్రదేశాన్ని సీఐ ఎం. భీమానాయక్ సోమవారం సాయంత్రం పంచాయతి సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రతి ఏటా జరిగే పామూరు పాత చెరువు ప్రాంతంలోని గుంతల్లో ఉన్న నీటి లోతును గజ ఈతగాళ్లతో పరిశీలించారు. విగ్రహాలు నిమజ్జనానికి అనువైన ప్రాంతాన్ని గుర్తించారు. పట్టణంలో ఈఏడాది 50 వరకు విగ్రహ మండపాలు ఏర్పాటుచేసే అవకాశం ఉందని సీఐ తెలిపారు.

విద్యార్థులకు జీరో అకౌంట్

తాళ్లూరు ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తూర్పుగంగవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలవిద్యార్థులకు సోమవారం జీరో అకౌంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎఫ్ఐ వొకేషనల్ ట్రైనర్ అంజిబాబు, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కనిగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సతీమణి ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ముక్కు కవిత పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో తెలుగుమహిళల ఆధ్వర్యంలో కేకు కట్‌చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య మహిళా సిబ్బందికి చీరెలు పంపిణీ చేశారు. తొలుత స్థానిక అంకాలమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ వాజిదాబేగం, కరణం అరుణ, దొరసాని, తులసి, లక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పల్లెల్లో లోపించిన పారిశుధ్యం

» రహదారుల పక్కనే పడవేస్తున్న చెత్తాచెదారం
» దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
» పట్టించుకోని అధికారులు


ముండ్లమూరు నుంచి సింగనపాలెం వెళ్ళే రహదారి పక్కన పడవేసిన వ్యర్థ పదార్థాలు

ముండ్లమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. వ్యర్థ పదార్థాలను గ్రామాలకు సమీపంలో రహదారుల పక్క న పారబోస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లు తుండ టంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి పంచాయతీలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఉపాధి హామీ పథకం నిధులతో డంపింగ్ యార్డులు నిర్మిం చారు. అవి ఊరికి దూరం ఉన్నాయనే నెపంతో క్లాప్ మిత్రలు సేకరించిన చెత్తను రహదారుల పక్కన పడ వేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ఈవ్యర్థాలు కుళ్లి పోయి దుర్వాస వస్తుంది. దీనికితోడు వీధి కుక్కలు ఈ వ్యర్థాలను రహదారుల పైకి తెస్తున్నాయి. ముండ్ల మూరులోని సింగనపాలెం రహదారికి పక్కనే వ్యర్థప దార్థాలను పడవేస్తున్నారు. అదే పంచాయతీ పరిధిలో అద్దంకి - దర్శి ప్రధాన రహదారి పై కూడా వ్యర్థ పదార్థాలను పారబోస్తున్నారు. పసుపుగల్లు ఎస్సీ కాలనీ సమీపంలో రెండుచోట్ల వ్యర్థ పదార్థాలను పడవేస్తున్నారు. మారెళ్ళ, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, పులిపాడు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పసుపుగల్లులో లక్షల రూపాయలతో నిర్మిం చిన డంపింగ్ యార్డు మూలన పడింది.

ఇదిలాఉండగా, మండలంలోని ఈదర పంచాయతీ లో ఇటీవల కురిసిన వర్షానికి వీధులన్నీ బురదమయ మయ్యాయి. కనీసం ఇళ్ళలోని ప్రజలు బయటకు రావాలంటే కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. రమణా రెడ్డిపాలెం నుంచి ఈదర గ్రామంలోకి వచ్చే ప్రధాన రహదారి బురదమయమైంది. దీంతో ప్రజల రాకపోక లకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఈదరలో ప్రధాన వీధి దుస్థితి

శిథిలమవుతున్న చెత్త రవాణా వాహనాలు


శిథిలమైపోతున్న చెత్త రవాణా వాహనాలు

దర్శి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అందించిన రవాణా వాహనాలు నిరుపయోగంగా మారాయి. పంచాయతీలకు వాహనాలను పంపిణీ చేయగా, అవి వినియోగించకపోవడంతో తుప్పుపట్టి శిథిలమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పంచాయతీలకు చెత్త రవాణా వాహనాలను పంపిణీ చేశారు. కొన్నింటిని పంచాయతీలకు అందజేశారు. ఇంకా నాలుగు వాహనాలను మంజూరైన పంచాయతీలకు అందజేయకపోవటంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అధికారుల నిర్లక్ష్యంతో ఈ వాహనాలను సక్రమంగా వినియోగించ లేదు. పంచాయతీలకు ఇచ్చిన వాహనాలను కూడా అలాగే మూలనపడేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. స్వచ్ఛాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. సంబంధిత అధికారులు నిరుపయోగంగా ఉన్న చెత్త వాహనాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

చుక్క నీరులేని చెరువులు

» దాహార్తితో అలమటిస్తున్న మూగజీవాలు
» అడుగంటిన భూగర్భ జలాలు » పశుపోషకుల అగచాట్లు


ఎండిపోయిన నాయుడుపాలెం చెరువు

ముండ్లమూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లోగల చెరువులు చుక్కనీరులేక ఎండిపోయాయి. దీంతో మేత కోసం వెళ్ళే మూగ జీవాలు దాహార్తి కోసం అల్లాడిపోతున్నాయి. నాయుడుపాలెం, నూజెండ్లపల్లి, పూరిమెట్ల, పోలవరం గ్రామాల్లో చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. మోదేపల్లి మేజరు పరిధిలో సాగర్ జలాలు నింపాలని ఆయా


చుక్కనీరు లేని నూజెండ్లపల్లి చెరువు

గ్రామాల పశు పోషకులు కోరుతున్నారు. మండలంలో 33వేల మూగ జీవాలు ఉన్నాయి. ఇందులో 20వేలకు పైగా జీవాలు ప్రతిరోజు మేత కోసం పొలం వెళ్తుంటాయి. ప్రధానంగా చెరువులపై ఆధారపడి దాహార్తిని తీర్చుకుంటున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి సైతం చెరువులకు నీరు చేరలేదు.

ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవటంతో నాగార్జున సాగర్ పూర్తి స్థాయిలో నిండింది. వారం రోజుల క్రితం కాలువలకు సాగర్ నీటిని విడుదల చేశారు. సంబంధిత అధికారులు సైతం చెరువులు నింపాలని ఆదేశించారు. అయితే, మోదేపల్లి మేజరు కాలువ ఆధునికీకరణ పనులు జరుగుతుండటం వల్ల నీటిని నిలిపివేశారు. దీంతో మేజరు పరిధిలోని చెరువులకు నీరు నింప లేదు. చెరువుల్లో నీరు లేకపోవడంతో సమీపంలోని వ్యవసాయ బోర్లు సైతం ఎండి పోయాయి. ఇప్పటికైనా ఎన్ఎస్‌పీ అధికారులు స్పందించి సాగర్ జలాలతో చెరువులను నింపాలని పశుపోషకులు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» మాజీ ఎమ్మెల్యే పాపారావు


సొసైటీ చైర్మన్ రమణారెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

తాళ్లూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. సోమవారం మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడిగా గొంది రమణారెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. మన్నేపల్లి సొసైటీ కార్యాలయం వద్ద జరిగిన ఈకార్యక్రమంలో పాల్గొన్న పాపారావు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రైతులకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. సీఎం చంద్రబాబు రైతులు పడుతున్న కష్టాలను గుర్తించి అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నారని చెప్పారు.

మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా రైతులకు అవసరమైన సేవలు అందిస్తామన్నారు. కష్టపడే కార్యకర్తలకు టీడీపీ సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పారు. అందుకు తానే నిదర్శనమ న్నారు. తనకు అవకాశం కల్పించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, నేతలకు రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు.

కార్యక్రమంలో నాగంబొట్లపాలెం సొసైటీ చైర్మన్ వల్లభనేని సుబ్బయ్య, దర్శి సహకార సంఘం అధికారి జిలానీ బాషా, తూర్పుగంగవరం పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ మాధవరావు, ఏఎంసీ డైరెక్టర్లు కాశీంసైదా, హనుమారెడ్డి, సొసైటీ సభ్యులు కె.శ్రీనివాసరావు, ఎన్.వీరరాఘవులు, నాయకులు తూము శివనాగిరెడ్డి, వెలుగు ఏడుకొండలు, అనపర్తి ఎఫ్రయిమ్, నాదెండ్ల శ్రీను, మహబూబ్ సుభాషినీ(బుజ్జి), ఆదినారాయణరెడ్డి, వంగపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవెంకటాపురంలో తాగునీటి ఎద్దడి

» మొరాయించిన బోర్లు
» వ్యవసాయ పొలాల్లోని నీరే దిక్కు
» పట్టించుకోని అధికారులు


నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

దొనకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం పంచాయతీ పరిధిలోని కొత్త వెంకటాపురం ప్రజలు గత కొద్దిరోజులుగా దాహార్తితో అల్లాడుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో గ్రామంలోని దాదాపు అధికసంఖ్య ఇళ్లల్లోని బోర్లలో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో బోర్లు మొరాయించటంతో నీటి సమస్య తీవ్రమైంది. ప్రస్తుతం వర్షాకాలంలోనే తమకు నీటి సమస్య తీవ్రమైందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామంలో దాదాపు వంద ఇళ్లు ఉన్నాయి. అధిక సంఖ్యలో ఇళ్లల్లోని బోర్లు మొరాయించటంతో బిందెడు నీటికోసం కొందరు సుదూర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాల్లోని బోర్లవద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మరికొందరు తమ ఇళ్లలో వస్తున్న కొద్దిపాటి నీటితో సరిపుచ్చుకుంటున్నారు. వ్యవసాయ పొలాల్లోని బోర్ల నుంచి ట్యాంకర్‌తో తెచ్చిన నీటిని డ్రమ్ము రూ.100 పెట్టి కొందరు కొనుగోలు చేసుకొని నీటి అవసరాలు తీర్చుకుంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలోని ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌కు చెందిన బోరులో నీళ్లు వస్తుండటంతో బబుల్ రూ.10 చొప్పున కొనుగోలు చేసుకొని దాహార్తి తీర్చుకుంటున్నారు. వాటర్ ప్లాంట్ బోరు అడుగంటితే తమ పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో గుక్కెడు మంచినీళ్లు దొరక్కపోతే గ్రామ ఆన్ని వదిలి వెళ్లాల్సి వచ్చే పరిస్థితులు ఎదురవుతాయనే భయాందోళనలు కల్గుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. తమ గ్రామంలోని నీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేదంటున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త వెంకటాపురంను సందర్శించాలని కోరుతున్నారు. గ్రామంలోని నీటి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించాలని గ్రామస్థులు పేర్కొన్నారు. ట్యాంకర్లు ఏర్పాటుచేసి నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఆదిశగా చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు

తాళ్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బీవీ రమణరావు హెచ్చరించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఎరువులు, పురుగుమందుల డీలర్లతో జరిగిన సమావేశానికి ఏవో ప్రసాదరావు అధ్యక్షత వహించారు. రమణరావు మాట్లాడుతూ రైతుల అవసరంమేరకే ఎరువులు అందజేయాలన్నారు. అవసరం లేకుండా ఇస్తే మిగిలిన రైతులు ఇబ్బందులు పడతారన్నారు. కౌలు రైతులకు కూడా వీఆర్వోల సర్టిఫికెట్లు తీసుకుని ఎరువులు అందజేయాలన్నారు. స్టాక్ వివరాలను రోజువారీగా బోర్డులో తెలియజేయాలన్నారు. నిత్యం ఎంతమేర ఎరువులు అమ్మకం జరుగుతుందో ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలన్నారు.

మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందుల దుకాణాల డీలర్లు ఎరువులను అక్రమంగా నిల్వలు ఉంచి రైతులకు అందించ కుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద 755.1 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 92 టన్నులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో ఏఎస్ఐ మోహన్‌రావు, డీలర్ల అసోషియేషన్ అధ్యక్షుడు జాష్టి వెంకట్రావు, డీలర్లు పాలెం శ్రీనివాసరెడ్డి, యండ్రవల్లి భాస్కర్‌రెడ్డి, మారం సుబ్బారావు, మేడగం నాగేశ్వరరెడ్డి, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు


సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఉమామహేశ్వర అగ్రహారం విద్యార్థినులు

ముండ్లమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు మాధవి తెలిపారు. ఇటీవల ఒంగోలులోని హర్షిణి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పోటీల్లో బి.భావన, బి.కీర్తన, భాగ్యశ్రీ, హరిప్రియ, ప్రణతి, తేజశ్వని, సీహెచ్ మాధురి, పావని ప్రతిభచూపారన్నారు. వీరు జిల్లా తరుపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం తెలిపారు. ఎంపికైన బాలికలను ఉపాధ్యాయులు అభినందించారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

కనిగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.7 వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. సెప్టెంబరు, 2009లో హనుమంతునిపాడు మండల కేంద్రంలో దనేకుల తిరుపతయ్య అనే వ్యక్తి కూల్‌డ్రింక్ షాపులో ఉన్న మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయటం తో అతను పారిపోయాడు. ఈ ఘటనలో తిరుపతయ్యపై కేసు నమోదు చేసి పోలీసులు కోర్టుకు హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్యాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో ప్రత్యేక పోక్సో మానటరింగ్ బృందం ద్వారా వాదనలు జరిగాయి. సరైన సాక్ష్యాధారాలతో నిందితుడిపై పలు సెక్షన్‌ల కింద నేరాన్ని నిరూపించటంతో ఒంగోలు పోక్సో కోర్టు న్యాయాధికారి కె.శైలజ నిందితుడికి మూడేళ్ళు జైలు శిక్ష, రూ.7వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈకేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి కనిగిరి సీఐ కె.వెంకటేశ్వరరావు, ప్రస్తుత సీఐ ఖాజావలి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు, కనిగిరి హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్, ఏఎస్ఐ ఈవీ స్వామి, కానిస్టేబుల్ యలమందను ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి రూపశ్రీ

కనిగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రూపశ్రీ అన్నారు. కనిగిరి కోర్టు పరిధిలోని పోలీస్ సిబ్బందితో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీ మార్గం ద్వారా కక్షిదారుల విలువైన డబ్బును, సమయాన్ని ఆదా చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించారు. ఎన్నో ఏళ్ళుగా కేసులు పరిష్కారం కాకపోగా, మానసిక ఒత్తిడితో పాటు ప్రశాంతతను కోల్పోయే అవకాశం ఉందన్నారు. పోలీసులు ప్రత్యేకంగా సదస్సుల ద్వారా ప్రజల్లో లోక్ అదాలత్‌పై అవగాహన కలిగేలా కృషి చేయాలని కోరారు. సెప్టెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సీఐ ఖాజావలి, ఎస్ఐ టి.శ్రీరాం, కృష్ణపావని, మాధవరావు, వివిధ మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


చింతలపూడిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీచేస్తున్న అధికారులు

ముండ్లమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పసుపుగల్లు, చింత లపూడిలో ఎరువుల దుకాణాలపై ఏకకాలంలో ఒంగోలు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ ఎస్.రాఘవరావు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో ఎరువుల బస్తాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రాఘవరావు తెలిపారు. ఓ దుకాణంలో 130 బస్తాల యూరియా, 90 బస్తాల డీఏపీని సీజ్ చేశారు. మరో దుకాణంలో 50 బస్తాల యూరియాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏవో శివనాగ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, కమర్షియల్ ట్యాక్స్ అధికారి రామారావు, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాఘవరావు తెలిపారు.



అధైర్యపడొద్దు.. అర్హులకే దివ్యాంగ పింఛను : కలెక్టర్

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి దివ్యాంగుడికి పింఛను సౌకర్యం కల్పిస్తామని, ఎవరూ అధైర్య పడొద్దని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దివ్యాంగులు పెన్షన్ కోసం అధికంగా దరఖాస్తు చేశారని, దివ్యాంగుల పింఛన్లను అనర్హులు పొందుతున్నారనే ఉద్దేశంతోనే.. ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టిందన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఒక తేదీని కేటాయించి.. దివ్యాంగులకు తెలియజేస్తామని చెప్పారు.ఆ తేదీల్లో పునఃపరిశీలన కేంద్రాలకు వెళ్లి.. డాక్టర్లతో పరీక్ష చేయించుకోవాలని పేర్కొన్నారు.

అధ్యక్ష పదవి కోసం పోటాపోటీ

- త్రిసభ్య కమిటీతో ఆశావహుల భేటీ
- హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడి ఎంపిక కసరత్తు మొదలైంది. ఇందుకు సంబంధించిన పరిశీలన, అభిప్రాయ సేకరణ, ఆశావహుల వినతులను స్వీకరించడానికి పార్టీ అధిష్ఠానం నియమించిన త్రిసభ్య కమిటీ సోమవారం బాపట్లలోని టీడీపీ కార్యాలయానికి వచ్చింది. శాసనమండలి చీఫ్‌విప్ అనురాధతో పాటు నేతలు వీరంకి గురుమూర్తి, మన్నె సుబ్బారెడ్డిలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. వీరితో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, వేగేశన నరేంద్రవర్మ, కొండయ్య, బీఎన్ విజయ్ కుమార్‌లు కూడా త్రిసభ్యకమిటీతో సమావేశమై అధ్యక్షుడి ఎంపికలో తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చిన మండల స్థాయి నేతలతో సమావేశం అనంతరం విడివిడిగా ఆశావహుల నుంచి వినతులు స్వీకరించారు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, వేదికపై మంత్రి గొట్టిపాటి రవి, చీఫ్‌విప్ అనురాధ, ఎమ్మెల్యే వేగేశన, కొండయ్య తదితరులు

భారీ సంఖ్యలో ఆశావహులు...

త్రిసభ్యకమిటీతో పాటు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేల ముందు హాజరై తమ పేర్లను బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్ష పదవికి పరిశీలించాలనే వినతులు పెద్ద సంఖ్యలో అందాయి. దాదాపు 20 పేర్లు తుది పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. రేపల్లెకు చెందిన గూడపాటి శ్రీనివాసరావు, చీరాలకు చెందిన విద్యాసంస్థల అధినేత పొగడదండ రవికుమార్, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్యలతో పాటు మొత్తం 20 మంది వరకు నేతలు లోక్‌సభ టీడీపీ అధ్యక్ష పీఠంపై కన్నేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత అధ్యక్షులు సలగల రాజశేఖర్‌బాబు మరోమారు తనకు అవకాశం ఇవ్వాలని కూడా కోరినట్లు సమాచారం. అధ్యక్ష పదవికోసం వచ్చిన విజ్ఞప్తులన్నింటినీ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామని, తుది నిర్ణయం అక్కడే జరుగుతుందని త్రిసభ్యకమిటీ ఆశావహులకు స్పష్టం చేసింది

రక్షణ వలయంలా నిలిచారు..

బాపట్ల లోక్‌సభ స్థానం టీడీపీ అధ్యక్ష ఎంపికకు పరిశీలకురాలిగా అధిష్ఠానం నియమించిన ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, జిల్లా నేతలతో తనకున్న అనుబంధాన్ని ఈ సమావేశం వేదికగా గుర్తు చేసుకున్నారు.

గత ప్రభుత్వం ఎంతగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ తనను ఎమ్మెల్సీగా గెలిపించడంలో బాపట్ల జిల్లా నేతలు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికు మార్, ఏలూరి సాంబశివరావులు కీలకంగా పనిచేశారని అనురాధ అన్నారు. ఓ దశలో వైసీపీ నేతలు తనపై దాడికి పాల్పడతారనే సమాచారంతో వీళ్లంతా తనకు రక్షణ వలయంలా నిలుచున్నారని గుర్తు చేసుకున్నారు. కోటికి పైగా సభ్యత్వాలు ఉన్న ఏకైక పార్టీ టీడీపీ అని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పార్టీ పదవుల కేటాయింపుల్లో సామాజిక సమీకరణాలతో పాటు మరెన్నో అంశాలు కీలకంగా ఉంటాయని మంత్రి తెలిపారు. టీడీపీ అధ్యక్ష ఎంపిక కోసం పార్టీ అధిష్ఠానం కొన్ని గైడ్ లైన్స్ ఇచ్చిందని వాటి ఆధారంగానే ఎంపిక ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తమతో సహా అందరూ త్రిసభ్య కమిటీ ముందు తమతమ అభిప్రాయాలు చెబితే వాటిని పార్టీ అధిష్ఠానం దృష్టికి వారు తీసుకెళ్లడం జరుగుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

సామాజిక సమీకరణాలే కీలకం..

లోక్‌సభ స్థానం టీడీపీ అధ్యక్ష ఎంపిక అంశం సామాజిక సమీకరణాలతో పాటు ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే ఇచ్చిన పదవుల దామాషాను కూడా పరిశీలనలోకి తీసుకోవడం జరుగుతుందని తెలుస్తోంది. జిల్లాలో చూసుకుంటే ఆరు నియోజకవర్గాలు ఉండగా, లోక్‌సభ స్థానం వచ్చేసరికి ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు కూడా దీనిలో భాగంగా ఉంటుంది. పార్టీ పదవుల్లో నియోజకవర్గాల దామాషాను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సోమవారం నాటి సమావేశంలో బాహాటంగానే చెప్పారు. ఈ అంశంతో పాటు ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే ఇచ్చిన నామినేటెడ్ పదవుల సంఖ్య కూడా పార్టీ పదవుల కేటాయింపుల్లో ప్రధాన భూమిక పోషించనున్నట్లు సమాచారం.

అన్నదాతకు.. అంతులేని కష్టం!

- జిల్లా వ్యాప్తంగా 25,000 ఎకరాల్లో పైరుకు నష్టం
- రాయితీపై విత్తనాలు అందించే ప్రయత్నాల్లో ప్రభుత్వం
- మండలాలవారీగా ఇండెంట్ అడుగుతున్న వ్యవసాయ శాఖ


బాపట్ల: ముంపు బారిన పడిన వరి పైరు (పాత చిత్రం)

ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలు అన్నదాతలకు తీరని ఆవేదనను మిగిల్చాయి. వెద పద్ధతిలో సాగు చేసిన వరిపైరు మొత్తం వర్షార్పణమైనట్లేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల వయసున్న వరి పైరు ముంపు బారిన పడడంతో పాటు, దాదాపు నాలుగైదు రోజులు నీళ్లల్లోనే పైరు ఉండడంతో మొత్తం కుళ్లిపోయి పనికిరాకుండా పోయిందని, ఎకరాకు దాదాపు రూ.10,000 వరకు ఖర్చు చేశామని రైతులు వాపోతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయశాఖ ప్రాథమిక లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 16,325 హెక్టార్లలో పైరు ముంపుబారిన పడిందని తేల్చి ప్రభుత్వానికి నివేదించింది. ఇందులో 85 శాతం వాటా వరిదే ఉంది. తుది లెక్కల ప్రకారం దాదాపు 25,000 ఎకరాల్లో పైరు పూర్తిగా దెబ్బ తిన్నదని తేల్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పైరును ఈ క్రాప్ చేయాలన్నా కూడా కనీసం మూడు వారాల సమయం ఉండాలి. ముంపుబారిన పడిన పైర్లలో ఎక్కువశాతం పది రోజుల లోపు సాగు చేసినవే ఉండడంతో ఈ క్రాప్ నమోదుకు కూడా అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. దీనిలో భాగంగా ముంపు బారిన పడి నష్టపోయిన రైతాంగానికి విత్తనాలను రాయితీపై అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలాల వారీగా ఏ మేరకు విత్తనాలు అవసరమవుతాయో లెక్క తేల్చే పనిలో వ్యవసాయశాఖ నిమగ్నమయి ఉంది. ఇదిలా ఉంటే వారం రోజుల వ్యవధిలో ఇద్దరు కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడడం ఆందోళన కలిగించేదిగా ఉంది. అన్నదాతలెవరూ అధైర్య పడవద్దని, పైరు నష్టపోయిన వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దానిలో భాగంగానే రాయితీపై విత్తనాలు అందించడానికి కసరత్తు జరుగుతోందని వ్యవసాయశాఖ చెబుతోంది

రాయితీ విత్తనాలపై కసరత్తు...

ముంపు బారిన పడి పైరు నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా రాయితీపై రైతులకు విత్తనాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే మండలాల వారీగా ఎంత పరిమాణంలో విత్తనాలు అవసరమవుతాయో నివేదిక పంపాలనే ఆదేశాలు కమిషనరేట్ నుంచి వ్యవసాయశాఖకు అందాయి. మండలాల పరిధిలో సిబ్బంది రైతుల నుంచి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయింది.


తక్కువ పెట్టుబడి అని వెద సాగుకు...

నానాటికీ వ్యవసాయం జూదంగా మారుతున్న తరుణంలో తక్కువ పెట్టుబడితో సాగు చేయొచ్చని అధికశాతం రైతాంగం ఈ ఖరీఫ్‌లో వెద సాగువైపు మొగ్గింది. వ్యవసాయశాఖ తుది లెక్కల ప్రకారం తాజా ముంపుకు జిల్లా వ్యాప్తంగా 25,000 ఎకరాల్లో పైరు దెబ్బ తిన్నట్లు తేల్చింది. ఇందులో దాదాపు 16,000 ఎకరాల వరకు వరిపైరు వెద పద్ధతిలో సాగు చేసిందే ఉండడం గమనార్హం. వెద పద్ధతిలో అయితే నీటి వినియోగం తక్కువగా ఉండడంతో పాటు కూలీల అవసరం పెద్దగా ఉండకపోవడంతో పాటు పంట కూడా ముందుగానే కోత కు వస్తుందని, తద్వారా ప్రకృతి విపత్తుల నుంచి తప్పించుకోవచ్చనేది అన్నదాతల ఆలోచనగా ఉండి ఆ దిశగా అడుగులేశారు. కానీ విరుచుకుపడిన వర్షాలు ఆదిలోనే పైరును దెబ్బతీశాయి. అదే నారు విధానం ద్వారా సాగు చేసి ఉంటే పైరుకు నెల రోజుల వ్యవధి ఉండేదని, ఈ ముంపు వల్ల పెద్దగా నష్టం ఉండేది కాదని రైతులు వాపోతున్నారు.

సందట్లో సడేమియా!

ఎప్పుడైతే ఇంటి పన్ను పెంచమని ప్రభుత్వం చెప్పిందో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని కొందరు పంచాయతీ కార్యదర్శులు మెదడుకు పదును పెట్టారు. 2000 నుంచి ఆస్తి పన్ను పెంపు లేదు కాబట్టి తాజా మార్కెట్ విలువ ప్రకారం పన్ను పెంచేందుకు సిద్ధం అయ్యారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను సంప్రదించి.. పలు దఫాలు పెరిగిన మార్కెట్ విలువలను ఆధారంగా ఇంటి పన్ను భారీగా పెంచారు. ఉదహరణకు గతంలో రూ.300 మాత్రమే ఉన్న ఇంటి పన్ను తాజా మార్కెట్ రేటు ప్రకారం రూ.1,300 వరకు వెళ్లింది. ఈ విధంగా పన్ను పెంచుతున్నారన్న సమాచారం బయటకు పొక్కడంతో తీవ్ర దుమారం రేగింది.

ఇదేం పంచాయితీ!



ఒక పథకం ప్రారంభించే ముందు.. దానిని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్యోగులకు సరైన శిక్షణ ఇవ్వకుంటే ఎటువంటి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయో.. కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన 'స్వర్ణ పంచాయతీ' కార్యక్రమం ఒక మంచి ఉదాహరణ. జీవోలోని అసలు విషయం అర్థం కాక.. పంచాయతీ కార్యదర్శులు ఎడాపెడా ఆస్తి పన్ను పెంపునకు సిద్ధం కావడంతో.. గ్రామీణ ప్రజల్లో ఒక దుష్ప్రచారానికి, ఆందోళనకు కారణమైంది. దీంతో ఉన్నతాధికారులు అప్రమత్తమై.. దిద్దుబాటు చర్యలు చేపట్టారు. పన్ను పెంపు జరిగిన చోట అసెస్మెంట్ల ఆన్‌లైన్ ప్రక్రియకు బ్రేకులు వేశారు.

- 'స్వర్ణ పంచాయతీ' కార్యక్రమంలో పన్ను పోటు
- శిక్షణ లేక.. జీఓలు అర్థం కాని కార్యదర్శులు
- ఎడా పెడా పన్ను పెంచేసిన వైనం
- ప్రభుత్వ ఆదేశాలతో మళ్లీ అసెస్మెంట్‌ల సమీక్ష
- పెంపు 5 శాతమే ఉండే విధంగా ఆదేశాలు

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి): గతంలో కేవలం రూ. 250 మాత్రమే ఉన్న ఇంటి పన్ను ఒకేసారి రూ.1000 అయ్యింది. అసాధారణ పన్ను పోటుతో గ్రామీణ ప్రజలు బేంబేలెత్తి పోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రభుత్వం చెప్పిన సంగతిని పంచాయతీ కార్యదర్శులు సరి గా అర్థం చేసుకోకపోవడంతో ఉమ్మ డి గుంటూరు జిల్లాలోని 1,172 గ్రామ పం చాయతీల్లో ఆందోళన నెలకొంది. అయితే ఉన్నతాధికారులు అప్రమత్తం కావడంతో.. దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు.

ముందుగానే భారీ ప్రచారం?

స్వర్ణ పంచాయతీ కార్యక్రమం.. కార్యాలయాలకే పరిమితమైంది. కానీ, పన్ను బాగా పెంచేశారన్న ప్రచారం భారీగా జరిగింది. ప్రజలపై భారం మోపుతున్నారంటూ వైసీపీ దుష్ప్రచారం ప్రారంభించింది. ప్రజలకు ఇంటి పన్ను పెంపు నోటీసులు ఇవ్వకుండానే ఈ భారీ ప్రచారం పట్ల ప్రభుత్వ వర్గాలు కూడా ఆశ్చర్య పడుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది కొందరు వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకు ఈ ప్రచారం అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది.

అసలు ఉద్దేశం ఇదీ..

ఈ ఏడాది జనవరిలో స్వర్ణ పంచాయతీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం కల్పిం చింది. అది కూడా నేరుగా పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమ కావడంతో.. ఎప్పుడు కావాలంటే అప్పుడు నగదు డ్రాచేసుకొని వినియోగించుకునే వీలు కల్పించింది. అందులో భాగంగా ప్రతి ఇంటికి మళ్లీ కొలతలు తీసుకొని జీవోకు లోబడి పన్ను పెంపు జరగాలని పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో)

బిల్లు.. జేబుకు చిల్లు

- మళ్లీ మొదటికి 'పల్లె పండుగ' బిల్లుల చెల్లింపులు
- ఉమ్మడి జిల్లాల్లో రూ.78 కోట్ల బకాయిలు
- ఎనిమిది నెలలుగా తప్పని ఎదురు చూపులు

(అద్దంకి - ఆంధ్రజ్యోతి)

'పల్లె పండుగ' బిల్లుల చెల్లింపు విధానం మళ్లీ మొదటికొచ్చింది. ఉపాధి హామీ పథకం నిధుల తో పల్లెల్లో పెద్ద ఎత్తున ప్రగతి పనులు చేపట్టిన వారి జేబులకు చిల్లు పడేలా కనిపిస్తోంది. ప్రతి గురువారం చెల్లింపులు చేపడతామన్న ప్రభుత్వ హామీ రెండు వారాలకే పరిమితమైంది. పనులు చేస్తే వెంటనే సొమ్ములు వస్తాయని కూటమి నేతలు అప్పులు చేసి సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం వంటి పనులను పల్లెల్లో పెద్ద ఎత్తున చేశారు. పనులు పూర్తయ్యి 8 నెలలు గడుస్తున్నాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో సుమారు రూ.78 కోట్ల విలువైన బిల్లుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. బిల్లులు ఇప్పించాలని కొన్ని చోట్ల ఎమ్మెల్యేలపై నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ఈ పథకం ప్రారంభంలో మొదటి రెండు వారాలు బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరిగాయి. అనంతరం పల్నాడు జిల్లాలో రూ.47 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.23 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.8 కోట్లు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో పనులు చేపట్టిన వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. బిల్లులు చెల్లించి తమను అప్పుల ఊబీ నుంచి బయట పడేయాలని కోరుతున్నారు.


గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం

మళ్లీ మొదటికి..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు ఉపాధి హామీ పథకం కింద పనులు చేసి, బిల్లులు రాక చేతులు కాల్చుకున్నారు. ప్రస్తుతం అందులో చాలా మంది పల్లె పండుగ పథకం పనులు చేపట్టారు. పాత బిల్లుల మాట ఎలా ఉన్నా.. కొత్త బిల్లులు కూడా నిలిచిపోవడంతో.. పరిస్థితి మళ్లీ మొద టికొచ్చిందని వారు భావిస్తున్నారు. పనులకు డబ్బులు ఖర్చు పెట్టి అప్పులు పాలయ్యామని, వడ్డీలు కట్టలేక పోతున్నామని పార్టీ నేతలు ఆవేదన వక్తం చేస్తున్నారు.

నాడు-నేడు పనులకు...
వీడని గ్రహణం

- నిలిచిపోయిన 40 పాఠశాలల నిర్మాణ పనులు

వేమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన నాడు-నేడు పనులకు గ్రహణం వీడలేదు. అప్పట్లో మొత్తం 40 పాఠశాలల్లో నిర్మాణాలను ప్రారంభించారు. వాటిలో వేమూరు మండలంలోని ఒక్క పాఠశాల నిర్మాణం పూర్తయింది. మిగతా వాటిలో నిర్మాణాలు ప్రారంభించి వివిధ దశలో నిలిపి వేశారు. దీంతో పాత భవనాలు దెబ్బతిని నిర్వహణకు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాడు నేడు స్థానంలో మనబడి మన భవిష్యత్తు అనే పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించారు. నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించాలి. నిర్మాణం పూర్తికాగానే చేపట్టాల్సిన ద్వారబంధాలు, కిటికీలు రంగులు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు అందాల్సి ఉన్నాయి. ఈ నిర్మాణం పనులు వైసీపీ పాలనలో పూర్తి కావాల్సి ఉండగా, ఆ ప్రభుత్వం సకాలంలో సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడి పనులు సాగలేదు. అమృతలూరు మండలంలో ఐదు పాఠశాలల పనులు పూర్తి కాలేదు. వేమూరు మండలంలో 14 పనులకు గాను ఒక పని మాత్రమే పూర్తయ్యింది. 13 పాఠశాలలకు నిధులు విడుదల కాని కారణంగా నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కొల్లూరు మండలంలో ఒక పాఠశాల నిర్మాణానికి కూడా నిధులు రాలేదు. భట్టిప్రోలు మండలంలో 9 పాఠశాలలకు గాను రెండు నిర్మాణాలను అసలు ప్రారంభించకపోగా ఏడు పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. చుండూరు మండలంలో 11 పనులకు గాను ఒక పనిని అసలు ప్రారంభించకపోగా 11 పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. ప్రభుత్వం మారింది కానీ కొన్ని చోట్ల పర్యవేక్షణ విషయంలో రాకపోవడంతో కూడా కొన్ని నిర్మాణాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధులను విడుదల చేయకపోగా కొన్ని టెండర్లను పిలిచేందుకు కూడా ముందుకు రాకపోవడంతో తుది దశలో నిర్మాణ పనులు నిలిచిపోయి ఆయా పాఠశాలలు ప్రారంభానికి నోచుకోకుండా ఉన్నాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం వీటిపై దృష్టి నిర్మాణాలను పూర్తి చేయించి పాఠశాలల నిర్వహణ విషయంలో ఇబ్బందులు లేకుండా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.


ప్రారంభానికి నోచుకోని వేమూరులోని ప్రాథమిక పాఠశాల భవనం

పొగాకు కొనుగోలు కేంద్రం వద్ద రైతు హల్‌చల్

బేళ్లు కొనుగోలు చేయలేదని ఆందోళన

పర్చూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తీసుకొచ్చిన పొగాకు కొనలేదని ఓ రైతు పర్చూ రులో పొగాకు కొనుగోలు కేంద్రం వద్ద పెట్రో లుతో హల్‌చల్ చేశాడు. యద్దనపూడి మండ లం పూనూరుకు చెందిన ఓ రైతు 37 బేళ్లతో కొనుగోలు కేంద్రం వద్దకు వచ్చాడు. అందులో పొగాకు నాణ్యత లేకపోవటంతో 11 చెక్కులను మాత్రమే కొనుగోలు చేశారు. దీంతో మన స్తాపానికి గురైన రైతు బయటకు వెళ్లి పెట్రో లు తీసుకొచ్చి తిరస్కరించిన పొగాకు తగుల బెట్టి, తానూ ఆత్మహత్య చేసుకుంటానని హ డావుడి చేశాడు. దీంతో అప్రమత్తమైన గోడౌన్ మేనేజర్ లక్ష్మీజయ ఉన్నతాధికారులతో పాటు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న మార్క్‌ఫెడ్ బాపట్ల జిల్లా డీఎం కరుణశ్రీ, యద్దనపూడి తహసీల్దార్ రవికు మార్, ఏవో కుమారి, ట్రైనీ ఎస్సై గోపి సిబ్బంది తో కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకొని వివ రాలు అడిగి తెలుసుకున్నారు. అయితే పొగాకు నాణ్యత లేకపోవటంతో ప్రభుత్వ నిబంధనకు అనుగుణంగా తిరస్కరించటం జరిగిందని సంబంధిత బయ్యర్లు తెలిపారు. బయ్యర్లతో అధికారులు చర్చించి, తిరస్కరించిన చెక్కుల్లో మరో పది చెక్కులను కొనుగోలు చేయటంతో కథ సుఖాంతం అయ్యింది. నిబంధనలకు విరు ద్ధంగా తాము కొనుగోలు చేయలేమని, నాణ్యత లేని పొగాకును కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువచ్చి ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదని రైతుకు అధికారులు హితవు చెప్పా రు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పొగాకు కొను గోలును నీరుకార్చే చర్యలు చేపట్టడం విచారకరం అన్నారు.


పర్చూరులో పొగాకు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అధికారులు

వరదలతో.. రోడ్లు గుంతలమయం


గొరిగెపూడి కరకట్టనుంచి పెసర్లంక వెళ్లే రహదారి దుస్థితి

రేపల్లె, ఆగష్టు 25(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు లంక గ్రా మాల్లోని రోడ్లు గుంతలమయంగా మా రాయి. చిన్న రేవు వద్ద వచ్చిన వరద కారణంగా కట్టలు రెండువైపులా కోతలకు గురికావటంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. ఓలేరునుంచి పెసర్లకం వెళ్ళే రహదారంతా భారీస్థాయిలో గుంతలు ఏర్పడ్డాయి. తారురోడ్డు కొట్టుకుపోయి కంకరరాళ్ళు పైకి తేలాయి. చిన్నరేవులో వరదనీరు తగ్గకపోవటంతో రాకపోకలు నిలిచాయి. ఈ రహదారంతా ఛిద్రమైపోయింది. గొరికపూడినుంచి పెసర్లంక వెళ్ళే తారురోడ్డు గుంతలుపడి రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. అధికారులు దృష్టి సా రించాలని లంక గ్రామాల ప్రజల విన్నవిస్తున్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాస్వామ్యం అపహాస్యం

● కాంగ్రెస్ పార్టీ నిరసన ర్యాలీ

ఒంగోలుక్రైం,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బీజేపీ, ఎన్నికల కమిషన్ అపహాస్యం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా విమర్శించారు. సోమవారం ఓట్ల దొంగ, సీట్లు దొంగ, గద్దెదిగు అనేని నాదంతో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ ఓట్లు చోరీ చేసి సీట్లు సంపాదించిన బీజేపీ గద్దె దిగాలిఅని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఓట్ల దొంగలు గద్దె దిగాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని మిరియాల పాలెం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి ట్రంక్‌రోడ్డు , మస్తాన్ దర్గా సెంటర్, పాతమార్కెట్ మీదుగా బాపూజీ కాంప్లెక్స్ వద్దగల మహాత్మాగాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల రంగస్వామి, దేవరపల్లి సుబ్బారెడ్డి, పాలపర్తి విజేష్‌రాజ్, మన్నం ప్రసన్నరాజు, బొడ్డు సతీష్,తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

పెన్షన్ సవరణ క్లాజ్‌ను రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లుల్లో దుర్మార్గ పెన్షన్ సవరణ క్లాజ్‌ను వెంటనే తొలగించాలని పలువురు డిమాండ్‌చేశారు. ఏపీఆర్‌పీఏ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జి. శేషయ్య అధ్యక్షత వహించారు. ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ పెన్షన్ సవరణ క్లాజును రద్దుచేయకపోతే కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీగడ వెంకటేశ్వరరెడ్డి, టీవీఆర్ సుబ్బారావు, సీహెచ్‌లక్ష్మీనారాణ, రాబిన్ రవికుమార్, పీ పేరయ్యతోపాటు ఎన్‌జీవో సంఘం నాయకులు కే శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.


ట్రాక్టర్‌తో వరి విత్తనాలు వెదబెడుతున్న రైతులు

ముమ్మరంగా మెట్ట వరి సాగు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు, ఎస్.అగ్రహారం గ్రామాల పరిధిలోని లోతట్టు పొలాలలో రైతులు ముమ్మరంగా మెట్ట వరి ట్రాక్టర్‌లతో(వెద) సాగు చేస్తున్నారు. కొప్పోలు గ్రామానికి దక్షిణంగా, ఎస్ అగ్రహారం గ్రామానికి ఉత్తరం వైపున లోతట్టు భూములు ఉన్నాయి. ఈ భూములలో వర్షపు నీరు నెల ,రెండు నెలలు నిలిచి ఉంటుంది. దీంతో రైతుల ఈ భూములలో మెట్ట వరి సాగు చేయడం ప్రారంభించారు. మూడు నెలలు,ఆరు నెలలు కాలపరిమితి ఐఆర్ 20, 74రకం, బీపీటీ వంగడాలను రైతులు సాగుచేస్తున్నారు. ఈ రెండు గ్రామాల పరిధిలో సుమారుగా 600 ఎకరాలలో మెట్టవరి సాగు చేస్తున్నారు. వరుణుడిని నమ్ముకొని వరి పంట సాగుకు రైతులు ముందుకు సాగుతున్నారు


ధర్నాలో నినాదాలు చేస్తున్న రజకవృత్తిదారులు

రజక వృత్తిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రజక వృత్తిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టంగుటూరి రాము, రాయల మాలకొండయ్యలు డిమాండ్‌చేశారు రజక వృత్తిదారులసంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు రాము అధ్యక్షత వహించారు. ధర్నాలో వారు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలకు వలసలు వచ్చి అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్లు,ఇంటి పనివారిగా, ఇస్త్రీదారులుగా, భవన నిర్మాణ కార్మికులుగా పనిచేసుకుంటూ చాలీచాలనీ ఇరుకు గదుల్లో ఉంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు పింఛన్‌మంజూరు చేయాలని, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ తరహాలో రజకులకు సామాజిక రక్షణచట్టం కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి సమస్యలతోకూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం నాయకులు మందరమణమ్మ, డాక్టర్ వెంకట కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, యోగమ్మ, సీహెచ్ కొండయ్య, మంచికలపాటి శ్రీనివాసులు, గుర్రపుశాల శ్రీనివాసులు, అన్నవరపు నాగేశ్వరరావు ఉన్నారు.

దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు మోదీ కుట్ర

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు మోదీ, బీజేపీలు కుట్రపన్నాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్ ఆరోపించారు. సోమవారం ఒంగోలులోని మీడియా కెమెరా మెన్ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాల సామాజికవర్గంపై పగబట్టి తొక్కేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో చప్పిడి రవిశంకర్, బొలిమి వినోద్‌కుమార్ షేక్ జిలానీ, టి.సుబ్బారావు, నెల్లి సూరిబాబు పలువురు పాల్గొన్నారు

కష్టపడి పనిచేస్తేనే పదవులు

సోషల్ మీడియాలో కుల రాజకీయాల ప్రచారం తగదు

ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్

అట్టహాసంగా ఒడా చైర్మన్‌గా రియాజ్ ప్రమాణ స్వీకారం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అందరిని కలుపుకొని పోతూ కష్టపడి పనిచేయడం ద్వారానే పదవులువస్తాయని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయడం వల్లనే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుర్తించి రియాజ్‌కు ఒడా చైర్మన్ పదవి సిఫార్సు చేశారన్నారు. స్థానిక ఏ1 కన్వెన్షన్ హాలులో సోమవారం ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్‌అథారిటీ చైర్మన్‌గా రియాజ్ ప్రమాణస్వీకారోత్సవ సభలో దామచర్ల ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒడా చైర్మన్‌పై కుల రాజకీయాలు చేస్తూ సోషల్ మీడియాలో నాయుళ్లకు అన్యాయం చేసినట్లు పోస్టింగ్‌లు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సమావేశంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్, ఒడా చైర్మన్ పదవిని ఒంగోలుకు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అందరి సమక్షంలో రియాజ్‌కు ఒడా చైర్మన్ పదవి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని, తదనుగుణంగా ఆయన పదవికి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మెగా కుటుంబానికి నమ్మినబంటుగా ఉంటూ పదవులు ఉన్నాలేక పోయినా వారి వెంటే నడిచిన వ్యక్తి రియాజ్‌అని అన్నారు. ఒడా పరిధిలోని జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉన్నాయని, ఆ నియోజకవర్గాలన్నింటిని సమానంగా చూడాల్సిన బాధ్యత రియాజ్‌పై ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలు, భూకబ్జాలు, దౌర్జన్యాలపై పోరాడుతుంటే అనేక బెదిరింపులు కూడా వచ్చాయన్నారు. ఇప్పుడు అటువంటి వారు కూడా జనసేనలో ఉన్నారన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రియాజ్‌తో తమకుటుంబానికి ఉన్నఅనుబంధాన్ని వివరించారు. ఒడా చైర్మన్‌గా నిమితులైన రియాజ్‌కు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తానని, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఒడాకు నిధులు తెచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ రియాజ్‌కు ఒడా చైర్మన్ పదవికి వన్నె తెచ్చేవిధంగా పనిచేయాలన్నారు. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు .జనసేన పార్టీకి చెందిన శాసనసభ్యులు పీనానాజీ, వై. విజయకుమార్, బి. నారాయణలు మాట్లాడుతూ జనసేన పార్టీలో రియాజ్‌తో ఉన్న అనుబంధాన్ని వివ రిస్తూ సమర్థవంతమైన రియాజ్‌కు ఒడా చైర్మన్ రావడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి, వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు దామచర్ల సత్య, బొడపాటి తేజస్వణి, లంకా దినకర్, విజయకుమార్, హరిప్రసాద్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు మేయర్ గంగాడసుజాత, జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్, వరికూటి నాగరాజు, కిరణ్‌రాయల్, కందుకూరి బాబు, బెల్లంకొండ సాయిబాబు, ఇమ్మడి కాశీనాథ్, శివపార్వతి, సుభాషిణీ, నాగరత్నం, సీహెచ్ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఆలా నారాయణ, కొట్టే శ్రీనివాస్‌తో పాటు పలు జిల్లాల నుంచి జన సేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన రియాజ్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు కలిసి బొకే బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు.


రియాజ్‌ను అభినందిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ , జనసేన నేత కంది రవిశంకర్


ఒడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రియాజ్

ఒడా చైర్మన్‌కు సత్కారం

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ(ఒడా) చైర్మన్‌గా ప్రమాణస్వీకారంచేసిన షేక్ రియాజ్‌ను భారతీయ జనతా పార్టీ నాయకులు సత్కరించారు. ఒంగోలులోని1 కన్వెన్షన్ హాలులో సోమవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభలో బీజేపీ నాయకులు కలిసి అభినందించారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బీజేపీ నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, అమరసింహం, శ్రీనివాసరావుతో పాటు పలువురు ఆ పార్టీ నాయకులు ఉన్నారు..


నివాళులర్పిస్తున్న రచయిత్రులు

మానవత్వం మూర్తీభవించిన రచయిత్రి కృపావరం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తన రచనలతోనే కాకుండా వ్యక్తిత్వంలోను మానవత్వం మూర్తీభవించిన గొప్ప రచయిత్రి కత్తి కృపావరం అని పలువురు నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన కత్తి కృపావరం సంతాప సభ సోమవారం సాయంత్రం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ కోటేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కృపావరం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ మానవతా దృక్పథం కలిగిన సంస్కారవంతురాలైన గొప్ప కవయిత్రి కృపావరం అన్నారు. కృపావరం మరణం జిల్లా సాహిత్యరంగానికి తీరనిలోటని తేళ్ల అరుణ పేర్కొన్నారు. నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి మాట్లాడుతూ కృపావరం బహుముఖ ప్రజ్ఞాశాలి అని, రచయిత్రిగా తన ఎదుగుదలలో కృపావరం సహకారం మరిచిపోలేనిదని అన్నారు. తాను నిర్వహించిన ప్రతి సాహిత్య కార్యక్రమంలో కృపావరం తోడ్పాటునందించేదని డాక్టర్ నూనె అంకమ్మ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీరం అరుణ, మారేపల్లి సూర్యకుమారి, వి.ఝాన్సీదుర్గ, కుర్రా ప్రసాద్ బాబు, నాళం నరసమ్మ, యు.వి.రత్నం, మిడసల మల్లిఖార్జున రావు, ధర్నాసి చిరంజీవి, పిన్ని వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, కత్తి కల్యాణ్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతుసంఘం నేత పమిడి వెంకట్రావు

రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

నాగులుప్పలపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):ప్రజలకు అన్నం పెట్టే అన్నదాతలను కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి దూరం చేస్తూ పరిశ్రమల పేరిట కార్పొరేట్ శక్తులకు వ్యవసాయభూములను దోచిపెడుతోందని రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జుజ్జూరి జయంతిబాబు, పమిడి వెంకట్రావు అన్నారు. రైతుసంఘం మండల మూడో సభను నాగులుప్పలపాడులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల పేరుతో ఇప్పటికే వేలాది ఎకరాల వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి ఎక్కడా ఒక్క పరిశ్రమ స్థాపించిన దాఖలాలు లేవని విమర్శించారు.ఆయా భూములను బ్యాంక్‌లకు తనఖాపెట్టి రుణాలను తీసుకొని వ్యాపారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల వద్ద నున్న బర్లీ పొగాకును మొత్తం కొనుగోలు చేసి రైతులు అప్పులపాలు కాకుండా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులుగా తూబాటి శ్రీకాంత్,రావెళ్ల వెంకట్రావు, మరో 11 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

రూ.51 లక్షలతో అభివృద్ధి పనులు

● ఐదు గ్రామాల్లో 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

● వోల్టేజీ హెచ్చుతగ్గుల నివారణ

కొండపి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు గ్రామాల్లో లోవోల్టేజీ నివారించి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు పనులు జరుగుతున్నాయని విద్యుత్‌శాఖ మండల ఏఈ పువ్వాడ శ్రీనివాసులు తెలిపారు. రూ.51 లక్షలతో చోడవరం గ్రామంలో జరగుతున్న విద్యుత్ అభివృద్ధి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ లోవోల్టేజీ నివారించేందుకు చోడవరంలో రెండు, చినవెంకన్నపాలెంలో ఒకటి, ముప్పవరం, పెరిదేపి గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూగచింతలలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. మండలంలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నచోట త్వరలో మారుస్తామని తెలిపారు.

కొండపి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పెట్లూరు, జాళ్లపాలెం, నెన్నూరుపాడు గ్రామాలకు వెళ్లే 11 కేవీ మెయిన్ లైన్లు ఇప్పటి వరకు కొండపిలోని గురుకుల పాఠశాల లోపల నుంచి వెళ్తున్నాయని, మంత్రి స్వామి లైన్లు గురుకుల పాఠశాల వెలుపలకు తరలించాలని ఆదేశించి, అనుమతులు తెప్పించారని వివరించారు. రెండు రోజుల క్రితం విద్యుత్ లైన్లను గురుకుల పాఠశాల వెలుపలకు తరలించామని, విద్యార్థులకు ఇబ్బందులు తొలిగాయని ఏఈ వివరించారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది

వినాయక చవితి వ్యయం తడిసి మోపెడు..!

సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చందాల భారం

అద్దంకి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు సందడి ఏటికేడు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఖర్చు కూడా భారీగా పెరుగుతోంది. ప్రధానంగా విగ్రహం కొనుగోలు ఒక ఎత్తైతే అనంతరం నిత్య పూజలు, ప్రసాదాలు, నిమజ్జనోత్సవం ఖర్చులకు లెక్కలేకుండా పోయింది. విగ్రహ ఏర్పాటు కమిటీలు పోటీలు పడి ఆర్భాటాలకు పోయి లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. అతి తక్కువ ఖర్చుతో ముగించామనుకున్నా, రూ.లక్షకు తక్కువ కావడం లేదు.

వినాయక విగ్రహం ఏర్పాటు జరిగితే ఆ ప్రాంతంలో ఉన్న కుటుంబాలు అందరూ చందాలు ఇవ్వాల్సి ఉంది. విగ్రహాల నిర్వహణ కమిటీల సభ్యులు ముందుగానే చందాలకు తిరుగుతుండడంతో ఆయా సందర్భాలలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. మిగిలిన వారి కంటే తక్కువ చందా ఇవ్వడం బాగుండదనే ఉద్దేశ్యంతో గొప్పలకు పోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో కనీసం వెయ్యి నుండి రూ.5 వేల వరకు చందాలు ఇవ్వక తప్పడం లేదన్న భావన వ్యక్తం అవుతోంది. అందరు కలిసి చేసుకునే సంబరం కావడంతో తక్కువ మొత్తం లో ఇవ్వలేక, మిగిలిన వారితో పాటు ఎక్కువ మొత్తంలో చందా ఇవ్వలేక ఇబ్బంది పడుతున్నారు. ఇక కొన్ని చోట్ల ఒక్కొక్కరు ఒక్కో రోజు ప్రసాదాలు తయారీ చేయాల్సి రావడం మరింత భారంగా మారుతోంది. పూజల సమయంలో విగ్రహం వద్ద కు వచ్చే వందల మంది భక్తులకు ప్రసాదాలు ఏర్పాటు చేయాల్సి రావడం కూడా భారంగా మారుతోంది. ఇలా ఖర్చులు పెరుగుతుండటంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు వినాయకచవితి పండుగను సంతోషంగా కాకుండా ఖర్చును గురించి ఆలోచించి జరుపుకోవాల్సి వస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. విగ్రహాల ఏర్పాటు నిర్వహకులు పండుగను పండుగలా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించి, వృధా ఖర్చులు తగ్గిస్తే పేద, మధ్య తరగతిపై భారం తగ్గుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


మండపాలకు విగ్రహాలను తీసుకెళుతున్న ప్రజలు


ఫిర్యాదుదారుల సమస్యను వింటున్న ఎస్పీ దామెదర్

మోసాల బారినుంచి కాపాడండి

● మీకోసంలో ఎస్పీకి వినతులు

ఒంగోలుక్రైం,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మోసాల బారి నుంచి కాపాడండి అంటూ పలువురు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదులు చేశారు. జిల్లాలో నలుమూలల నుంచి 80 మంది తమ సమస్యలు పరిష్కరించమని ఫిర్యాదులు చేశారు. ఎస్పీ వెంటనే సంబంధిత పోలీసు అధికార్లతో మాట్లాడి సత్వరమే చట్ట పరిధిలో ఫిర్యాదులను పరిష్కరిచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్ , సీఐలు దుర్గా ప్రసాద్, జగదీష్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులలో కొన్ని..

● చిలకలూరిపేటకు చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.5 లక్షలు తీసుకొని కొనకనమిట్లలో ఒక ప్రయివేటు ఏజెన్సీలో సెక్యూరిటీ గార్డుగా జాయిన్ చేశాడని ఓ బాధితుడు ఫిర్యాదు చేశారు. 16 నెలలు తరువాత తనను ప్రయివేటు ఉద్యోగం నుంచి కూడా తొలగించారని, తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

● ఒంగోలు నాగేంద్ర నగర్ 1 లైన్‌లో నివాసం ఉండే వ్యక్తి తన ఇంటిని మరొకరికి అద్దెకు ఇచ్చాడు. అయితే ప్రస్తుతం ఇంట్లో అద్దెకు ఉంటున్న వ్యక్తి అద్దె చెల్లించకుండా ఇల్లు ఖాళీ చేయకుండా తనను బెదిరిస్తున్నాడని ఇంటి యజమాని ఫిర్యాదు చేశాడు.

● ఇంటి అవసరాల కోసం ఒంగోలు రాంనగర్‌కు చెందిన ఇద్దరు మహిళల వద్ద బంగారం తాకట్టు పెట్టానని, ప్రస్తుతం డబ్బు చెల్లిస్తాను అంటే వారు నా బంగారం అమ్మేసుకున్నామని చెబుతున్నారని ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా అ రెండు కుటుంబాల వారు తన కుటుంబంపై దౌర్జన్యానికి దిగారని పేర్కొన్నారు.

ఇదేం పంచాయితీ!

(5వ పేజీ తరువాయి)

ఆదేశించింది.

ప్రభుత్వం చెప్పింది కేవలం 5 శాతమే..

స్వర్ణ పంచాయతీ కార్యక్రమం ప్రవేశ పెట్టే సందర్భంగా పంచాయతీ కార్య దర్శులకు ప్రభుత్వం శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తే బాగుండేదన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. కేవలం పుస్తకాలు ఇచ్చి వాటి ప్రకారం చేయాలని చెప్పడంతో.. కొందరు వాటిని వేరే రకం గా అర్థం చేసుకున్నారు. గతంలో ఉన్న జీవో ప్రకారం ఏటా పంచాయతీలు 5 శాతం పన్ను పెంచుకునే అవకాశం ఉంది. ఆస్తి విలువను బట్టి వంద రూపాయలకు 12 పైసల నుంచి రూపాయి వరకు పన్ను విధించాలి. ఆస్తి విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటే రూ. 220 నుంచి రూ.250 వరకు ఇంటి పన్ను విధించాలి. దానికి అదనంగా లైబ్రరీ సెస్సు 8, ఫైర్ సెస్సు ఒక శాతం, క్రీడల సెస్సు 3, డ్రెయినేజీ సెస్సు, వీధి లైట్ల సెస్సు, నీటి సరఫరా సెస్సు విధించవచ్చు. అంతా కలిపినా రూ. 300 నుంచి రూ.350 వరకు ఇంటి పన్ను వస్తుంది. ప్రస్తుతం పన్ను పెంపునకు గతేడాది డిమాండ్‌ను పరిగణలోకి తీసుకున్నారు. దాని మీద 5 శాతం పెంచుతున్నారు. స్వర్ణ పంచాయతీ పేరుతో కొందరు పంచాయతీ కార్యదర్శులు అందుకు భిన్నంగా పన్ను పెంచడంతో వందల్లో ఉన్న పన్ను రూ.వేలల్లోకి వెళ్లింది.

పెరుగుదలకు బ్రేకులు..

అసంబద్ధంగా ఇంటి పన్ను పెరిగిన చోట అసెస్మెంట్‌ల ఆన్‌లైన్ ప్రక్రియకు జిల్లా అధికారులు బ్రేకులు వేశారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు జీవోను అతిక్రమించి పన్ను పెంచేశారని ఆరోపణలున్నాయి. 10 శాతం కూడా పెంచేశారని పలువురు అధికారులు చెబుతున్నారు. అటువంటి చోట తిరిగి సమీక్ష నిర్వహించిన తర్వాత ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని చెబుతున్నారు. ఆ ప్రక్రియ పూర్తయితేనే పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను వసూలు చేసే అవకాశం లేదని కొందరు చెబుతున్నారు.

ఎరువుల దుకాణాలలో తనిఖీలు

సంతనూతలపాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలమేరకు సోమవారం తహసీల్దార్ నారాయణరెడ్డి, వ్యవసాయాధికారి పావనిలతో కూడిన బృందం మండలంలో ఎరువుల దుకాణాలను తనిఖీచేశారు. సంతనూతలపాడులోని చంద్రఫెర్టిలైజర్స్, మనగ్రోమోర్ దుకాణాలను పరిశీలించారు. నిల్వలకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండాలని, దుకాణం బయట ధరల పట్టిక ఉండాలన్నారు.

పేస్‌లో ముగిసిన వర్క్‌షాపు

ఒంగోలు విద్య, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో సెమికండక్టర్ డిజైన్ ఎనర్జింగ్ రీసెర్చ్ ఏరియాపై మూడు రోజుల పాటు జరిగిన వర్క్‌షాపు సోమవారం ముగిసింది. కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాపును నిర్వహించారు. కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, డీన్‌లు ఆర్.వీరాంజనేయులు, సీవీ సుబ్బారావు, రూపా అక్కేష్, ఎం.అప్పారావు తదితరులు ఉన్నారు.

రాజరాజేశ్వరి దేవస్థాన దుకాణాల వేలం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):స్థానిక తూర్పుపాలెం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అధీనంలో ఉన్న ట్రంకురోడ్డులోని షాపులను లీజుకు ఇవ్వటానికి ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి బోడపాటి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రంకురోడ్డులోని 37-1-264, టీఎస్ నెం411లో ఉన్న రెండు షాపులను సెప్టెంబరు 1 నుంచి 2026వ సంవత్సరం ఆగస్టు 31 వరకు లీజుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పాటలో పాల్గొనదలచిన వారు రూ.20 వేలు దరావత్తు చెల్లించాలని ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని శ్రీనివాస రావు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

నాగులుప్పలపాడు, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి గాయపడిన సంఘటన ఉప్పుగుండూరులో చోటుచేసుకొంది. వివరాల మేరకు ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన చికెన్‌కొట్టు నిర్వాహకుడు జెండాబాబు సోమవారం తెల్లవారుజామున ఇంటి వద్దనుంచి నాగులుప్పలపాడు రోడ్డులో వాకింగ్ చేసుకొంటూ వెళుతున్న క్రమంలో వసుంధర కోల్డ్‌స్టోరేజ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలై రోడ్డు పక్కన పడిఉండగా ఒంగోలు విధులకు వెళుతున్న ఈదుమూడి గ్రా మానికి చెందిన కానిస్టేబుల్ కొమ్మూరి మహేష్ గాయపడిన జెండాబాబుకు సపర్యలు చేసి 108కి సమాచారం అందించారు. దాంతో చికిత్స నిమిత్తం క్షతగ్రాతుడిని ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

అవీ..ఇవీ..

సేవా కార్యక్రమాలతో మానసిక సంతృప్తి

చీరాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : యువత విద్యార్థి దశ నుంచే సామాజికసేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా సంతోషంగా ఉంటారని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, పోలీసు, సామాజిక విభాగం(రెఫ్) సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 కళాశాల విద్యార్థులు హాజరై రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్, ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జ్ నాగిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జ్యోతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, మత్తు పదార్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విజయశాంతి

చినగంజాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఏపీ సాక్స్ జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్.ఎం ఆర్.హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తుపదార్థలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరెడ్డి, లింకు వర్కర్ గున్నమనేని విజయశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరిని అక్షరాస్యులుగా మార్చాలి

మేదరమెట్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపుల్లోని మహిళల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని, ఏపీవో గాయత్రిదేవి సూచించారు. సోమవారం కొరిశపాడు మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీవో గాయత్రి దేవి ఆధ్వర్యంలో ఉల్లాస్, 'అక్షరాంధ్ర-అక్షరాస్యత' కార్యక్రమంపై మహిళా వీవోఏలు, ఏఫ్ఏలు, సీసీలు, వాలంటీర్లుకు మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్యా కార్యక్రమ సమన్వయకర్త టి. శ్రీనివాసరావు పాల్గొని సిబ్బందికి అ వగాహన కల్పించారు. పది మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీరును ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అంతట ఆగస్టు నెల నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నేర్చుకున్న అంశాలపై మార్చి నెల ఆఖరున ఎఫ్ఎల్ఎన్ఏటీ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో వెలుగు సీసీలు సాంబయ్య, శేషగిరిరావు, శ్రీనివాసరావు, అకౌంటెంట్ సునీత, పీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

మార్టూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానికంగా మద్ది సీతాదేవిన గర్‌లో నివాసం ఉంటున్న మేడా కనకమహాలక్ష్మి అనే మహిళ తనపై ఇద్దరు మహిళలు సోమవారం ఇంటి వద్ద దాడిచేసి గాయపరచారని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఫిర్యాది మహాలక్ష్మి భర్త వెంకటేశ్వర్లుకు ఆదిలక్ష్మి అనే మహిళ గత ఏడాది క్రితం రూ.70 వేలను అప్పుగా ఇచ్చారు. ఈ నేపథ్యంలో వెంకమ్మ అనే మహిళతో కలిసి ఆదిలక్ష్మి తన డబ్బులను ఇవ్వాలని మహాలక్ష్మితో మాట్లాతుండగా వారి మధ్య వివాదం జరిగింది. ఈ వివాదంలో. మహాలక్ష్మిని వెంకమ్మ రాయితో కొట్టిందని, గాయపడిన మహాలక్ష్మి స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా రక్తదానం



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని బ్రహ్మకుమారి, ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో సోమవారం విశ్వ బంధుత్వ దినోత్సవంలో భాగంగా రక్తదానం శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్, రేపల్లే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసంతం వీ రరాఘవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి సెంటర్ ఇన్‌చార్జ్ బీకే రామలక్ష్మి, చుండూరి మురళి, కొత్తమాసు సుబ్బారావు, వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు, నాగరాజ కుమారి, వేదవతి, అనుమాయమ్మ, అంజలి, ఆదిలక్ష్మి, సత్యవతి, శ్రీ హర్షిణి కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ టవర్‌ను ఢీకొన్న కారు

- భార్యాభర్తలకు స్వల్పగాయాలు
- బెలూన్లు తెరుచుకోవడంతో తప్పిన ప్రాణాపాయం



టవర్‌ను ఢీ కొని దెబ్బతిన్న కారు ముందు భాగం

అద్దంకి, ఆగస్టు25 (ఆంధ్ర జ్యోతి): ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు అంచులోని విద్యుత్ టవర్‌ను కారు ఢీ కొట్టింది. దీంతో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతినగా, భార్యభర్తలకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు కావలి నుండి హైదరాబాద్‌కు తన్నీరు నాగేశ్వరావు, పాపమ్మలు కారు లో వెళ్తున్నారు. సోమవారం మధ్యాహ్నం అద్దంకి పట్టణంలోని రాజీవ్‌కాలనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో కారు రోడ్డు అంచులోని విద్యుత్ టవర్ ను ఢీ కొట్టింది. ఆ సమయంలో కారు లోని ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నాయి. దీంతో భార్యభర్తలు నాగేశ్వరరావు, పాపమ్మలు స్వల్పగాయలతో బయటపడ్డారు. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఫిజియోథెరపీలో జాగ్రత్తలు పాటించాలి



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న జోత్స్న

వేటపాలెం (చీరాల), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : భవిత కేంద్రాల్లోని చిన్నారుల పట్ల నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ కర్త జ్యోత్స్న అన్నారు. సోమవారం వేటపాలెం మండలం నాయినిపల్లిలోని ప్రాథమిక పాఠశాల, ఈపూరుపాలెం భావనారుషిపేటలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ తీరును ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపధ్యాయురాలు శోభాదేవీ, ఫిజియోథెరపిస్టు ధనలక్ష్మీ, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎఫ్ఎస్టీపీ ప్లాంట్ ప్రారంభంపై కదలిక

- పర్యావరణ పరిరక్షణ - భూగర్భ జలాల సంరక్షణే ధ్యేయంగా నిర్వహణ
- అక్టోబరు 2 నుంచి అమలుకు ప్రణాళికలు



రామాపురంలోని ఎఫ్ఎస్టీపీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డీఈ

చీరాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంరక్షణే ధ్యేయంగా రామాపురంలో ఏడాది క్రితం నిర్మించిన ఎఫ్ఎస్టీపీ (వ్యర్థాలు సేకరణ) ప్లాంట్‌పై అధికారుల్లో కదలిక వచ్చింది. సాధారణంగా ఇప్పటి వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొందరు సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులు లోడ్ చేసిన మలినాలను జాతీయ రహదారి వెంబడి, దండుబాట రోడ్డు, కారంచేడు రోడ్డుల్లోని నిర్మానుష్యమైన ప్రదేశాల్లో వదులుతున్నారు. అయితే ఈక్రమంలోని వ్యర్థాల కారణంగా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీటి వలన పలు వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదు. ఈ వ్యర్థాల వలన పర్యావరణం దెబ్బతినడంతో పాటు, భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి.

ప్లాంట్ నిర్మాణంతో ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వం, పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణే ధ్యేయంగా ఎఫ్ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అందుకు సంబంధించి రూ.2కోట్లు నిధులు కూడా మంజూరు చేసింది. దీంతో రామాపురంలో మున్సిపల్ అధికారులు ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ పరిధిలో ట్యాంకర్ల ద్వారా లోడు చేసిన మలినాలను ప్రజాసంచార ప్రాంతాల్లో ఇబ్బందులు కలుగకుండా ప్లాంట్‌లో నిర్మించిన 2500 కిలోలీటర్లు సామర్థ్యం ఉన్న ట్యాంకర్‌లలోకి చేర్చనున్నారు. అలాగే మున్సిపల్ పరిధిలోని ట్యాంకర్ల నిర్వహణ దారులకు కచ్చితమైన రిజిస్ట్రేషన్‌లతో నిర్వహణ సాగించేలా ప్రణాళిక చేపట్టారు. వీటి ద్వారా ఏదయినా ఇంటి యజమానికి ట్యాంకర్ అవసరమైనప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా మాత్రమే వాహన సౌకర్యం కల్పించనున్నారు. అయితే ఈ విధమైన ప్రక్రియకు గతంలోనే పూనుకున్నా కాలక్రమేణ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. అయితే ప్రభుత్వం అక్టోబరు 2 స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాంట్ల నిర్వహణ అమల్లోకి తీసుకు రానుండడంతో అధికారులు తిరిగి వాటిపై దృష్టి సారించారు.

స్వచ్ఛ చీరాలే లక్ష్యంగా ప్లాంట్ నిర్వహణ

చీరాల పురపాలక సంఘాన్ని స్వచ్ఛ చీరాలగా మార్చేందుకు అన్నివిధాలుగా కృషిచేస్తున్నాము. ఈ నేపథ్యంలో నిర్మించిన ప్లాంటును అక్టోబరు 2 నుండి అమల్లోకి తీసుకురానున్నా ము. అందుకు సంబంధించి ట్రయిల్‌రన్ కూడా చేశాము. ట్యాంకర్ల నిర్వహణ దారుల తో వెంటనే సమావేశం నిర్వహించి, టోల్ ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచనున్నాము. రవాణా పారదర్శకంగా ఉండేలా వాహన ట్రాకర్ ఏర్పాటు కూడా ఏర్పాటు చేస్తున్నాం. **- రఘురామ్, మున్సిపల్ డీఈ**

వరిసాగుకు రైతులు సన్నద్ధం

- ముందుగానే నీరు విడుదల కావడంపై రైతుల్లో జోష్
- ఊపందుకున్న నారుమడుల పెంపకం
- పదిరోజుల్లో ప్రారంభంకానున్న నాట్లు



పొలాల్లో సాగులో ఉన్న వరి నారుమడులు

బల్లికురవ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సాగర్ నుంచి ముందుగా నీటిని విడుదల చేయడంతో రైతులు మాగాణి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాలలో రైతులు వరి నారు మడులు సాగుచేశారు. ప్రస్తుతం 20 రోజుల నారు ఉండగా, మరో పదిరోజుల్లో నాట్లు ముమ్మరం కానన్నాయి. బల్లికురవ మండలంలోని గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, వైదన, ముక్తేశ్వరం, సూరేపల్లి, ఎస్ఎల్. గుడిపాడు, కొప్పెర పాడు, కొత్తూరు, వెలమవారి పాలెం, గొర్రెపాడు, కూకట్ల పల్లి, కొప్పెరపాలెం, నక్క బొక్కలపాడు, చెన్నుపల్లి గ్రామాలలో సుమారు 6 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయనున్నారు. ఎరువులు కూడా కొనుగోలు చేసి కొందరు ఇళ్లల్లో నిల్వలు పెట్టారు. గతం కంటే ఈ ఏడాది ముందుగా మాగాణి సాగవుతుందని రైతులు పేర్కొంటున్నారు. కొందరు కౌలురైతులు ఇప్పటికే పంటసాగుకు ముందస్తు కౌలు కూడా చెల్లిస్తున్నారు. డ్యాంలలో ఫుల్‌గా నీరు ఉండటంతో రైతులు రెండు పంటలు పండించేలా సాగుకు సిద్ధం అవుతున్నారు. వరి సాగు ముగిసిన తర్వాత మొక్కజొన్న వేసేందుకు పలువురు రైతులు సిద్ధం అవుతున్నారు. మొత్తం మీద మరో పది రోజుల్లో గ్రామాలలో రోజు వారీ కూలీలకు పనులు జోరు అందుకోనున్నాయి.



ఏబీసీలో ప్రవహిస్తున్న సాగర్ జలాలు

భవిష్యత్తుకు మార్గదర్శకంగా శిక్షణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహనరావు

అద్దంకిటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కేలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ)లోని శిక్షణ తరగతులు విద్యార్థుల భవిషత్తుకు మార్గదర్శకం చేస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. సోమవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ సెంటర్‌లో నూతన బ్యాచ్‌కు తరగతులను ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా శిక్షణ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్.ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ ఎన్.షర్మిలరాణి, ప్లేస్‌మెంట్ ఆధికారి ఏ.శిఖామణి, జేకేసీ మెంటర్ వినుకొండ రమేష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

అద్దంకిటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక విగ్రహాలను పూజిస్తే ఎటువంటి కాలుష్యం ఉండదని, వాటిని నీటిలో కలపడం ద్వారా నీరు కూడా కలుషితం కాదని బొమ్మనంపాటు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి అన్నారు. సోమవారం పాఠశాలలో తాటిబోయిన వెంకటేశ్వర్లు కుమారుడు వెంకట సుబ్బారావు (వెంకటేశ్వర సీడ్స్) వినాయక చవితి పండుగ సందర్భంగా వందకు పైగా మట్టి వినాయక విగ్రహాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

23 మండపాలకు అనుమతి

ఇంకొల్లు,ఆగస్టు 25,(ఆంధ్రజ్యోతి) : మండలంలో వివిధ గ్రామాలలో వినాయకచవితి సందర్భంగా విగ్రహాలు మండపాలను ఏర్పాటు చేసుకునేందుకు సోమవారం వరకు 23 కమిటీలకు అనుమతులు ఇచ్చినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఇప్పటి వరకు 30 మండపాలకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సంతమాగులూరు ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పుట్టావారిపాలెం (అడ్డరోడ్డు) -సంతమాగులూరు గ్రామాల మధ్య ఉన్న నక్కల వాగు సమీపంలోని గుంటూరు-కర్నూలు రహదారిపై సోమవారం సాయంత్రం కారు-ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. అందిన వివరాలు ప్రకారం మండలంలోని సజ్జాపురం ఎస్సీ కాలనీకి చెందిన ఏడుగురు వ్యక్తులు పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి ఒక పరిష్కార పంచాయితీకి ఆటోలో వెళ్లారు. అనంతరం అక్కడనుండి తిరిగి ఆటోలో సజ్జాపురం వస్తుండగా మార్గ మధ్యలో అడ్డరోడ్డు దాటిన తర్వాత నక్కలవాగు వంతెన వద్ద వినుకొండ వైపు నుంచి నరసరావుపేట వెళుతున్న కారు అతివేగంగా ఆటోను ఢీకొంది. దీంతో ఆటో తిరగబడింది. దీంతో ఎస్సీ కాలనీకి చెందిన నంబూరి దావీదు (62) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే కాలనికి చెందిన వారు దాసరి రోశయ్య, అనంతపురం కోటేసు, దాసరి బాబు, పత్తిపాటి పిచ్చిబాబు, పత్తిపాటి లాజర్‌కు గాయాలయ్యాయి. మృతుడు నంబూరు దావీదుకు ముగ్గురు పిల్లలున్నారు. భార్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ పట్టాభిరామయ్య పరిశీలించారు. క్షతగాత్రులను, మృతదేహాన్ని నరసరావు పేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును నరసరావుపేట వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారు అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలుపుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఊపందుకున్న వినాయక విగ్రహాల అమ్మకాలు



మండపాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

ఇంకొల్లు, ఆగస్టు 25, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో వినాయక విగ్రహాల అమ్మకాలు ఊపందుకున్నాయి. సోమవారం ఉదయం నుంచే విగ్రహాలను పెద్దఎత్తున గ్రామాలకు తరలించారు. ముందుగా వినాయక విగ్రహాలను రిజర్వు చేసుకోగా సోమవారం విగ్రహాలను తరలించడం ప్రారంభించారు. పర్చూరు రోడ్డులో విగ్రహాల తయారీ కుటీరం నుంచి భక్తులు విగ్రహాలను కొనుగోలు చేయడం ప్రారంభించారు. రూ.200లతో ఇంటిలో పెట్టుకొనే విగ్రహాల నుంచి ఎత్తును బట్టి రూ.25000 వరకు తయారీదారులు వినాయక విగ్రహాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

పర్చూరు, ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి) : పర్చూరులో వేంచేసిన శ్రీ అభయాంజనేయ స్వామివారి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు సమకూర్చిన మకరతోరణంతో స్వామి వారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బృంధావనం సత్యనారయణ మాట్లాడుతూ స్వామి వారిని మరక తోరణంతో అలంకరిస్తే గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు ప్రసద వినియోగం చేశారు. కార్యక్రమంలో కోటా శ్రీనివాసరావు, సింహదాటి శ్రీనివాసరావు, సోమరౌతు నాగరాజు, అనిల్‌ప్రసాద్, తులసి శివయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యతోపాటు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి

- ఎంఈవో వెంకట్రామయ్య

పర్చూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు సమాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో పి.వెంకట్రామయ్య అన్నారు. సోమవారం మండల స్థాయిలో నిర్వహించిన పోటీపరీక్షల్లో ప్రతిభను చూపిన విద్యార్థులకు స్థానిక ఎంఇవో కార్యాలయం వద్ద బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోదుగుల నాగిరెడ్డి, బాపనపల్లి హనుమంతురావు, కోటేశ్వరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీల పురోగతిపై శిక్షణ

పంగులూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీల పురోగతి సూచిక వర్షన్ 2.0పై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.సుమంత్ తెలిపారు. మండలంలోని గ్రామపంచాయితీల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్, వెల్‌ఫేర్ అసిస్టెంట్లు ఈ శిక్షణకు హాజరు కావాల్సిందిగా కోరారు.

నూతన కమిటీ చైర్మన్లు బాధ్యతల స్వీకరణ



అద్దంకిలో బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కమిటీ

అద్దంకి, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): నాగులపాడు సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం అద్దంకి పట్టణంలోని నంబూరి పాలెంలోని కార్యాలయంలో నిర్వహించారు. చైర్మన్‌గా బొమ్మనంపాడుకు చెందిన యేనుగంటి వెంకటరామయ్య(బాబు), డైరెక్టర్లుగా రామాయపాలేనికి చెందిన మాజీ సర్పంచ్ వేములపాటి సుబ్బరావమ్మ, అద్దంకి పట్టణం దామావారిపాలెం చెందిన సోమేపల్లి వెంకట్రావులు ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ వెంకటరామయ్య మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధి కి కృషి చేయటంతో పాటు రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా రుణాలు ఇస్తు న్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణ, మండల టీడీపీ నేతలు పలువురు హాజరై నూతన కమిటీని అభినందించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నాగార్జున

మార్టూరు : గ్రామాలలో వ్యవసాయం చేసే రైతులకు సొసైటీలు వెన్నెముక లాంటివని రైతుల అభివృద్ధి కి, సంక్షేమానికి కృషి చేయాలని ఏవో లావణ్య అన్నారు. సోమవారం మండలంలోని కోలలపూడి గ్రామంలో సొసైటీ భవనంలో అధ్యక్షుడిగా తాటి నాగార్జున ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో త్రిమెన్ కమిటి సభ్యులుగా యడవల్లి ఆదినారాయణ, మెట్టెల నాగేశ్వరరావులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కందిమళ్ల కొండలరావు, వసంతరావు, చినవెంగమాంబ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో కడవకుదురు యువతి సత్తా



చిలకా బెన్ సృజన

చినగంజాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2025 ఫలితాలల్లో కడవకుదురు గ్రామానికి చెందిన చిలకాబెన్ సృజన మొదటి ప్రయత్నంలోనే సత్తాచాటి ఎస్‌జీటీకి ఎంపికైంది. సృజన ఎస్‌జీటీ విభాగంలో 83.61 మార్కులు సాధించింది. మైనంపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో 2022వ సంవత్సరంలో డీఈడీ 86 శాతం మార్కులతో ఉత్తీర్ణులైంది. అనంతరం ఒక సంవత్సరం పాటు శిక్షణ తీసుకున్నట్లు సృజన తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మొదటి ప్రయత్నంలోనే ఎస్‌జీటీకి ఎంపికైనట్లు తెలిపారు. తల్లి కృప గృహిణి కాగా, తండ్రి కుమార్ చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుని కుమార్తె ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంపై పలువురు పెద్దలు, ఉపాధ్యాయులు బెన్ సృజనకు అభినందనలు తెలిపారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



మార్టూరులో, ఇంకొల్లులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పర్చూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొరత పేరుతో అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్ప వని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య హెచ్చరించారు. కలెక్టర్ వెంకటమురళీ ఆదేశాల మేరకు సోమవారం పర్చూరులోని పలు ఎరువుల దుకాణాల్లో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించారు. అనంతరం స్టాక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎవో భాస్కర్‌రావు, ట్రైనీ ఎస్సై గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

మార్టూరు : మార్టూరులోని ఎరువుల దుకాణాల్లో సోమవారం తహసీల్దార్ టి.ప్రశాంతి, ఏవో లావణ్యలు తనిఖీ చేశారు. లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ దుకాణంలో ఇన్‌వాయిస్ లేవనే కారణంగా, రూ.1,01,250 విలువైన యూరియా అమ్మకాలను నిలిపివేశారు. అనంతరం పద్మ ఫెర్టిలేజర్స్ షాపులో తనిఖీ చేసి సాంకేతిక కారణాలతో ఈపాస్ మిషను పనిచేయకపోవడాన్ని గ్రహించి, మిషను పనిచేసేంతవరకు ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని దుకాణం యజమానికి సూచించారు. అంతకుముందు అమరావతి నూలుమిల్లులో యూరియాను వినియోగిస్తున్నారా..? అనే విషయంపై నూలు మిల్లులో తనిఖీలు చేశారు. అయితే నూలుమిల్లు వారు తాము యూరియాను వినియోగించే అవకాశం లేదని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ఏవో లావణ్య మాట్లాడుతూ అన్ని దుకాణాల్లో ఎరువుల తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎంఆర్‌పీ కన్నా అధిక ధరలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంకొల్లు : ఇంకొల్లులోని శ్రీరామచంద్ర ఏజన్సీస్ ఎరువుల దుకాణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహిచారు. యూరియా 211 బస్తాలు ఈపాస్ మిషన్ ప్రకారం ఉండగా గోదాములో 211 బస్తాలు నిల్వఉందని గుర్తించారు. రికార్డులను పరిశీలించారు. ఎరువులకు అధిక ధరకు విక్రయించరాదని దుకాణ యజమానులకు సూచించారు. ఈ తనిఖీలలో ఏవో మేరమ్మతో పాటు తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎస్ఐ నాగలక్ష్మీ ఉన్నారు. రైతులు ఎవరూ యూరియా కోసం ఆందోళన చెందనవసరం లేదని ముందుగా అధిక ధరలకు కొనుగోలు చేసుకోవద్దని సూచించారు.

సమృద్ధిగా ఎరువులు

అద్దంకిటౌన్ : మండలంలో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నయాని కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా 110 టన్నులు, డీఏపీ 142.5 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 335 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. దీంతో పాటు రైతుసేవా కేంద్రాలల్లో యూరియా 32 టన్నులు, డీఏపీ 74 టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువులను అధిక ధరలకు అమ్మినా, యూరియాతో వేరే ఎరువులను లింక్ చేసి అమ్మినా, చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఎరువుల విక్రయాలపై నిఘా ఉంచినట్లు తెలిపారు.

పొగాకు సాగుపై నిషేధం

యద్దనపూడి, (మార్టూరు)ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలో పొగాకు సాగు నిషేధమని, ఎవరైనా రైతులు పొగాకును సాగుచేస్తే వారి పంటలను దున్నివేయనున్నట్లు తహసీల్దార్ కే.రవికుమార్ సోమవారం ఒ క ప్రకటనలో తెలిపారు. పొగాకు నర్సరీలను కూడా పెంచవద్దన్నారు. రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ,మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేసుకోవచ్చున్నారు. పొగాకు సాగు నియంత్రణకు మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందంలో తహసీల్దారు చైర్మన్‌గా, ఏవో సమన్వయకర్తగా, ఎస్ఐ మెడికల్ ఆఫీసర్లు సభ్యులుగా కొనసాగుతారన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

చినగంజాం : ఎరువులు, క్రిమిసంహారక మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జీవగుంట ప్రభాకరరావు, ఏవో ఆర్.చంద్రశేఖర్‌లు హెచ్చరించారు. మండలంలోని పెదగంజాం గ్రామంలోని శేషాద్రి ఫర్టిలైజర్, గీతికా ఆగ్రోస్ అండ్ సీడ్స్, బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణాలను వారు తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులను విక్రయించాలాన్నారు. రైతులకు ప్రస్తుత అవసరాల నిమిత్తం మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. స్టాక్ పెట్టడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

- యుద్ధ నౌక నేడు జాతికి అంకితం
- విశాఖలో ప్రారంభించనున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఉదయగిరి దుర్గానికి చారిత్రక గుర్తింపు

ఉదయగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహోన్నత గిరులతో శత్రుదుర్భేద్యంగా ఉన్న ఉదయగిరి చారిత్రక దుర్గానికి గౌరవ చిహ్నంగా ఐఎన్ఎస్ ఉదయగిరి పేరుతో వికసిత భారత్‌లో భాగంగా స్వీయ సాంకేతికతతో తయారు చేసిన యుద్ధనౌకను మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. ఉదయగిరి దుర్గం అడవుల్లో సంచరించే వన్యప్రాణి లోగో యుద్ధనౌకపై చిత్రీకరించారు. విశాఖలోని తూర్పు నౌకాదళ ముఖ్య కేంద్రమైన డాక్ యార్డులో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠిల చేతుల మీదుగా ఉదయగిరితోపాటు హిమగిరి యుద్ధనౌకను జలప్రవేశం చేయనున్నారు. ఇండో పసిఫిక్, చైనా ప్రాంత సరిహద్దుల్లో చేపడుతున్న వ్యూహాత్మక రక్షణ ప్రాజెక్టు పనుల్లో భాగంగా సీ-17 పేరిట స్వీయ సాంకేతికత, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలతో కోల్‌కతా, ముంబయిలలో ఈ యుద్ధనౌకలను భారత రక్షణ వ్యవస్థ నిర్మించింది.



ప్రత్యేకతలివీ..

6,670 టన్నుల బరువు, 28 నాటికల్స్ మైళ్ల వేగం, ఆధునిక సెన్సార్ వ్యవస్థ ఈ నౌకల సొంతం. ఈ నౌకల నుంచి సూపర్ సోనిక్, బ్రహ్మోస్ వంటి అస్త్రాలను నింగిలోని లక్ష్యాలకు ప్రయోగించవచ్చు. ఈ నౌకల పొడవు దాదాపు 149 మీటర్లు. భీకరపోరు సాగించే ఆధునిక ప్రత్యేకతలు ఈ యుద్ధనౌకలకు ఉన్నాయి.

యూడీఎఫ్ హర్షం

చారిత్రాత్మక ప్రదేశమైన ఉదయగిరిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత యుద్ధనౌకకు ఉదయగిరి పేరు పెట్టడం హర్షణీయమని ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరం (యూడీఎఫ్) వ్యవస్థాపకులు షేక్ఎండీ ఖాజా, వీఎస్ఆర్ మూర్తిలు ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఎంతో చరిత్ర కలిగిన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు.



డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీలో విజయం సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. సోమవారం నిర్వహించాల్సిన ఈ ప్రక్రియను రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు డీఈవో ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు, హెచ్ఎంలు, డీటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఎస్ఐ కోఆర్డినేటర్లకు ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధించి శిక్షణ ఇచ్చి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. త్వరలో నూతన తేదీలను అభ్యర్థులకు మొబైల్ నెంబరుకు మెసేజ్ రూపంలో తెలియజేస్తామని పేర్కొన్నారు.



భద్రంగా ఉండండి.. బాధ్యతగా మెలగండి!

'చవితి' ఉత్సవ నిర్వాహకులకు అధికారుల సూచనలు

ఆత్మకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో వేడుకగా నిర్వహించేందుకు జిల్లావాసులు సిద్ధమవుతున్నారు. వీధులు, కాలనీలు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు ఇలా అనేక రంగాలకు చెందిన వారు చందాలు వేసుకుని ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే వివిధ ఆకృతులలో మండపాలను తీర్చిదిద్దగా, రంగురంగుల విద్యుద్దీపాలతో కూడళ్లను అలంకరిస్తున్నారు. ముందస్తుగానే గణనాథుల ప్రతిమలను మండపాలకు చేర్చుతున్నారు. ఇంత వేడుకగా జరుపుకుంటున్న ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు. పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. నిర్వాహకులు చేసుకున్న దరఖాస్తులను పూర్తిగా పరిశీలించాకే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ముందుగా మున్సిపల్, పంచాయతీ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు పొందిన పత్రాలతో పాటు అర్జీని అందించాల్సి ఉంటుంది.



పాటించాల్సిన నియమాలు...

- చలువ పందిళ్ల ఏర్పాటుకు, ఊరేగింపులకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి.
- ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అధికారిని మిగత శాఖలు, మండపాల నిర్వహణ కమిటీలతో సమన్వయకర్తగా నియమిస్తారు. నిర్వాహకులకు ఏదైనా సమస్య లేదా సందేహాల నివృత్తికి సమన్వయ అధికారిని లేదా ఆయా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలి.
- మండపాల వద్ద పగలు 55, రాత్రి 45 డెసిబుల్స్ మించకుండా బాక్సు టైప్ స్పీకర్లను వినియోగించాలి. సాయంత్రం 6 నుంచి రాత్రి 10గంటల వరకు లౌడ్ స్పీకర్లను వినియోగించకూడదు.
- ప్రతిమల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం తేదీ, నిమజ్జన మార్గం, వాహనాల వివరాలు తెలియజేయాలి. బాక్సుటైప్ స్పీకర్ల వినియోగం గురించి తెలియజేయాలి.
- భద్రత కోసం రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకుల ప్రతినిధులు కాపలా ఉండాలి.
- అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. పూజా సమయంలో మండపంపై ఎక్కువ మంది జనం లేకుండా చూసుకోవాలి. పందిళ్లకు దూరంగా వాహనాలు ఆపుకోవాలి.
- రోడ్డుపై వినాయక పందిళ్లు వేయకూడదు. ట్రాఫిక్‌కు ఏవిధమైన ఇబ్బందులు కలిగించకూడదు. బ్యానర్లు, ఫ్లెక్సీలు రోడ్లపై పెట్టకూడదు.
- ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం, ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించకూడదు. మతసామరస్యం పాటించాలి.
- మండపాల పరిసరాల్లో అనుమానిత వ్యక్తుల సంచారం, కొత్త వస్తువులు వదిలివేసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలి.
- షార్ట్ సర్క్యూట్‌లకు ఆస్కారం లేకుండా వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలి. నిమజ్జన సమయంలో రంగులు చల్లడం, బాణసంచా కాల్చడం చేయరాదు.
- ఊరేగింపు సమయంలో కర్రలు, ఇతర ఆయుధాలు ధరించి పాల్గొనరాదు. ప్రదర్శన చూపిన సమయం, రూటు తప్పనిసరిగా పాటించాలి.
- ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఇందుకు అర్జీదారుడు లేదా కార్యనిర్వాహకులదే బాధ్యత.

అనుమతులకు సింగల్ విండో విధానం : ఎస్పీ

నెల్లూరు (క్రైం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గణేష్ ఉత్సవ అనుమతులను సులభతరం చేస్తూ ప్రభుత్వం సింగల్ విండో విధానాన్ని అమలు చేస్తోందని ఎస్పీ జి కృష్ణకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు ganeshutsav.net వెబ్‌సైట్‌లో వివరాలను పూర్తి చేసి అనుమతులు పొందవచ్చని తెలిపారు. వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు పొందుపరిచాక ఆ ప్రాంత పోలీసు అధికారి ఇతర శాఖల అధికారులతో కలిసి మండపం ప్రాంగణాన్ని పరిశీలించి సానుకూలంగా ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌వోసీని జారీ చేయనున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్‌ను ల్యామినేషన్ చేసి ఉత్సవ పందిరిలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఉత్సవాలను నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని వీలైనంత వరకు మట్టి గణేష్ ప్రతిమలను ప్రతిష్ఠించాలని కోరారు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, అశ్లీల నృత్యాలు నిర్వహించరాదని, ఎలాంటి బలవంతపు వసూళ్లకు పాల్పడరాదని సూచించారు.



నెల్లూరు : గాంధీబొమ్మ కూడలిలో రాజమహల్ ఆకృతిలో..




ఆత్మకూరు: కొలువుదీరేందుకు తరలుతున్న గణనాథుడు

భూముల ధరలకు రెక్కలు

- హైవేతో పెరిగిన డిమాండ్ • అయినా దొరకని పొలాలు

అనంతసాగరం ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : 565 నెంబర్ జాతీయ రహదారి వినియోగంలోకి రావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. తెలంగాణలోని నకిరేకల్ నుంచి తిరుపతి జిల్లా ఏర్పేడు వరకు 545 కి.మీ పొడవున ఈ హైవే విస్తరించి ఉంది. నెల్లూరు-ముంబాయితో రహదారితో అనుసంధానం చేస్తూ ఏర్పేడు సమీపంలో 71వ జాతీయ రహదారిలో (నాయుడుపేట-పూతలపట్టు) కలుస్తోంది. ఈ రహదారి పుణ్యమా అని పామూరు, కలిగిరి, మర్రిపాడు, అనంతసాగరం, రాపూరు, డక్కిలి, వెంకటగిరి ప్రాంతాల్లోని భూముల ధరలు రెట్టింపు అయ్యాయి. రోడ్డు వినియోగంతో వాణిజ్య రవాణా మెరుగుపడింది. రైతులు పండించిన ఉత్పత్తులు పట్టణాలకు తరలించే వేసులుబాటు కూడా కలిగింది. ఇక హైవే పక్కన భూములు అమ్మకానికి దొరకని పరిస్థితి కనిపిస్తోంది. విస్తరణకు ముందు ఎకరం రూ.5-7 లక్షలు ఉండగా ప్రస్తుతం రూ-10-20 లక్షల వరకూ ధర పలుకుతోంది. డిమాండ్ పెరగడంతో రోడ్డు వెంబడి భూములు కలిగిన రైతులు ఆనందంగా ఉన్నారు. మరోవైపు చెన్నై, తిరుపతి, పెంచలకోన, కడప, రాజంపేట, తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి మెరుగైన రవాణా సౌకర్యం కలగడం, తక్కువ సమయంతో ప్రయాణ ఇబ్బందులు తీరాయి.



రోడ్డు వెంబడి పొలాలు



నేడు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

- జిల్లా అధ్యక్షుడి ఎన్నికకు అభిప్రాయ సేకరణ • హాజరు కానున్న ముగ్గురు మంత్రులు

నెల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జరగనుంది. నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, అనుబంధ సంఘాల ఎంపికపై అభిప్రాయ సేకరణ జరుగుతుంది. ఇందుకోసం టీడీపీ అధిష్ఠానం త్రీమెన్ కమిటీని నియమించింది. ఈ కమిటీలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ ఉన్నారు. మంత్రి సత్యప్రసాద్ సోమవారం రాత్రే నెల్లూరుకు చేరుకోగా, మిగిలిన ఇద్దరు సభ్యులు మంగళవారం ఉదయం నెల్లూరుకు చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ విస్తృత స్థాయి సమావేశంలో జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలతోపాటు ముఖ్య నేతలు, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొంటారు. ముందుగా జిల్లాలోని పరిస్థితులపై చర్చిస్తారు. అనంతరం అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటారు. ఈ ప్రతిపాదనలపై ముఖ్య నేతలందరి అభిప్రాయాన్ని త్రీమెన్ కమిటీ సభ్యులు తీసుకుంటారు. జిల్లా అధ్యక్ష పదవికి సంబంధించి ముగ్గురి పేర్లతో కూడిన నివేదికను పార్టీ అధిష్ఠానానికి అందిస్తారు. అధ్యక్షుడితోపాటు ప్రధాన కార్యదర్శి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులకు సంబంధించి కూడా అభిప్రాయ సేకరణ జరుగుతుంది. త్రీమెన్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తుది నిర్ణయం తీసుకుంటారు. కాగా జిల్లాకు విచ్చేసిన మంత్రి సత్యప్రసాద్‌ను పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఓ ఆనంద్, జేసీ కే కార్తీక్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న కలెక్టర్ ఆనంద్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సోమవారం ప్రారంభమైంది. నియోజకవర్గ స్థాయిలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి లబ్ధిదారులకు కార్డులను పంచిపెట్టారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరులో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. జిల్లాకు 7,10,990 రేషన్‌కార్డులు కాగా, వీటిని తహసీల్దార్ల పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగి రేషన్ డీలర్‌తో కలిసి అందచేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఇంటింటికి వెళ్లి ఈ కార్డులను పంచిపెడతారు. మిగిలిన కార్డులను సెప్టెంబరు 15వ తేదీ వరకు రేషన్ షాపులలో లబ్ధిదారులకు అందచేస్తారు.



ముత్తుకూరులో స్మార్ట్‌కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, డీఎస్వో విజయకుమార్

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100) : 540

విక్రయానికి సిద్ధంగా గణనాథుల విగ్రహాలు

లింగసముద్రం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీన జరగనున్న వినాయకచవితి పండగకు గణనాథుల విగ్రహాలు సిద్ధమయ్యాయి. రాజస్థాన్‌కు చెందిన యువకులు విగ్రహాలను తయారు చేసి, వాటికి అందమైన రంగులు వేసి అమ్మకాలకు సిద్ధం చేశారు. వీరు తయారు చేసిన విగ్రహాలు రూ.7 వేల నుంచి రూ.25 వేల వరకు ఉన్నాయి. ప్రస్తుతం వీరు 63 విగ్రహాలు తయారు చేసి అందుబాటులో ఉంచారు. వాటిని కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.



మందబయలు ఆక్రమణలు తొలగించండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేత మధురెడ్డి, కమ్మపాలెం గ్రామస్థులు

జలదంకి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జలదంకి పంచాయతీ పరిధిలోని కమ్మపాలెంలో సర్వే నెంబర్లు 436, 436-ఎ, 455లో 20 ఎకరాలకు పైగా మందబయలు పోరంబోకు భూమి ఆక్రమణలకు గురైందని, దానిని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధురెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కమ్మపాలెం గ్రామస్థులతో కలసి తహసీల్దారు ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పీ.భాస్కర్‌రెడ్డి, గంటా అశోక్, కుంకు వెంకటేశ్వర్లు, వర్థినేని వెంకటేశ్వర్లు, వర్థినేని బాలయ్యనాయుడు, పులివర్తి సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కమిటీ ప్రమాణ స్వీకారం

బిట్రగుంట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడుగా చిలకపాటి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు లక్కాకుల మాధవరావు, వాయిల సుధాకర్‌లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ బోగోలు మండలంలో అనేక పంటల సాగు చేస్తుంటారన్నారు. బిట్రగుంటలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సీఎం సానుకూలంగా స్పందించి స్థల పరిశీలనకై జిల్లా కలెక్టర్‌కు ఆదేశాల పంపించారని తెలిపారు. ప్రమాణస్వీకారం చేసిన వారిని శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, మధుబాబు, బీద గిరిధర్ సీపీఎం నేత పులిగడ్ల శ్రీరాములు, బీజేపీ నేతలు కే.బ్రహ్మానందం, ఎస్ఎస్‌యాదవ్, వీ.శ్రీనివాసులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కి ఆరు అర్జీలు

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 6 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుధ్యం, వీధి దీపాలు, దివ్యాంగుల పింఛన్లు తదితర సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలి

ఉలవపాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటుకు పోలీసు, విద్యుత్‌శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ అంకమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, వాహన రాకపోకలకు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. గణేషుని నిమజ్జనంలో పోలీసులు సూచించిన మార్గాలనే ఎంచుకోవాలన్నారు.

సిమెంటు బెంచీల వితరణ

కలిగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారెడ్డిపాలెంలో ప్రయాణికులు, విద్యార్థుల సౌకర్యార్థం సోమవారం పలువురు దాతలు సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ, ఆరోగ్య ఉపకేంద్రం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద గ్రామానికి చెందిన రావుల భాగ్యలక్ష్మి, చాగంటి లక్ష్మీదేవమ్మ, దండా సంపతమ్మ, సుతారు నవీన్, విశ్వాచారి, చాగంటి వెంకటేశ్వర్లు తదితరులు రూ.30వేల విలువగల 10 సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు.

29న టీఆర్ఆర్‌లో మెగా జాబ్‌మేళా

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈనెల 29న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటరు ఇమ్రాజ్‌తో కలిసి సోమవారం ఆయన కళాశాలలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పది, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9848050543, 6301543185ను సంప్రదించాలని కోరారు.

తొలగించిన దివ్యాంగుల పింఛన్ పునరుద్ధరించాలి

కావలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తొలగించిన దివ్యాంగుల పింఛన్ పునరుద్ధరించాలని బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ కోరారు. ఈ మేరకు బీసీ ఐక్యతభవన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవంగా వైసీపీ ప్రభుత్వంలో సదరన్ సర్టిఫికెట్ల మంజూరులో జరిగిన అవకతవకలపై రీ వెరిఫికేషన్ చేసి అర్హతలేని వారిని తొలగించవచ్చన్నారు. బీసీ ఐక్యతభవన్ నాయకులు ఉరిటి గోవింద్, వరప్రసాద్, దాసరి వెంకటేశ్వర్లు, దివ్యాంగులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్దనకాలనీ యానాది సంఘంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహాలు, బాల్యగర్భధారణ వలన కలిగే అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టరు కారుణ్య, న్యాయవాదులు వసంతలక్ష్మి, ఎం.మనోహర్, కలవకూరి హరిబాబు, పీ.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని లేకుంటే సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి నష్టపోతారని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజరు రమేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆర్థికఅక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో హెచ్ఎం నరసింహమూర్తి, హెడ్ కానిస్టేబుల్ బాషా, రిసోర్స్‌ట్రైనర్లు అశోక్, శ్రీను, అనిల్, మీరామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'చవితి' ఉత్సవాలకు విరాళం

కొండాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మిలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపానికి కోడె వెంకటరావు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు, టీడీపీ మాజీ కన్వీనర్ చెరుకూరు వెంకటాద్రి సోమవారం రూ.12 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు విరాళంగా అందచేశారు.

సీనియర్లకు ప్రాతినిధ్యం దక్కేనా?

● నెల్లూరులో నేడు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

కందుకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో నియోజకవర్గ నూతన కమిటీలు, అనుబంధ సంఘాలకు నూతన కమిటీలను ఎంపిక చేస్తుండటంతో కందుకూరులో చర్చనీయాంశంగా మారింది. సీనియర్లను, మొదటినుంచి పార్టీలో కష్టపడి పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నారు. అభ్యర్థుల ఎంపికపై నేతల అభిప్రాయాలు సేకరించేందుకు మంగళవారం నెల్లూరులో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం సహా ఇతర నాయకులకు ఆహ్వానాలు అందాయి. పార్టీలో కొత్త నేతలనూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నప్పటికీ సీనియర్లకూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నారు.

గణేశ్ ప్రతిమల ఏర్పాటుపై వివాదం

● తిమ్మసముద్రంలో సీఐ వెంకటరమణ, ఎస్ఐ లతీపున్నీసా చర్చలు విఫలం



గ్రామస్థులు, సర్పంచుతో చర్చిస్తున్న సీఐ, ఎస్ఐలు



తిమ్మసముద్రం రామాలయం వద్ద ట్రాక్టర్లపై ఉన్న గణనాథులు

జలదంకి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరం పంచాయతీ తిమ్మసముద్రంలో వినాయక విగ్రహాల ఏర్పాటు విషయమై ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. రామాలయం వద్ద ప్రతీ ఏడాది గణేష్ విగ్రహం ఏర్పాటు చేసి వినాయక చవితిని ఉత్సవాలు జరుపుకునేవారు. ఈ ఏడాది కూడా యువకులు చందాలు వేసుకుని విగ్రహం ఏర్పాటుకు సన్నద్ధమై గణనాథుడిని కూడా గ్రామానికి తరలించారు. అయితే రామాలయం వద్ద తామే విగ్రహాన్ని పెట్టాలని మరోవర్గం పట్టుబట్టడంతోపాటు గణనాథుడి విగ్రహాన్ని సైతం తెచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం పోలీసు స్టేషన్‌కు చేరింది. దీంతో కలిగిరి సీఐ వెంకటరమణ, జలదంకి ఎస్ఐ లతీపున్నీసా సోమవారం గ్రామానికి చేరుకుని రామాలయం వద్ద ఇరువర్గాలతో చర్చలు నిర్వహించారు. ప్రతీ ఏడాది లాగే ఈ ఏడాది కూడా వినాయక విగ్రహం పెట్టేవిధంగా చేయాలని సర్పంచు రావి ప్రసాద్‌నాయుడు కోరారు. లేనిపక్షంలో రామాలయాన్ని 100 మీటర్ల దూరంలో ఇరు విగ్రహాలు చెరోవైపు ఏర్పాటు చేసుకునేలా చేయాలని సూచించారు. దీనికి టీడీపీ వర్గీయులు ఒప్పుకోకపోగా తామే విగ్రహం పెట్టాలంటూ తేల్చిచెప్పారు. దీంతో వైసీపీకి చెందిన సర్పంచు, ఆయన అనుచరులు రెండు విగ్రహాలు మీరే పెట్టుకోండంటూ మేము దండిన చందాలు గ్రామస్థులకు వెనక్కు ఇచ్చేస్తామంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు వెళ్లిన వెంటనే టీడీపీ సానుభూతిపరులు విగ్రహం ఏర్పాటుకు పందిళ్లు వేయడం మొదలుపెట్టడంతో పోలీసులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే వినాయక విగ్రహాల ఏర్పాటుపై ఏర్పడ్డ వివాదం ఎటు దారితీస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.



శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు

● జే.మాల్యాద్రి, ఎస్ఐ, కొండాపురం

ముఖాముఖి

కొండాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏ గ్రామంలోనైనా శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం, పేకాట, కోడిపందేల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. మద్యం బెల్టు దుకాణాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్ఐ జే.మాల్యాద్రి తెలిపారు.

? శాంతిభద్రతలను కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! దొంగతనాలు, అల్లర్లు, ఘర్షణలు జరగకుండా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో నిఘా వ్యవస్థను పెంచుతున్నాం. దాతల సహకారంతో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. సర్వీసు సక్రమంగా జరగనందున ఇందులో కొన్ని పనిచేయడం లేదు. మరి కొన్ని గ్రామాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నాం.

? వినాయక చవితి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలా.

! గ్రామాల్లో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి తాత్కాలికంగా వినాయక విగ్రహం ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించే ప్రతీ ఒక్కరూ ముందుగానే అనుమతి తీసుకోవాలి. కమిటీ సరైన ఆధారాలతో స్టేషన్‌కు వచ్చినట్లయితే ఆన్‌లైన్లో నమోదుచేస్తాం. తాము సూచించిన విధంగా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేసుకొని ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కల్పించకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలి. సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా అనుమతి తీసుకోవాలి.

? మండలంలో నేరాల నమోదు శాతం ఎలా ఉంది.

! మండలంలో నేరాల నమోదు శాతం చాలా తక్కువగానే ఉంది. నెలకు సరాసరిన 10 కేసులు నమోదవుతున్నాయి. అనుకోకుంగా జరిగే నేరాలే తప్ప పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని జరిగే నేరాలు లేవు.

సంజీవని లాంటిది స్మార్ట్ రేషన్ కార్డు

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



కావలి : గిరిజన మహిళకు స్మార్ట్ రేషన్ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తదితరులు

కావలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన స్మార్ట్ రేషన్ కార్డు సంజీవనిలా పనిచేస్తాయని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 6వ వార్డు కొనదిన్నె గిరిజన కాలనీలో సోమవారం ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ, తహసీల్దారు వీ.శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ పంపిణీలో అవినీతిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాత రేషన్ కార్డుల స్థానంలో స్మాట్ కార్డులు తీసుకొచ్చిందన్నారు. అనేక సంక్షేమ పథకాలు రేషన్ కార్డుతో ముడిపడి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో రవి, సివిల్‌సప్లై డీటీ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, శ్రీనివాసులు, మొగిలి కల్లయ్య, భాస్కర్‌రెడ్డి, అయేషా, ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

● **అల్లూరు** : మండలంలోని అన్ని పంచాయతీల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరిగింది. అల్లూరు పట్టణంలోని 1వ నెంబరు రేషన్‌షాపు పరిధిలో తహసీల్దారు లక్ష్మీనారాయణతో కలసి సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఇంటింటికి రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామిరెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, అనూరాధ, రాయి నాయుడు, మునిరాజా పాల్గొన్నారు.

● **జలదంకి** : మండలంలోని 17 పంచాయతీలలో ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్యూఆర్‌కోడ్‌తో అనుసంధానించిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. జలదంకిలో తహసీల్దారు ప్రమీల, సోమశిలప్రాజెక్ట్ వైస్ చైర్మన్ పీ.మధురెడ్డి, బ్రాహ్మణక్రాకలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, అన్నవరంలో సీబీఆర్ నీటిసంఘం అధ్యక్షుడు పీ.భాస్కర్‌రెడ్డి, కమ్మవారిపాలెంలో జలదంకి పీఏసీఎస్ అధ్యక్షుడు కరియావుల అప్పలయ్యనాయుడులు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు.

● **లింగసముద్రం** : మండలంలోని 11,674 స్మార్ట్ రేషన్ కార్డులను అన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దారు ఎం కోటేశ్వరరావు, ఆర్ఐ రమణయ్య పర్యవేక్షించారు.

● **వలేటివారిపాలెం** : వలేటివారిపాలెంలో స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దారు నయీంఅహ్మద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసింహం, నాయకులు వలేటి నరసింహం, గుత్తా మహేశ్వరరావు, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను ఆంజనేయులు, ఏఆర్ఐ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● **గుడ్లూరు** : పోట్లూరు ఎస్టీ కాలనీలోని తహసీల్దారు విజయభాస్కర్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అలాగే పోట్లూరు ఓసీ కాలనీలో ఎంపీడీవో వెంకటేశ్వర రావు రేషన్ కార్డు లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు పీ.శ్రీనివాసరాజు, ఎస్‌కే రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపురం** : మండలానికి 12,069 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. ఆ కార్డు లను కొండాపురంలో ఆయన లబ్ధిదారులకు అందజేశా రు. గుడవళ్లూరులో పోలినేని చంద్రబాబునాయుడు, గరి మెనపెంటలో యారవ కృష్ణయ్య, సాయిపేటలో కుంకు మోహనరావు, భీమవరప్పాడులో విడవలపాటి శ్రీనివాసు లు, మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు, తూర్పుఎర్రబల్లిలో వి.బాల కృష్ణ పంపిణీ చేశారు.

● **ఉలవపాడు** : మండలంలో 17,000 స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టారు. ఫోన్ యాప్ ద్వారా సంబంధిత కార్డు దారులకు ఓటీపీ, ఫేస్, ఐరీష్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేసుకొని కార్డులు పంపిణీ చేస్తున్నారు. అలాగే నూతనంగా సుమారు 1500 మంది లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వక్రీకరించారు

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ● కావలి చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర



రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, అశోక్‌బాబు తదితరులు

కావలి(టౌన్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వక్రీకరించారని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. మాల జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర సోమవారం కావలికి చేరుకుంది. మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ యాత్రకు కావలి మాల జేఏసీ ఆధ్వర్యంలో రూపాయి మిద్దె సెంటర్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ట్రంకురోడ్డు మీదుగా యాత్ర నిర్వహించి బ్రిడ్జి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చింతా మోహన్ మాట్లాడుతూ మాల మాదిగల మధ్య ప్రధాని మోదీ చిచ్చు పెట్టారని ఆరోపించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమిలేయర్‌ను తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని, క్రిమిలేయర్ అనేది ఆర్థిక అసమానతలు రూపుదిద్దేందుకేనని సామాజిక అసమానతలు రూపదిద్దలేవన్నారు. ఈ కార్యక్రమంలో మాల జేఏసీ నాయకులు డీ.చెన్నకేశవులు, ఎం.సుకుమార్, బాలకృష్ణ, జ్యోతి బాలు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

● **ఉలవపాడు** : ఎస్సీ వర్గీకణతో రాష్ట్రంలో మాలలకు అన్యాయం జరిగిందని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తులిబిలి అశోక్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి మొదలైన ర్యాజ్యాంగ పరిరక్షణ యాత్ర సోమవారం రాత్రి ఉలవపాడుకు చేరుకుంది. మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పీవీరావు విగ్రహంకు పూలమాల వేసి అంబేడ్కర్ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించా రు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రిపబ్లిక్ పార్టీ వ్యవ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు, మాలల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక ఉద్యోగులు, దళిత నాయకులు నత్తా నారయ్య, వెలిచర్ల ధనకోటి, దార్ల మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కొండాపురం : ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో మాట్లాడుతున్న మత్స్యకార సొసైటీ సభ్యులు

కలిగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఆలయ ఆస్తుల పరిరక్షణకు కార్యాచరణ రూపొందిస్తు న్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని చిన అన్నలూరు పంచాయతీలో సోమవారం జరిగిన వేణు గోపాలస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో నియో జకవర్గంలోని ఆలయాల పటిష్ఠతకు చర్యలు తీసుకుం టామని తెలిపారు. దేవస్థాన చైర్మన్‌గా వేముల ప్రసాద్‌తోపాటు తొమ్మిది మంది సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ.రామారావు, బాసం నరసింహులు నాయు డు, కొండపనాయుడు, మదన్‌కుమార్, గోవిందయ్య, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీ సమస్య పరిష్కరించండి

● **కొండాపురం** : మండలంలోని సాయిపేట పంచాయతీకి చెందిన మత్స్యకారుల సొసైటీ సమస్య పరిష్కరించాలని పంచాయతీ అభివృద్ధి వేదిక సభ్యులు గంటా శ్రీనివాసప్రసాద్, భీమిరెడ్డి అరుణ, టీడీపీ నాయకుడు వల్లూరు వెంకటేశ్వర్లు, మత్యకార సొసైటీ అధ్యక్షుడు కనకయ్య, పలువురు సభ్యులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం వింజమూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పంచాయతీలోని ముస్లిం, మైనారిటీలు, రజకులు, యానాది సామాజిక వర్గానికి చెందిన 150 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అన్ని సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంద్ర శ్రీహరి, దామా మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

● సీపీఎం నేత మోహనరావు



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

కావలి(టౌన్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలకు జీవో నెంబరు 30 ప్రకారం ఉన్నచోటే ఇళ్లస్థల పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మామిళ్లపల్లి మోహన్‌రావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు లేని పేదలకు రెండు సెంట్ల స్థలం, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. దానితోపాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. పేదలకు రెండు సెంట్ల భూమి ఇచ్చేందుకు ప్రభుత్వాలకు మనసు ఒప్పడం లేదని, బడా బాబులకు వేల ఎకరాలు అప్పనంగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయంలో వసతులు కల్పించి లబ్ధిదారులకు గృహాలు అప్పజెప్పాలన్నారు. ప్రభుత్వం పేదవారికి ఇంటి స్థలాలు గృహాలు ఇచ్చే వరకు దశల వారి పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమోహన్, బీ.కృష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లు, జీ.మధుసూదన్‌రావు, ఎస్ వెంకయ్య, రమణయ్య, లక్ష్మయ్య, శైలజ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో అక్రమాలపై త్వరలో చలో అన్నవరం

● మాజీ మంత్రి కాకాణి

కావలి(టౌన్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అన్నవరం క్వారీలో అవినీతి అక్రమాలు వెలికితీసేందుకు చలో అన్నవరం కార్యక్రమానికి శ్రీకారం చుడతామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పీ.చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ క్వారీలో అక్రమాలను సాక్ష్యాలతో తెలుసుకునేందుకు ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రయత్నిస్తే అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టడం ప్రజల దృష్టి మరల్చేందుకేనన్నారు. మనీ స్కామ్ నిర్వాహకుడు సుభాని వద్ద ఎవరి వాటా ఎంతో, సూత్రధారులు ఎవరు బయటకు వస్తాయన్నారు. చలో అన్నవరం కార్యక్రమం తేదీని మంగళవారం ఖరారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కాకాణి కుమార్తె వైసీపీ రీజియన్ మహిళా అధ్యక్షురాలు పూజిత, నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవూరులో సోమవారం హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ కంట్రోల్ యూనిట్‌ల ఆధ్వర్యంలో మదర్‌ల్యాండ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూ సునీత, పీఈ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిద్ధి విఘ్నేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పప్పులవీధి సిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ బయ్యా ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆలయంలో ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం నదీ తీర్థ గ్రహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. బుధవారం ఉదయం 9గంటలపైన ధ్వజావరోహణం జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం మూషిక వాహనంపై నగరోత్సవం జరుగుతుందని, భక్తులు తరలిరావాలని కోరారు. 31వతేదీ ఆదివారం సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామికి కల్యాణం, గజవాహనోత్సవం, సెప్టెంబరు 4వతేదీ వసంతోత్సవం జరుగుతాయని తెలిపారు.

మట్టి వినాయకులను పూజిద్దాం



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, తదితరులు

గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలంటూ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడపత్రికను కలెక్టర్ ఆనంద్ ఆవిష్కరించారు. తిక్కనభవన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మట్టి గణపతులను వాడి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో ఫత్తేఖాన్‌పేట రైతు బజారులో 2 వేల మట్టి వినాయక ప్రతిమలను బుధవారం ఉదయం 10.30గంటలకు ప్రజలకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.



పీవోపీ.. రంగుల బొమ్మలు మార్కెట్‌ను ఏలుతున్నా ఆ గ్రామస్థులు మాత్రం తమ కులవృత్తిని వీడలేదు. వినాయక చవితి వచ్చిందంటే చాలు నెల రోజుల నుంచే ఆ గ్రామంలో సందడి నెలకొంటుంది. అప్పటివరకు కులవృత్తిని పక్కన పెట్టేసిన వారు కూడా గణనాథుల ప్రతిమల తయారీలో నిమగ్నమవుతారు. జిల్లా నలుమూలలకు తరలించి విక్రయిస్తారు. తమ చేతి వేళ్లతో రూపుదిద్దుకున్న గణనాథులు ప్రతి ఇంటా పూజింపబడటం తమ అదృష్టంగా భావిస్తారు వెంగారెడ్డిపాళెం కుమ్మర్లు. పెద్దగా ఆదాయం లేకపోయినా కూలి గిట్టుబాటు అయితే చాలని సంతృప్తితో సంప్రదాయంగా కొనసాగిస్తూ పరోక్షంగా పర్యావరణహితులుగా ఉన్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)



మట్టి గణనాథులకీ.. జై!

- తరతరాలుగా ప్రతిమల తయారీ
- సంప్రదాయంగా కొనసాగిస్తున్న వెంగారెడ్డిపాళెం కుమ్మర్లు
- జిల్లా అంతటా తరలింపు.. విక్రయాలు

సంగం మండలంలోని వెంగారెడ్డిపాళెం ఒక కుగ్రామం. ఒకప్పుడు సుమారు 30 కుటుంబాలకుపైగా కుమ్మరులు కులవృత్తినే నమ్ముకుని జీవించేవారు. కానీ సమాజంలో కుండల వినియోగం పూర్తిగా అంతరించింది. దీంతో ఒకరిద్దరు తప్ప మరెవరూ ఆ వృత్తిని చేయడం లేదు. కానీ వినాయక చవితి పండగ వచ్చేందంటే చాలు గ్రామస్థులంతా ఏకమవుతారు. ప్రతి ఇంటా పూజించే మట్టి గణనాథులను తయారు చేయడం అదృష్టంగా భావించి సుమారు 20 కుటుంబాలు గణనాథుల ప్రతిమలను తయారు చేస్తున్నాయి.

● నెల రోజుల ముందు నుంచే..

ప్రతి ఏడాది వినాయక చవితికి నెల ముందు అంటే ఏరువాక ఏకాసి నుంచే వీరు మట్టి వినాయక విగ్రహాల తయారీలో నిమగ్నమవుతారు. ప్రతిమల తయారీకి అందుబాటులో మట్టి లభ్యం కాకపోయినా దూరప్రాంతం నుంచి తెప్పించుకుంటారు. సాధారణంగా పాత్రలు తయారీకి కాళ్లతో మట్టిని తొక్కి అనువుగా చేసుకొంటారు. అదే గణనాథుల (బొమ్మల) తయారీకైతే ఎంతో నిష్ఠతో చేతులతోనే మట్టిని మెత్తగా పిసికి సిద్ధం చేస్తారు. అర అడుగు నుంచి అడుగు ఎత్తు ఉండేలా వివిధ ఆకారాల్లో ప్రతిమలను తయారు చేస్తారు. మొదట్లో చేతితో మట్టి గణపతులను తయారు చేస్తుండగా, ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో అచ్చుల ఆధారంగా ప్రతిమలను తయారు చేస్తున్నారు. అలా తయారు చేసిన వాటిని వారం రోజులపాటు నీడలో ఆరబెట్టి వివిధ సహజమైన రంగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ముందుగా ఆర్డర్ ఇస్తే 10 అడుగుల భారీ మట్టి విగ్రహాలను తయారు చేయగల నైపుణ్యం కలిగిన కళాకారులు ఈ గ్రామంలో ఉన్నారు. కానీ ధర ఎక్కువ కావడంతో ఎవరూ ముందుకు రావడం లేదు.



ఆర్డర్ ఇచ్చిన వారికి ఆటోలో బొమ్మలు తరలిస్తూ..

● జిల్లావ్యాప్తంగా తరలింపు

వెంగారెడ్డిపాళెంవాసులు తయారు చేసిన గణనాథులను పండక్కి నెల్లూరు, బుచ్చి, కావలి, కోవూరు తదితర పట్టణాలకు విక్రయించేవారు. ఖర్చు లు పెరుగుతుండటంతో వీరికి గిట్టుబాటు కావడం లేదు. వచ్చిన ఆదాయంతోనే సంతృప్తి పొందుతూ సంవత్సరాల నుంచి సంప్రదాయాన్ని వదలకుండా కొనసాగిస్తున్నారు.

● 30 వేల ప్రతిమలు

మీడియా మాధ్యమాల వల్ల వెంగారెడ్డిపాళెంలో మట్టి గణనాథుల తయారీ విషయం జిల్లా అంతటా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి ఎంతో మంది దాతలు, విక్రయదారులు ముందుగానే వీరికి ఆర్డర్లు వస్తున్నాయి. దీంతో 25 వేల నుంచి 30 వేల వరకు బొమ్మల తయారు చేసి సరఫరా చేస్తున్నారు.

ప్రోత్సాహం లేకున్నా..

వెంగారెడ్డిపాళెం ప్రజలకు పెద్దగా అక్షర జ్ఞానం లేకపోయినా తమ చేతితో తయారైనా గణనాథులు ఇళ్లలో పూజిం ప బడుతున్నాయనే సంతృప్తితో ఎంతో భక్తి, నిష్ఠతో గణనాథులను తయారు చేస్తున్నారు. ప్రభు త్వం నుంచి ఎలాంటి ప్రోత్సా హం లేకున్నా మట్టి విగ్రహాల తయారీలో గిట్టుబాటుకాకున్నా సంతృప్తి కోసం మట్టి గణపతులను తయారీని కొనసాగిస్తున్న పర్యావరణ హితులుగా ఉన్న వీరికి అభినందనీయం.

ఎంతో సంతృప్తినిస్తోంది!



వినాయక పండుగకు నెల రోజుల ముందు నుంచే మా గ్రామంలో సందడి ఉంటుంది. వినాయక బొమ్మలను ఆర్డర్‌పై తయారు చేయించుకోవడానికి ఎక్కడెక్కడ నుంచో వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మా గ్రామానికి వస్తున్నారు. మా మట్టి గణనాథులు వందల ఇళ్లలో కొలువై పూజింపబడుతుంటం ఎంతో సంతృప్తినిస్తుంది. పెద్దగా ఆదాయం లేకపోయినా కూలి గిట్టుబాటుకే తయారు చేసి ఇస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, తయారీదారుడు

బార్లు... బోర్లా!!

- ఒక్క దరఖాస్తూ పడలేదు
- నేటితో ముగియనున్న గడువు
- గత ప్రభుత్వ నిబంధనలే...
- అయినా ఆసక్తి చూపని యజమానులు
- ఇంకెవరూ ముందుకు రాకుండా హుకుం?

నెల్లూరు(క్రైం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం బార్ల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ఉన్న బార్ల గడువు ఈ నెలాఖరుకు ముగుస్తుండటంతో నూతన బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లాలో 50 బార్లు, గీత కులాలకు 5 బార్లు కేటాయించేలా మార్గదర్శకాలతో నూతన పాలసీని అందుబాటులోకి తీసుకువచ్చింది. గత ప్రభుత్వంలో ఉన్న నిబంధనలే అయినప్పటికీ ప్రస్తుత బార్ల యజమానులు ఎవరూ మళ్లీ దరఖాస్తుకు ఆసక్తి చూపడం లేదు. అప్పట్లో వేలం పాటలో పోటీ పడి మరీ బార్లను దక్కించుకున్న వ్యాపారస్తులు ఈ సారి అడుగు ముందుకు వేయడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బార్ల పాలసీతో తమకు అనేక సమస్యలు ఉన్నాయని, తాము దరఖాస్తు చేసుకోమని ఇప్పటికే జిల్లాలోని బార్ల అసోషియేషన్ నాయకులు స్పష్టం చేశారు. అంతేకాదు ఇంకెవ్వరూ కూడా దరఖాస్తు చేసుకోకూడదంటూ హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా నూతన పాలసీ ప్రకారం బార్లకు దరఖాస్తు గడువు మంగళవారంతో ముగియనుంది. అయితే ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం.



నేటితో గడువు ముగుస్తుంది

ప్రభుత్వం విడుదల చేసిన బార్ల పాలసీకి సంబంధించి నేటితో గడువు ముగుస్తుంది. జిల్లా వ్యాప్తంగా 50 బార్లు ఉండగా ఇప్పటి వరకు ఒక్క బారుకు కూడా దరఖాస్తు పడలేదు. నేడు వస్తాయని చూస్తున్నాము.

- శ్రీనివాసులు నాయుడు, ఎక్సైజ్ ఈఎస్



గంజాయి విక్రేతల వివరాలు వెల్లడిస్తున్న సీఐ

నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించే నలుగురిని సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు తన కార్యాలయంలో నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. నెల్లూరులోని కపాడిపాలెం రాయపువారి వీధికి చెందిన షేక్ సుభాని, షేక్ సిరాజ్ దంపతులు గంజాయి విక్రయి స్తుంటారు. గతంలో పోలీసులు సుభానిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఆమె భర్తపై సుమారు ఎనిమిది కేసులున్నాయి. అయినా వారి తీరులో మార్పు రాలేదు. విశాఖ ఏజన్సీ నుంచి కేజీ గంజాయిని రూ.1000 చొప్పున కొనుగోలు చేసి నెల్లూరుకు తీసురువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ప్యాకెట్ రూ.150 నుంచి 300 వరకు విక్రయిస్తున్నారు. ఆదివారం గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న సంతపేట ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు బాలకృష్ణ, సుల్తాన్‌బాషా కలిసి వారి ఇంటిపై దాడి చేశారు. దంపతులిద్దరితోపాటు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న అదే ప్రాంతానికి చెందిన కే జ్యోతి, రూరల్ మండలం కోడూరుపాడు గ్రామ కల్తీకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ షేక్ మీరను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6 కేజీల 350 గ్రాముల గంజాయి, రూ.22,500 నగదు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా నగరంలో విక్రయాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మద్యం తాగొద్దన్నందుకు వాచ్‌మన్ ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని వాచ్‌మెన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నెల్లూరులోని ఆచారివీధిలో చోటుచేసు కుంది. పోలీసుల సమాచరం మేరకు... నేపాల్‌కు చెందిన భికాష్(25), శిరిజన కూలీలు. ఏడాది కిందట వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఐదునెలల కిందట ఉపాధి నిమిత్తం నెల్లూరుకు వచ్చారు. ఆచారవీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో బికాష్ వాచ్‌మన్‌గా, అతని భార్య పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం బికాష్ స్నేహితులతో మద్యం సేవించి అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. అనంతరం తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడుతుండగా వారు ఎందుకు మద్యం తాగావని మందలించారు. భార్య సైతం ఇప్పటి వరకు లేని అలవాటు ఎందుకు చేసుకున్నావంటూ నిలదీసింది. అనంతరం భోజనానికి పక్క గదిలోకి వెళ్లింది. దీంతో బికాష్ సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకున్నాడు. గమనించిన భార్య, సన్నిహితులు కలిసి బికాష్‌ను రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

1 నుంచి పోషకాహార మాసోత్సవాలు

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సెప్టెంబరు 1 నుంచి 30వ తేదీ వరకు పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక విలువల కలిగిన ఆహారం గురించి తల్లులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

'పెట్టుబడి పెట్టి మోసపోయాం'

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌కు చెందిన వీవీడీ రీవింగ్ ప్రై లిమిటెడ్ కంపెనీలో రూ.1.50 కోట్లు పెట్టుబడి పెట్టి మోసపోయామని నెల్లూరు నగరానికి చెందిన విజయలక్ష్మి, షేక్ హసీనా, డీ మాల్యాద్రి, సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. వీవీడీ కంపెనీ సీఈవో రాజశేఖర్‌రెడ్డి, ఎండీ రావుల సౌందర్య భార్గవి, డైరెక్టర్లు శశాంక్, రావుల మీరా తమను మోసం చేశారన్నారు. వారి కంపెనీలో పెట్టుబడి పెట్టితే మంచి లాభాలు వస్తాయని మాయ మాటలు చెప్పడంతో అగ్రిమెంట్ చేసుకున్నా మన్నారు. వారి మాటలు నమ్మి బ్యాంకుల్లో అప్పు చేసి డిపాజిట్ కట్టామని తెలిపారు. తర్వాత ఆ కంపెనీకి చెందిన వారందరూ డబ్బుతో పరారయ్యారని, పోలీసుకు ఫిర్యాదు చేశామని న్యాయం చేయాలని కోరారు.

ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కి 93 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 93 అర్జీలు వచ్చా యి. ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ఫిర్యాదులను త్వరితగ తిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల న్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పెరుగుతున్న అర్జీలు

పరిష్కారం ఎప్పుడో!

- కలెక్టర్ హెచ్చరిస్తున్నా కానరాని ఫలితం
- పీజీఆర్‌ఎస్‌కి 426 అర్జీలు
- వాటిలో రెవెన్యూవే 166

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు రాను రాను అర్జీల సంఖ్య పెరిగిపోతోంది. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యంతో ఈ అర్జీల సంఖ్య ఎక్కువవుతున్నట్లు సమాచారం. రెవెన్యూ శాఖకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటి పరిష్కార విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ప్రతీవారం కలెక్టర్ ఆనంద్ హెచ్చరిస్తున్నారు. అయినా మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలకు సకాలంలో పరిష్కారం లభించటంలేదు. కాగా, సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌కు 426 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 166, సర్వేశాఖవి 46 ఉన్నాయి. మిగిలినవి వివిధ శాఖలకు చెందినవి. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అర్జీలన్నింటినీ నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం వహించిన శాఖలపై చర్యలు తీసుకుంటా మని మరోసారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ



దగదర్తి గ్రామ కొత్త హరిజనవాడ మహిళలు

● దాబా మాటున మహిళలను వేధిస్తున్నారు!

దగదర్తి మండల కేంద్రంలో కొత్త హరిజనవాడ కు పోయే దారిలో బీమాస్ ధాబా ఏర్పాటు చేసి మహిళలను వేధిస్తున్నారని స్థానిక మహి ళలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాకి జ్యోతి, కర్నాటి సంధ్య, బుజ్జమ్మ, ఎస్తేరమ్మ, సుజాత తదితరులు మాట్లాడుతూ బీమాస్ ధాబా యాజమాన్యం అక్రమంగా మద్యం అమ్మ కాలు జరుపుతోందని ఆరోపించారు. ఆ మార్గాన వెళ్లే మహిళలను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, వేధిస్తున్నారని చెప్పారు. ధాబా యజమాని వినయ్, ఆయన మిత్రులకు విషయం తెలిపితే వారు కూడా అసభ్యంగా మాట్లాడుతూ దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకుని, ఆ ప్రాంతం నుంచి ధాబాను తొలగించాలని కోరారు.

● తాగునీటి బోరును ఆక్రమించారు

ప్రజల దాహార్తిని తీర్చే తాగునీటి బోరును ఆక్రమించారని కొండాపురం మండల గుడవ ళ్లూరు సర్పంచ్ బద్దిపూడి మాచర్ల, ఉప సర్పంచ్ వేములపాటి మణికుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామంలోని సర్వే నంబరు 473-1లోగల పంచాయతీ స్థలంలో గ్రామ ప్రజల కోసం బోరు వేయించామని చెప్పారు. అయితే ఇటీవల గ్రామానికి చెందిన శ్రీనివాసులు, చెంచు రామయ్య ఆ స్థలాన్ని ఆక్రమించి గదులు కట్టించారన్నారు. నీటి సరఫరా ట్రాక్టరు బోరు వద్దకు వెళ్లడానికి లేకుండా ఆటంకం కలిగిస్తున్నారని తెలిపారు. దీంతో గ్రామస్తులకు తాగునీరు అందడం లేదని, కారకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



గుడవళ్లూరు సర్పంచి బద్దిపూడి మాచర్ల, ఉపసర్పంచి వేములపాటి మణికుమార్

72 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి చోరీ

● తాళాలు పగులగొట్టి దోపిడీ

నెల్లూరు(క్రైం) ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను దోచుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఎన్‌జీవో కాలనీలో రాజేశ్వరి కుటుంబం నివసిస్తోంది. ఈ నెల23వ తేదీన కుటుంబమంతా కలిసి సైదాపురం మండలం చికవోలులో గ్రామదేవత ఉత్సవానికి వెళ్లారు. ఆ సమయంలో దుండగులు రాజేశ్వరి ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న 72 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 500 గ్రాములు వెండి వస్తువులు దోచుకెళ్లారు. రాజేశ్వరి కుటుబం 24వ తేదీ రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు కన్పించలేదు. ఈ మేరకు సోమవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా స్టీల్ తరలించిన వారిపై కఠిన చర్యలు

● హౌసింగ్ ఈఈ నారాయణరెడ్డి

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు గృహ నిర్మాణశాఖ గోదాము నుంచి అక్రమంగా స్టీలు తరలించిన వారిపై త్వరలో చర్యలు చేపట్టడం జరుగుతుందని హౌసింగ్ ఈఈ పీవీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విజయవాడ విజిలెన్స్ డీఈ పీ చంద్రశేఖర్ రాజుతో కలిసి గోదామును పరరిశీలించి అనంతరం కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. దుత్తలూరు మండలానికి ప్రభుత్వం ఎన్ని టన్నుల స్టీలు మంజూరు చేసింది, లబ్ధిదారులకు ఎంతమేర పంపిణీ చేశారు, నిల్వ ఎంత ఉంది, వాటిల్లో వ్యత్యాసాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా స్టీలు తరలించిన ఉదయగిరి ఏఈ రామకృష్ణపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడం జరిగిందన్నారు. వారు త్వరలో అతనిపై చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీచేసే అవకాశముందన్నారు. స్టీల్ అక్రమ తరలింపునకు సంబంధించి ఇంకా ఎవరిదైనా హస్తం ఉందో పోలీసుల విచారణలో తేలాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ పీరాన్, ఏఈ యప్రాయం, వర్కుఇనస్పెక్టర్లు పోలయ్య, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు